ISSN 2581-3153

రాయలసీమ జాగృతి

తెలుగు మాసపత్రిక

అక్షరాల అమ్ములపొది

సంపుటి : 02 సంచిక : 10
ఏప్రిల్ 2018 వెల : 20/-



ISSN 2581-3153

సంపుటి : 02 సంచిక : 10

ఏప్రిల్ 2018

సంపాదకీయం

ప్రజాస్వామ్య విలువల జర్నలిజానికి ఆద్యుడు అంబేద్కర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారతదేశ రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా ఈదేశంలోని మహిళల, కార్మికుల, బడుగుల, బలహీనవర్గాల, కర్షకుల, జర్నలిస్టుల మైనార్టీల హక్కుల కోసం జీవితాంతమూ పనిచేశారు. ఈదేశపు గొప్ప సాంఘిక సంస్కర్తలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఒకరు. భారతదేశం వర్ణ వ్యవస్థతో, కుల వివక్షతతో మతపరమైన ఆందోళనలతో జాతి సమైక్యతకు భంగం వాటిల్లుతున్న తరుణంలో తన పత్రికలైన మూక్‌నాయక్, బహిష్కృత భారత్, సమతా, జనతా పత్రికల ద్వారా చారిత్రక యుద్ధాన్ని ప్రకటించారు. అంబేద్కర్ తన జర్నలిజం ద్వారా చరిత్రలో మొదటిసారిగా మహిళలు, బలహీనవర్గాల సమస్యలను వెలికితీయడంలో సఫలీకృతులయ్యారు. దురదృష్టవశాత్తు చరిత్రకారులెవరూ అంబేద్కర్ జర్నలిజానికి అందించిన సేవలను నమోదు చేయలేకపోయారు.

అంబేద్కర్ అనగానే భారత రాజ్యాంగ రూపశిల్పి, బహుముఖ ప్రజ్ఞాశాలి, దళిత వర్గాల వైతాళికుడు ఇలా ఎన్నో విశిష్టతలు గుర్తుకొస్తాయి. అయితే చాలా మందికి తెలియని కోణం ఏమిటం టే అంబేద్కర్ మంచి పాత్రికేయుడు, సంపాదకుడు కూడా. అద్భుతమైన ఆంగ్లంలో తన పాండిత్యాన్ని దశదిశలా చాటిన అంబేద్కర్ పాత్రికేయుడుగా మాత్రం అచ్చమైన మరాఠీలో తన భావాలను ప్రభావవంతంగా వెలిబుచ్చేవారు. 1920లో అంబేద్కర్ పత్రికా ప్రపంచంలోకి అడుగుపెట్టారు. ఆయన పెట్టిన తొలి వార్తాపత్రిక 'మూక్‌నాయక్'. భారతదేశంలో వేల ఏళ్ల నుంచి పాతుకుపోయిన నిచ్చనమె ట్ల కుల వ్యవస్థలను, అంటరానితనాన్ని కూల్చివేయడానికి తన పత్రిక ద్వారా ప్రజలను ఉద్యుక్తులను చేశారు. ఈదేశంలోని నిమ్నవర్గాల వారు బానిసలుగా ఉండటానికి కారణం వారి నిరక్షరాస్యత, విజ్ఞానలేమి అని భావించి వారికి అక్షరాస్యతను కల్పించడానికి తీవ్రమైన కృషి చేశారు. మూక్‌నాయక్ పక్ష పత్రికను మూడేళ్లపాటు విజయవంతంగా నడిపి అనివార్య కారణాల వల్ల మూతవేశారు. తరువాత 1927 నుంచి 1929 దాకా బహిష్కృత భారత్, 1930 నుంచి 1956 దాకా జనతాపత్రి కలను నడిపారు. 1956లో ప్రబుద్ధ భారత్ ప్రారంభించారు. ఆయన భావాల్లో పాండిత్యమున్నా, భాష సరళంగా ఉండి అందరికీ అర్థమయ్యేలా ఉండటం, మరాఠీపై పట్టు, పాఠకులను అబ్బురపరిచేవి. నిజానికి ఆంగ్ల మాధ్యమంలో విద్యనభ్యసించడం వల్ల మరాఠీపై తొలినాళ్లలో పట్టు తక్కువే ఉన్నా క్రమేపీ దానిని అధిగమించడానికి తీవ్ర సాధన చేశారు. అంబేద్కర్ మరాఠీ సాహిత్యంలోని వివిధ కోణాలను అర్థం చేసుకుని, ఆ భావాలను తన సంపాదకీయాల్లో, వ్యాసాల్లో ప్రతిఫలింపచేసేవారు.

అంబేద్కర్ భావాలు ఎంత గొప్పవైనా, ఎంత ఉదాత్తమైనవైనా తగినన్ని నిధులు లేకపోవడం వల్లనే తొలి రెండు పత్రికలు (మూక్‌నాయక్, బహిష్కృత భారత్) త్వరగా మూతపడ్డాయి. నిధులు లేకపోవడానికి కారణం మళ్లీ ఆయన ఉదాత్తమైన ఆశయాలు, గొప్ప భావాలే. అది ఎలాగంటే బాంబే క్రానికల్, కేసరి వంటి పత్రికల్లో వచ్చే బాధ్యతారహితమైన వాణిజ్య ప్రకటనలను, మతపరమైన సాహిత్యాన్ని ఒకసారి ఆయన తన బహిష్కృతభారత్ పత్రిక సంపాదకీయంలో కడిగిపారేశారు. అసమానత్వాన్ని, కర్మకాండలను గొప్పగా చూపే వాణిజ్య ప్రకటనలను దునుమాడారు. అనైతికమైన, నీచమైన అలాంటి ప్రకటనలను తన పత్రికలో అనుమతించడం కన్నా ఎలాంటి వాణిజ్య ప్రకటనలు లేకుండానే తన పత్రిక ప్రచురిస్తానని తేల్చిచెప్పారు. చారిత్రాత్మకమైన మహద్ పోరాటంలో 'బహిష్కృతభారత్' కీలకపాత్ర పోషించింది. 1927లో మహారాష్ట్రలో ఒక హిందూ ప్రముఖుడి మనమరాలు ముస్లింను పెళ్లిచేసుకోవడం సంచలనం సృష్టించింది. ఆ పెళ్లిని ప్రముఖ మరాఠా పత్రికలన్నీ వ్యతిరేకించగా, అంబేద్కర్ ఒక్కరే సమర్థించారు. అలాంటి మతాంతర వివాహాలు హిందూ ముస్లింల మధ్య విశ్వాసాన్ని పెంచుతాయని తన సంపాదకీయంలో రాశారు. పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత విషయమని దాంట్లో ఇతరులకు ఎలాంటి పాత్ర లేదని తేల్చిచెప్పారు. ఇలా పలు సామాజిక అంశాలపై బాబా సాహెబ్ పాత్రికేయుడుగా చెరగని ముద్ర వేసి ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరించడానికి అవిరళ కృషి చేశారు.

ప్రధాన సంపాదకులు
ఎస్. శ్రీహరి మూర్తి
M.A., H.PT.,
సెల్ : 9866216044

సహ సంపాదకులు : ఎస్. సిరిప్రియ
గౌరవ సంపాదకులు :
ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి
సంపాదక మండలి సభ్యులు :
ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,
ఆచార్య కె. ఆశాజ్యోతి,
ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ,
డా॥ కోయి కోటేశ్వరరావు,
గంటేడ గౌరీనాయుడు

విషయ సూచిక...

1. కర్మభూమిలో కామానికి బలైన అసిఫా 4లో...
2. రాయలసీమ వృష్టి నృత్యం... 7లో...
3. అనంత జీవన నవలా పాత్ర చిత్రణ 13లో..
4. ఎడారి బతుకులు 17లో..
5. అంబేద్కర్ భారతమిదేనా 18లో...
6. అహింసా పాఠాలు నేర్పిన నేల... 22లో...
7. అస్తిత్వ చైతన్యం... 24లో...
8. మహిళా హక్కులకై ఆరాటం... 28లో..
9. కడప డిక్లరేషన్ 32లో...

ప్రధాన కార్యాలయం
డో.నెం.13/3-645, ఖాజానగర్
గంగాగౌరి థియేటర్ దగ్గర, అనంతపురం

ఈ పత్రికలో వెలువరించిన అభిప్రాయాలు, వ్యాసాలలో వివాదాలు అనంతపురము కోర్టు పరిధిలో మాత్రమే.

రచయితలు వెలుబుచ్చిన అభిప్రాయాలు పత్రికవి కానవసరం లేదు.

rayalaseemajagruti@gmail.com

కర్మభూమిలో కామానికి బలైన
ఆసిఫా

ఎనిమిదేళ్ల బాలిక ఆసిఫా బానూపై సామూహిక అత్యాచారం, హత్య ఘటన జమ్మూ కశ్మీర్‌లో కల్లోలం సృష్టిస్తోంది. బాధితురాలు గుజ్జర్ ఆదివాసీ సముదాయానికి చెందినది కాగా, నిందితుల్లో అత్యధికులు పోలీసులున్నారు.

సాధారణంగా ఎక్కడైనా రేప్ వంటి ఘోరాలు జరిగితే నిందితులను అరెస్టు చేయాలంటూ నిరసన ప్రదర్శనలు జరుగుతుంటాయి. కానీ జమ్మూలో మాత్రం కేసులో అరెస్టయిన నిందితులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏకంగా ఇద్దరు రాష్ట్ర మంత్రులే వీధుల్లోకొచ్చారు. ఆ మంత్రులు జాతీయ జెండాలు చేతపట్టుకుని మరీ నిందితులకు న్యాయం జరగాలంటూ నినాదాలు చేశారు. ఇది బాగా వివాదాస్పదమైంది. అసలేం జరిగింది? చిన్నారిపై అత్యాచారం చేసి చంపేసింది ఎవరు? ఈ కేసు దర్యాప్తులో వెల్లడవుతున్న విషయాలేంటి? వీటిపై శ్రీనగర్ నుంచి జర్నలిస్టు సమీర్ యాసిర్ బీబీసీ కోసం రాసిన కథనం ఇది...

అది జనవరి 17వ తేదీ ఉదయం. ముహమ్మద్ యూసఫ్ పుజ్వాలా తన ఇంటి ముందు కూర్చుని వున్నాడు. ఇంతలో పక్కంటి వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చి పుజ్వాలా వద్ద ఆగాడు. ఆయసపడుతూ పిడుగులాంటి వార్త చెప్పారు. కనిపించకుడా పోయిన పుజ్వాలా ఎనిమిదేళ్ల కుమార్తె శవం సమీపంలోని అడవిలో దొరికిందని తెలిపాడు.

<u>అసలేం జరిగింది?</u>

పుజ్వాలాది ముస్లింలలో గుజ్జర్ సముదాయానికి చెందిన కుటుంబం. హిందువుల ప్రాబల్యం అధికంగా ఉండే జమ్మూ నగరానికి తూర్పున సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న రసనా గ్రామంలో నివాసముంటున్నారు. గుజ్జర్ సముదాయానికి చెందిన ప్రజలకు గొర్రెల పెంపకమే ప్రధాన వృత్తి. హిమాలయ పరిసరాల్లో గొర్రెలు, బర్రెలు, గుర్రాలు మేపుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటారు.

వీరి కూతురు ఆసిఫా బానో జనవరి 10న కనిపించకుండా పోయింది. మేత కోసం అడవికి వెళ్లిన గుర్రాలను ఇంటికి తోలుకొచ్చేందుకు ఆసిఫా వెళ్లింది.

గుర్రాలు ఇంటికొచ్చాయి. కానీ ఆసిఫా రాలేదు. అడవికెళ్లిన బిడ్డ తిరిగి వస్తుందని సాయంత్రం వరకు తల్లి నసీమా ఎదురుచూసింది. ఎంతకూ రాకపోయేసరికి ఆ విషయాన్ని తన భర్త పుజ్వాలకు చెప్పింది. వెంటనే ఇరుగుపొరుగు వారి సాయంతో చిన్నారి కోసం వెతికారు. టార్చిలైట్లు, లాంతర్లు పట్టుకుని అడవిలో రాత్రంతా గాలించారు. అయినా జాడ దొరకలేదు. రెండు రోజుల తర్వాత అంటే జనవరి 12న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారని పుజ్వాలా చెప్పారు. పైగా 'ఆమె తన బాయ్ ఫ్రెండ్‌తో పారిపోయి ఉంటుంది' అని తిలక్ రాజ్ అనే పోలీసు అధికారి హేళనగా మాట్లాడటంతో తన మనస్సు చివుక్కుమందని ఆయన తెలిపారు.

<u>నిందితుల్లో పోలీసు అధికారులు</u>

బాలిక అదృశ్యం ఘటన గురించి ఆ నోటా, ఈనోటా గుజ్జర్లందరికీ తెలిసిపోయింది. దాంతో వారు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. దాంతో ఆసిఫా జాడ కనిపెట్టేందుకు ప్రభుత్వం ఇద్దరు పోలీసు అధికారులను నియమించింది. వారిలో ఒకరు 28 ఏళ్ల దీపక్ ఖజురియా, నిజానికి ఈ కేసులో అతను కూడా నిందితుడే. కేసు నమోదు చేసిన పోలీసులు పాప కోసం వెతకడం మొదలుపెట్టారు.

అంతటా వెతికారు, కానీ రెండు ప్రాంతాలకు మాత్రం వెళ్లలేదు. 'సంజీరామ్ నివాసం (బాలిక హత్యకు ప్రణాళిక రచించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ మాజీ ఉద్యోగి ఇల్లు)తో పాటు గ్రామంలోని ఆలయంలో పోలీసులు వెతకలేదు అని జాన్ తెలిపారు. ఏడు రోజుల తర్వాత ఆసిఫా శవం దొరికింది.

నా బిడ్డను తీవ్రంగా హింసించి చంపేశారు. కాళ్లు విరిచేశారు. గోళ్లు నల్లగా కమిలిపోయాయి. చేయి, వేళ్లపై పచ్చని, ఎర్రని గుర్తులు ఉన్నాయి అంటూ ఆసిఫా తల్లి నసీమా బోరున విలపించారు. కొన్నేళ్ల క్రితం పుజ్వాలా ఇద్దరు కూతుళ్లు ఓ ప్రమాదంలో చనిపోయారు. దాంతో తన బావమరిది కూతురైన ఆసిఫాను వారు దత్తతకు తీసుకున్నారు. ఇప్పుడు ఆసిఫా లేకుండాపోవడంతో ఆ దంపతులు బోరుమన్నారు.

నా చిట్టితల్లికి భయంకరమైన నరకం చూపించారని నాకు తెలుసు అని 52 ఏళ్ల పుజ్వాలా చెమర్చిన కళ్లతో బీబీసీకి చెప్పారు. 'ఆసిఫా. ఆసిఫా' అంటూ బిగ్గరగా రోదించసాగింది.

అసిఫా తల్లిదండ్రులు

'రేప్ చేసి, హింసించి చంపారు'

జనవరి 23న అంటే, ఆసిఫా శం దొరికిన 6 రోజుల తర్వాత జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. అందుకోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఎనిమిదేళ్ల ఆసిఫాకు మత్తుమందులు ఇచ్చారు. దాంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఒక ఆలయంలో ఆమెను కొన్ని రోజులు నిర్బంధించారు. ఆ తర్వాత చిన్నారిపై రోజుల తరబడి సామూహిక అత్యాచారం చేశారు. తీవ్రంగా హింసించారు. చివరికి చంపేశారు అని పోలీసులు ఎఫ్ఐఆర్ నివేదికలో పేర్కొన్నారు. హింసను తట్టుకోలేక ఆ చిన్నారి ప్రాణాపాయ స్థితికి చేరిన సమయంలో బండరాయితో రెండుసార్లు తలపై కొట్టి చంపేశారని దర్యాప్తు అధికారులు తెలిపారు.

60 ఏళ్ల సంజీవరామ్ అనే మాజీ ప్రభుత్వ అధికారి దీనంతటికీ సూత్రధారి అని పోలీసులు గుర్తించారు. స్థానిక ఆలయానికి సంరక్షకుడిగా ఉన్న సంజీరామ్‌కు సురేందర్ వర్మ, ఆనంద్ దత్తా, తిలక్‌రాజ్, ఖజురియా అనే పోలీసు అధికారులు సహకరించారని ఆరోపణలున్నాయి. సంజీరామ్ కుమారుడు విశాల్, మేనల్లుడు రెండుసార్లు ఆ చిన్నారిపై అత్యాచారం చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.


పూజారి సంజీరాం

ఖజురియా సహా మరికొందరు పోలీసులు ఈ కేసులో సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించడానికి ముందు రక్తం, బురదతో తడిచిన ఆసిఫా దుస్తులను ఈ పోలీసులు శుభ్రం చేశారని అన్నారు.

'విచారణ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం చిన్నారిని ఖజురియా రేప్ చేశాడు. తర్వాత చంపేసేందుకు ఆమె మెడను తన తొడలపై పెట్టి చేతలతో బలంగా కానీ, ఆమె చనిపోలేదు. తర్వాత ఓ మైనర్ అబ్బాయి మోకాలితో అదిమాడు. తర్వాత బండరాయితో రెండుసార్లు తలపై మోదారు అని క్రైం బ్రాంచ్ పోలీసులు తమ నివేదికలో పేర్కొన్నారు.

అంత్యక్రియల సమయంలో ఏం జరిగింది?

కూటగ్ గ్రామంలోని తమ సొంత భూమిలో అంత్యక్రియలు చేసేందుకు చిన్నారి శవాన్ని తీసుకెళ్తే, హిందూ మితవాద గుంపులు అడ్డుకున్నారు. అక్కడ ఆ బాలిక అంత్యక్రియలు జరిపితే విధ్వంసం సృష్టిస్తామని హెచ్చరించారు. దాంతో 7 కి.మీ దూరంలో మరో ఊరిలో అంత్యక్రియలు చేయాల్సి వచ్చింది.

కరువా నుంచి ముస్లింలను పూర్తిగా వెళ్లగొట్టేందుకు ఈ హత్య జరిగిందంటూ ఓ గోడపై రాసి ఉండటాన్ని చూశాను అని ఆదివాసీ హక్కుల సంస్థ (ఆల్ ట్రైబల్ కోఆర్డినేషన్ కమిటీ) సభ్యులు నజాకట్ ఖటానా చెప్పారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన చేసినందుకు పోలీసులు తనను అరెస్టు చేసి, బెదిరించారని ఆదివాసీ హక్కుల ఉద్యమకారుడు, న్యాయవాది తాలిబ్ హుస్సేన్ తెలిపారు. విచారణ అధికారుల కథనం ప్రకారం, దశాబ్దాలుగా హిందువులతో కలిసి సామరస్యంగా ఉంటున్న గుజ్జర్లను భయభ్రాంతులు గురిచేసే ఆలోచనతో ఈ దారుణానికి పాల్పడ్డారు నజాకట్ ఖటానా అన్నారు.

అది కుటుంబ వ్యవహారం

హిందూ ప్రాబల్యం, బీజేపీకి రాజకీయంగా పట్టున్న జమ్మూ ప్రాంతం నుంచి వెలువడే వార్తాపత్రికల్లో ఈ ఘటనపై వార్తలే రాలేదు. అయితే శ్రీనగర్ నుంచి వెలువడే దినపత్రికలు ఆసిఫాపై జరిగిన దారుణాన్ని పతాక శీర్షికల్లో ప్రచురిం

చాయి. ఈ విషయం జనవరి చివరిలో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో చర్చకొచ్చింది. గుజ్జర్ నాయకుడు, ఎమ్మెల్యే మియాన్ అల్తాఫ్ ఈ అంశాన్ని సభలో లేవనెత్తారు. హత్యకు గురైన చిన్నారి ఫొటోలు ప్రచురించిన వార్తాపత్రికలను చూపిస్తూ ఆసిఫా ఘటనపై విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ నేతలు దీనిని వ్యతిరేకించారు. చిన్నారిపై జరిగిన అత్యాచారం, హత్య కుటుంబ వ్యవహారం అని కథువా జిల్లాకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజీవ్ జస్రోటియా వ్యాఖ్యానించారు. దాన్ని గుజ్జర్ల నేత మియాన్ కావాలనే రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

నిందితులకు మద్దతుగా ర్యాలీ
జాతీయ జెండాతో మంత్రుల నిరసన

ఈకేసులో అరెస్టయిన పోలీసు అధికారులను విడుదల చేయాలంటూ సాంజీరామ్, అంకుర్ శర్మల నేతృత్వంలో హిందూ ఏక్తా మంచ్ అనే బ్యానర్లు పట్టుకుని భారీ ర్యాలీ తీశారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఇద్దరు జమ్మూ కశ్మీర్ రాష్ట్ర మంత్రులు జాతీయ జెండాలతో మరో ర్యాలీలో పాల్గొన్నారు.

హిందువుల ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో గుజ్జర్లు పాగా వేసేందుకు ప్రయత్ని స్తున్నారని అంకుర్ శర్మ వాదిస్తున్నారు. వాళ్లు మా అడవులను, నీటి వనరులను కబ్జా చేస్తున్నారని ఆయన బీబీసీతో అన్నారు. పోలీసు అధికారి దీపక్ ఖజురియాతో గుజ్జర్లకు వ్యక్తిగత గొడవలు ఉన్నాయి. ఆయన భూమిని వాళ్లు కబ్జా చేశారు. విచారణ అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోవ ట్లేదు అని బీజేపీ సెక్రటరీ, న్యాయవాది విజయ్ శర్మ చెప్పారు. చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు క్రైం బ్రాంచి అధికారులు కోర్టుకు వెళ్లగా, బార్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

నిష్పక్షపాత అధికారి జమ్మూకశ్మీర్ డీజీపీ ఎస్.పి వైద్

ప్రభుత్వానికి, క్రైం బ్రాంచికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిందితులను వెనకేసుకొస్తూ గో బ్యాక్ గోబ్యాక్, క్రైం బ్రాంచ్ గో బ్యాక్ అంటూ వారు నినాదాలు చేశారు. అయినా అధికారులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అందులో ఏడుగురు నిందితుల పేర్లను చేర్చినట్టు తెలిపారు.



నిందితుడు ఖజూరియా

అసిఫా తరపు లాయర్ దీపికా సింగ్ రజావత్

బార్ అసోసియేషన్ క్రైం బ్రాంచి విచారణను వ్యతిరేకిస్తోంది. కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని డిమాం డ్ చేస్తున్నాం అని కథువా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కీర్తి భూషణ్ అన్నారు. అయితే, న్యాయవాదుల తీరుపట్ల ఆదివాసీ ఉద్యమకారుడు హుస్సేన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయాన్ని కాపాడా ల్సిన లా యర్లు, న్యాయబద్ధంగా సాగుతున్న విచారణకు అడ్డంకులు సృ ష్టించేందుకు ప్రయత్నిస్తు న్నారని ఆయన అన్నారు.

జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి మహబూబా ముఫ్తీ

వీళ్లు నిందితులకు మద్దతుగా నిరసన చేస్తున్నారు. ఈ కేసును జమ్మూలోని కోర్టుకు బదిలీ చేయాలని హైకోర్టులో పిటిషన్ వేస్తున్నాం. లేదంటే ఇక్కడ విచారణ జరగడం అసాధ్యం అని బాధిత కుటుంబం తరపు న్యాయవాది దీపక్ సింగ్ రాజ్‌వత్ తెలిపారు. అరెస్టయిన పోలీసులకు మద్దతుగా రాష్ట్ర మంత్రులు జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీ తీయడంపై బాధితురాలి తండ్రి పుజ్వాలా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

వాళ్లు భారత జాతీయ జెండాలతో ర్యాలీలు తీయడాన్ని చూసినప్పుడు నా బిడ్డ మరోసారి అత్యాచారానికి, హత్యకు గురైనట్టు అనిపించింది అని ఆయన వాపోయారు.

- బీబీసీ వార్తా కథనం సౌజన్యంతో...

రాయలసీమ వ్యష్టి నృత్యం... నామాలసింగడు

ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి

రాయలేలిన సీమ రాయలసీమ. రతనాలు రాశులుగా పోసి అమ్మిన సీమ. ఆనాటి కాలంలో ఎన్నో కళా ప్రదర్శనలు జరిగేవి. పెనుకొండను రాజధాని ఉన్న కాలంలో అనేక రకాల కళా ప్రదర్శనల పోటీలు జరిగేవి. కర్రసా ము, రుబ్బురు గుండు ఎత్తటం, కోలా టం వంటివి ప్రదర్శనలతో పాటు వసం తోత్సవాలు జరిగేవి. ఈనాటికి అప్పుడప్పు డు పాలకులు, స్వచ్ఛంద సంస్థలు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. అలాంటి ప్రదర్శనల్లో నామాల సింగని నృత్యం ఒకటి.

జానపద నృత్యాల్లో వ్యష్టి నృత్యాలున్నాయి. వ్యష్టి అంటే ఒకరు మాత్రం ప్రదర్శించే నృత్యాలు సోలో డ్యాన్స్ అంటారు. అలాంటి నృత్యాలు రాయలసీమలో ప్రధానమైంది నామాలసింగడు 'నామాల' గ్రామంపేరు ఇంటిపేరుగా మారింది 'సింగడు' పేరు 'సింగి- సింగడు' అనే పాత్రలు చెంచునాటకంలో హాస్యపాత్రలుగా చెలామణిలో ఉన్నాయి. కాని ఈ 'సింగడు' దారి దోపిడీ దొంగ. 'నామాల గుండు' అనేక ప్రాంతాల్లో ఉంది. కడప జిల్లాలో పలివెందుల నుంచి అనంతపురం జిల్లాలోని కదిరికి వెళ్లే రహదారిలో 'నామాల గుండు' ప్రసిద్ధమైంది. శివరాత్రికి ఉత్సవాలు ఈనాటికి వైభవంగా జరిగే ప్రాంతం.

నామాల సింగడు దారి దోపిడీ దొంగ. కాలిబాటనవెళ్లే బాటసారుల్ని దోచుకుంటూ ఉండేవాడు. అంతేకాక తన అనుచరులచే రోజుకొక గ్రామాన్ని దోచుకునే వాడని పేదలకు కొంత సహాయం చేసేవాడని ప్రచారంలో ఉంది. సింగిని స్థావరం పులివెందుల తాలూకాకు 15 కి.మీ దూరంలో ఉండే కొండల్లో ఉంది. అక్కడి స్థలాన్ని 'నామాల గుండు' అని పిలుస్తున్నారు. నామాలగండు నుంచి కొండల్లో మూడుమైళ్ల దూరంలో సింగనికోట ఉంది. కోటలో అతని అనుచరులుండటానికి వసతులున్నాయి. సింగని సింహాసనం దీన్ని 'తౌటు' అంటారు. కొండల్లో అక్కడక్కడా బాటసారుల్ని చూడటానికి నైపుణ్యం కలిగిన వ్యక్తుల్ని 'ఏగు' చూడటానికి పెట్టేవాడట. వీరి సైగలతో అందరికీ తెలిసేది. వారిని దోచుకునేవారు. ఆనాటి కాలంలో బాటసారులు వెదురుబుంగల్లో వెండినాణేలు దాచేవారు. వాటిని దోచుకున్నట్టు ఆధారాలున్నాయి.

నామాలగుండు పెద్ద రాతిగుండు. ఈ గుండు కింద ఒక సాధువు శివభక్తుడుం డేవాడు. శివలింగానికి పూజచేసే వాడు. అక్కడ నది, కోనేరు ఉంది. మడుగులు న్నాయి. సింగడు దొంగతనానికి వెళ్లే సమయంలో సాధువు ఆశీర్వాదం తీసుకుని వెళ్లమంటే వెళ్లేవాడు. ఒక్కొక్క గ్రామం కొల్లగొట్టిన తర్వాత 'గుండు'కు నామాలు పెట్టేవాడు (గుర్తుగా) అది నామాల గుండుగా పేరు వచ్చింది. ఈనాటికి నామాలున్న గుండును చూడవచ్చు.

సింగని అరాచకాలకు విసిగివేసారిన జనం ఎలాగైనా సింగన్ని పట్టుకోవాలని పోలీసులకు సహాయపడుతూ ఒక పన్నాగం పన్నారు. సింగని అనుచరుడు ఒకడు 'గుండు' ఎత్తటంలో ప్రావీణ్యుడు. అతనికి డబ్బు ఆశచూపించి 'గుండు' ఎత్తే పందాలకు ఎలాగైనా సింగని 'కనుమ కింద కొట్టాల' గ్రామానికి తీసుకుని రావాలని రుబ్బుడు గుండు ఎత్తే పందాల్లో పాల్గొనే చేయాలని తెలిపారు. దీని ప్రకారం రుబ్బురు గుండు పందెం అంటే బరువైన రాతిని ఎత్తి మెడచుట్టూ తిప్పి కిందకు వేస్తారు. గ్రామాల్లో పండగ రోజుల్లో పందాలు జరిగేవి. అలాంటి పందెం జరిగే ప్రాంతానికి సింగడు రావటం చూడటం. తన అనుచరున్ని పంపాడు. అతను ఎత్తలేకపోయాడు. పరువుపోతుందని సింగడు రాయిని ఎత్తటానికి వెళుతూ తన అనుచరునికి తన దగ్గరున్న పిడి బాకులు ఇచ్చి గుండు ఎత్తటానికి వెళ్లాడు. గుండును మెడపై తిప్పుతున్న సమయంలో మారువేషంలో ఉన్న పోలీసులు సింగని బంధించారు. అక్కడనుంచీ పులివెందు లకు జైలుకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రజలంతా జాతర చేసుకున్నారు. దీపావళి పండుగలాగా చేసుకుంటూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారు. ఆ తర్వాత ఉరితీశారని ప్రజలు చెప్పుకుంటారు. అలాంటి సింగని చరిత్ర ముగిసింది. కానీ ప్రజలు సింగని వేషం కళ్లకు కట్టినట్లు ఈనాటికి పీర్ల పండుగలో ప్రదర్శిస్తున్నారు.

వేషం : రెండు చేతులకు బేడీలు వేయటం, తలకు రుమాలు చుట్టి వేపకొమ్మలు చెక్కటం, ముఖానికి ఎర్రటి, నల్లటి నామాలు దిద్దటం, రకరకాల బొట్లు పెట్టటం, రెండు చేతులకు ఇరువైపులా తాళ్లతో పట్టుకోవడం, రెండు పిడిబాకులు చేతుల్లో పట్టుకోవడం, పిడిబాకుల చివరలో నిమ్మకాయలు చెక్కటం పెద్ద మీసాలు, ఎర్రటి రంగుతో ఉన్న పంచెకాళ్లకు గజ్జెలు కడతారు. నడుముకు ఎర్రటి బట్ట కడతారు. రెండు చేతుల భుజాలకు రెండువైపులా తాళ్లతో ఇద్దరు పట్టుకుం

టారు. తప్పెట గతికి అనుగుణంగా రకరకాల అడుగులు వేస్తారు. జానపద చర్మవాద్యాలలో తప్పెట ముఖ్యమైంది. దీన్ని డప్పు, పలక, కనక తప్పెట అనే పేర్లున్నాయి. మంగల వంశపారంపర్య వాద్యం కానీ ఈనాడు అన్ని కులాలవారు నేర్చుకున్నారు. ఈ వాద్యంపై 'జెగ్నకన్' అనే వరుస సమయాన్ని బట్టి రకరకాల గతుల్లో అనేక రకాలైన కోపులీ కడతారు. ముఖ్యమైన గతులు 'జెగ్నవీన్ జెగనవీన్ - జెగ్నకన్ జెగ్నకన్, ఇరడజెగ్ జెగ్ జెగ్నకన్, జెగ్జెగ్ జెగ్ నకన్ జెగ్జెగ్ జెగనకన్, జెగనకన్ - జగ్, జెగ్ నకన్- జెగ్".

పై గతులకు అనుగుణంగా సింగని వేషధారి రెండు చేతుల్ని ముందుకు చాపి ఇరువైపులా తాళ్లతో పట్టుకున్న వారిపైకి దూకటం, రెండు కాళ్లతో అడుగులు వేయటం, బస్కీలు తీయటం, కప్పగంతులు వేయటం, కూర్చోవటం, ఒక కాలిని వెనక్కిచాపటం, తర్వాత ఇంకో కాలిని వెనక్కుచాపటం గతికి అనుగుణంగా వేస్తారు. ముఖ్యంగా పీర్ల పండుగ రోజు పెద్ద సరిగెత్తు లేదా ఉరుసు రోజు, జల్దికి పోయే రోజు ఇంటి నుంచీ వేషధారి తప్పెట్ల గతులతో గుండం దగ్గరకు రావటం చావిడి దగ్గర గుమికూడిన జనానికి ఆహ్లాదం కలిగించటం ముఖ్యం. సింగని వేషాన్ని చూసి చిన్న పిల్లలు భయపడతారు. దూరంగా పారిపోతారు. శివరాత్రి రోజు శివుని కి పూజలు చేసి సింగని వేషధారులు మొక్కు చెల్లు తీర్చు కుంటారు. ఈనాటికి ఎవరైనా ఏవురునీవు అంటూనే 'నామా ల' అంటూనే 'సింగనివా' అంటారు. అలాంటి నామాల సిం గని నృత్యం ఈనాటికి అడుగంటిపోకుండా ప్రదర్శిస్తున్నా రు. ఇలాంటి వ్యష్టి నృత్యాలు జ్యోతి నృత్యం ధర్మవరం, నంద్యా ల, శింహాద్రిపురం, పెద్దకోట్ల చౌడమ్మ జాతరలో ప్రదర్శిస్తున్నా రు. ఇలాంటి నృత్యాలు మరెన్నో మరుగునప డ్డాయి. వాటిని భావి పరిశోధకులు వెలికి తీయాలని కోరుతున్నాను.

రాయలసీమ ప్రాంతంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ప్రాంతం. ప్రదర్శన కళలు కూడా ప్రత్యేకమైనవి. సీమ ప్రాంతంలో ఉరుములు, కుంచెలు గొరవయ్యలు, బీరప్ప జల్లులు, కీలుగుర్రం, మంగళ్ల కవ్వాయి కట్టెలు, తప్పెట గతులు, ఆసారి కథ, కొమ్ములు, మదిలీ, నవరంజి, పెల్లంగట్లు, జడకోలాటం, కోలాటం, స్త్రీల కోలాటం, బుర్రకథ తదితర కోకొల్లలు మరుగునపడిపోతున్నాయి. మన జాపద కళ ప్రదర్శనల్ని వెలికితీయాలని కోరుకుంటూ...

ఈ తరం వారు ముందు తరాలవారికి అందించే వరాలు మన జానపద కళారూపాలు.

నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించాలి

రాయలసీమ జాగృతి న్యూస్, అనంతపురం

జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ యువతను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా త్వరితగతిన ఎంపిక ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన పరిశ్రమల అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ జనరల్ మేనేజర్ జీ సుదర్శనబాబు, జోనల్ మేనేజర్ పీ నాగేశ్వరరావు, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా స్థాపించి ఉపాధి అవకాశాలు పెంచాలని సూచించారు. పరిశ్రమలకు కేటా యించిన భూములపై నెలకొన్న సమస్యలను వేగంగా పరిష్క రించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నం దున మరిన్ని పరిశ్రమలు జిల్లాకు వచ్చే అవకాశముందన్నారు. 2018-19 సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళికలు వేగవంతం చేయాలన్నారు. నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువత అనేక డిగ్రీ, యూనివర్సిటీ, పాలిటెక్నిక్, ఐటీఐల్లో వివిధ కోర్సులను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్నారని పరిశ్రమల శాఖలకు అనుబంధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఆయా కళా శాలల్లో ఎంపిక ప్రక్రియ చేపట్టి అర్హులైన ఎస్సీ, ఎస్టీ యువ తకు పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలని ఆయన తెలిపా రు. పరిశ్రమల శాఖలకు సంబంధించిన శాఖల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశించిన సమయంలోపే పరిష్కరిం చాలని సింగిల్ డెస్క్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పరిశ్రమలకు కావాల్సిన అదనపు సమాచారం అవసరమైతే దరఖాస్తు దారులకు తెలియజేసి సదరు సమాచారాన్ని పోర్టల్ లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. విజిలెన్స్ మానటిరంగ్ కమిటీలో పరిశ్రమల శాఖ జీఎం, ఎల్‌డీఎం, సంబంధిత బ్రాంచి మేనేజర్లు, తహసీల్దార్లు సభ్యులుగా ఉం టారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ వరాహ రావు, ఫ్యాక్టరీ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, ఎల్‌డీఎం సురేష్, జోనల్ మేనేజరు, హెచ్‌డీఎఫ్‌సీ, ఇండస్ట్రియల్ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

సీమ సాహితీమూర్తులు-6

డా॥ తవ్వా వెంకటయ్య
ప్రముఖ సాహిత్యవేత్త, చరిత్రకారుడు

మనిషి బతుకును చుట్టేసిన మూడక్షరాలు... రాసాని

ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు జిల్లాది ప్రత్యేకమైన స్థానం. ఆమాటకొస్తే భారతదేశంలోనూ, ఇంకా చెప్పాల్సి వస్తే ప్రపంచంలోనే ప్రాధాన్యత సంతరించుకున్న ప్రాంతం చిత్తూరు జిల్లా. రాజకీయంగా రాష్ట్రంలో, దేశంలో తన స్థానం ప్రత్యేకంగా నిలుపుకుంది. ఆధ్యాత్మికంగా ప్రపంచాన్ని తనవైపు తిప్పుకున్న ప్రాంతం చిత్తూరు. రాయలసీమ సాహితీమూర్తుల గురించి రాస్తూ చిత్తూరు జిల్లా ప్రాదేశికతను గురించి ఎందుకు చెప్పాల్సి వస్తుదంటే రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో ఒక్క కడప జిల్లా తప్ప మిగిలిన కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలు ఇతర రాష్ట్రాలను సరిహద్దులుగా కలిగి ఉన్నాయి. అయితే కర్నూలు, అనంతపురం జిల్లాలు ఇతర భాషలకు సంబంధించిన ఒకే కర్ణాటక రాష్ట్రాన్ని సరిహద్దుగా



పంచుకుంటున్నాయి. అయితే చిత్తూరు జిల్లాలో కుప్పం పరిసర పొరుగు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల ప్రజలు తెలుగు, తమిళం, కన్నడం మూడు భాషలు అనర్గళంగా మాట్లాడుతుంటారు.ఈ ప్రభావం చిత్తూరు జిల్లాలో చాలామంది రచయితలపై లేకపోలేదు. అందువల్లనే చిత్తూరు జిల్లా సాహిత్యం కాసింత వైవిధ్యంగా ఉంటుంది. ఈ మాత్రం అవగాహనతోనే ఈ మాసం రాయలసీమ సాహితీమూర్తులలో చిత్తూరు జిల్లాకు చెందిన రాసాని గురించి తెలుసుకుందాం.

వీ.ఆర్ రాసానిగా సాహిత్యలోకానికి పరిచయం ఈయన. నిజానికి 'రాసాని' అనేది ఈయన ఇంటి పేరు. ఈయన పూర్తి పేరు వెంకట్రామయ్య. ఈ వెంకట్రామయ్యను వీఆర్‌గా చేసి ఇంటి పేరునే కలం పేరుగా స్థిరపరచుకున్నారు. అలానే సాహితీలోకం గుర్తించుకుంది. పొగడ్తలంటే గిట్టని సాదాసీదా మనిషి ఈయన.

1957 ఏప్రిల్, 19న చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కురవపల్లెలో జన్మించారీయన. తల్లి కీ.శే మల్లమ్మ, తండ్రి కీ.శే. శిద్దయ్య. తన చదువునంతా తిరుపతిలోనే పూర్తి చేశారు. 'రాయలసీమ వేడుక పాటలు' అనే అంశంపై పరిశోధన చేసి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. తర్వాత శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ కళాశాల) తెలుగు అధ్యాపకులుగా బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ చేశారు. ఈయన వృత్తి అధ్యాపకుడైతే ప్రవృత్తి రచనా వ్యాసంగం. గ్రామీణ జీవన చిత్రాలే ఈయన ప్రతి రచనలోని అక్షరాలు. డాక్టర్ వీఆర్ రాసాని బహుముఖ ప్రజ్ఞాశాలి. కథా రచయితగా, సాహితీ విమర్శకుడిగా, నాటక రచయితగా,

వివిధ పత్రికలకు కాలమిస్టుగా విలక్షణమైన వ్యక్తిగా రాసాని తనదైన ముద్ర కలిగి ఉన్నారు. ఇంతటి ప్రజ్ఞాపాటవాలున్నా అతి సాధారణంగా ఉండటం ఈయన తత్వం. ఎవరేమి చెప్పినా శ్రద్ధగా వినడం, ఎవరేమి రాసినా ఆసక్తిగా చదవడం ఈయన సహజ గుణాలు.

నిజానికి చిత్తూరు జిల్లా నుంచి పేరెన్నిక గన్న సాహితీమూర్తులు ఎందరో ఉన్నారు. వారందరికంటే రాసాని గొప్పవాడంటే ఇతరులను తక్కువ చేసినట్లే. ఎందుకంటే కే సభా, మధురాంతకం రాజారాం, వల్లంపాటి, కట్టమంచి, సదానంద, జిడ్డు కృష్ణమూర్తి, పులకంటి, రాచపాళెం, ఆర్ఎస్ సుదర్శనం వంటి ఎందరో మహానుభావులున్నారు. వారితో రాసానిని పోల్చడం లేదుగానీ రాసాని వారు, చిత్తూరు జిల్లా ప్రాతినిధ్య రచయిత. చిత్తూరు మాండలికం, గ్రామీణ జీవనం, చిత్తూరు జిల్లాలో ఉన్న వివిధ వృత్తులు, గ్రామీణ కళలు ఇటువంటివి ఎన్నో అరుదైన చారిత్రక సంపదను తన రచనల్లో పొందుపరిచారు. ఈ పనిని దశాబ్దాల కాలంగా బాధ్యతగా నెరవేరుస్తున్నారు. ఈయన అన్ని ప్రక్రియల్లో రచనలు చేశారు. ఈ రచనలు...

<u>కథా</u> <u>సంపుటాలు</u> :

1. మెరవణి 2. పయనం 3. మావూరి కథలు 4. శ్రీకృష్ణరాయల కథలు

<u>నవలలు</u> : చీకటిరాజ్యం, మట్టి బతుకులు, చీకటి ముడులు, బతుకాట, ముద్ర, వలస, పరస, ఏడోగ్రహం.

<u>నాటికలు</u> : స్వర్గానికి ఇంటర్వ్యూ, దృష్టి, జలజూదం, మనిషి పారిపోయాడు.

<u>నాటకాలు</u> : కాటమరాజు యుద్ధం, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, చెంచునాటకం, అజ్ఞాతం.

వీటితో పాటు తెలుగు కథ - దళిత మైనార్టీ, గిరిజన, బహుజన జీవితం అనే సంకలన గ్రంథాన్ని వెలువరించారు. అలాగే చిత్తూరు జిల్లా నుంచి ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా వెలువడుతున్న ''కథా వార్షిక''కు 10 సంకలనాలకు సహ సంపాదకత్వం వహించారు. అలాగే కొన్ని పత్రికలకు కాలమ్ రచనలు చేశారు. కామధేను దినపత్రికలో 'రాయలసీమ నవరత్నాలు' ఆంధ్రభూమి వారపత్రికలో 'మా వూరి కథలు' ఆంధ్ర ప్రభలో 'ఇది తిరుపతి' కళాదీపిక పక్ష పత్రికలో 'లోకూలు' వంటి రచనలు చేశారు.

అంతరించిపోతున్న గ్రామీణ మూలాలను అక్షరబద్ధం చేస్తున్న సిసలైన రచయిత రాసాని. ఈయనకు ఈ దేశం పట్ల, ఈ ప్రాంతం పట్ల, ఈ దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల పట్ల ఒక నిర్దిష్ట అభిప్రాయమున్నది. అది మారుతున్న ప్రపంచీకరణ ముందు చిద్రమైపోవడాన్ని ఈయన ఓర్వలేకపోతున్నారు. ముఖ్యంగా మానవ సంబంధాలు నానాటికీ క్షీణించడం ఆయన్ను మరింత వేదనా పరుడిగా మార్చింది. అందుకే తన అస్థిత్వానికి కారణమైన గ్రామాల మమకారాలను (రికార్డు) నిక్షిప్తం చేయడమే ఆయన సాహితీ సృజన. ముఖ్యంగా గ్రామీణ సంప్రదాయాల కళలు అంటే ఈయనకు ఎనలేని ప్రీతి. అందునా ఈయన మంచి నటుడు. అంతరించిపోతున్న జానపద కళలను ఈయన సేకరించారు. గ్రామాలకు సంబంధించిన ఎన్నో సంప్రదాయాలను ఈయన తన రచనల్లో పొందుపరిచారు. గ్రామీణ కళలు బతికి ఉండటం అనేది ఆయన ఆశించిన అత్యున్నత ప్రయోజనం. అందుకు నిలువెత్తు సాక్ష్యం ఈయన రాసిన బ్రతుకాట నవలలో నామిగాని పల్లెలోని ప్రతి కుటుంబం నాటకాలపై ఆధారపడి బతుకుతుంటారు. ఓ నాలుగు తరాల తర్వాత ఆ గ్రామ వారసులు నాటకాన్ని వదిలేసిన క్రమాన్ని నాటకాన్ని ఆదరించని ప్రజలను, కళాత్మకంగా చిత్రించారు రాసాని. నవలలో ప్రధాన పాత్ర వెంకోబరావు (వెంకోజీ) నాటకాన్ని ఆడుతూ ప్రమాదవశాత్తు కిందపడి ఆయన చనిపోతే తన కొడుకు సిద్దోజికి నాటకాన్ని వదలొద్దని నాటకాన్ని బతికించమని ప్రతి ఉగాదిని ఊళ్లో నాటకం వేయమని బ్రహ్మోత్సవాల నాడు తిరుమలకు పాదయాత్ర వెళ్లమని చెప్తాడు. అదే మాటతో సిద్దోజీ తన జీవితాన్ని నాటకానికే అంకితం చేస్తాడు. కాటోజీ నాటకం నేర్పుతారు. ఇక్కడ పాత్రల మధ్య నాటకమే పెద్ద అనుబంధం. కాటోజీ ఆది గురువు ఆయన అల్లుడు తక్కోజీ ఈయన బావ మరిది వెంకోజీ. ఈయన కొడుకు సిద్దాజీ కొడుకు కాలానికి నాటకంపై ఆసక్తి తగ్గిపోతుంది. ప్రజలకు వెకిలిచేష్టలు చేసే సినిమాలపై ప్రజలకు మనసు మల్లుతుంది. చివరకు నాటకం ఆదరణ లేక తనకు వంశపారంపర్యంగా వచ్చిన చింతలతోపును బాకీకి కోల్పోతాడు. కరువులోనూ నాటకాలపై ఆధారపడి బతికే నిజమైన గ్రామీణ కళాకారుల అశ్రునయనాలు ఈ నవలలో సగటు పాఠకున్ని కంటతడి పెట్టిస్తాయి. ఇటువంటి హృదయ విదారకమైన గ్రామీణ జీవనం రాసాని నిత్య సాహితీ వస్తువులు.

ప్రపంచం పరుగులు పెడుతూ అభివృద్ధి వైపు పయనిస్తుంది. అనుకుంటాంగానీ అది ఎంత పాతాళానికి మనిషిని లాక్కుపోతుందో రాసాని సాహిత్యం బట్టబయలు చేస్తుంది. ప్రతి మనిషి ప్రతిప్రాంతం ఏదోకొంత వారసత్వాన్ని అందుకునే పుడతాడు. దాన్ని మరిచిపోకుండా రేపటి తరాన్ని సురక్షితంగా అందివ్వగలిగితేనే మనం నిజమైన వారసులం. అసలైన మానవ నిర్మాణ వారదులం. ఇటువంటి ఆపేక్షతోనే వెంకట్రామయ్య కలం కదలాడుతూ ఉంది. దాన్ని అందుకుని అర్థం చేసుకుని మన గ్రామాల సంస్కృతిని సంప్రదాయాలను మూలధనంలా రేపటి తరానికి అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. చాలా మంది బాగా చదువుకొని ఉద్యోగాలు సంపాదించుకుని కొంత డబ్బు వెనకేసుకోగానే తన తాతల కాలంనాటి జీవితాన్ని పూర్తిగా మరిచిపోతున్నారు. ఎప్పుడైతే ఎదిగి నిలబడ్డ మనిషి తన మూలాలను మరచిపోతాడో అప్పుడే ఆ మనిషి మరణించినట్టు లెక్క. ఇదే విషయాన్ని డాక్టర్ వీఆర్ రాసాని ప్రతి అక్షరంలో పొందుపరిచారు.

చిత్రం సౌందర్యాత్మకం

ఎల్.ఆర్. వెంకటరమణ
ప్రముఖ చిత్రకారుడు, ఉపాధ్యాయుడు

"సిద్ధాంతాల కంటే ఆలోచనలు గొప్పవి. చిత్రాలు ముందు పుడతాయి. అవి మనకు నచ్చితే వాటిని సమర్థిస్తూ సిద్ధాంతాలను రూపొందించుకుంటుంటాం. ప్రతి వ్యక్తికీ తనదైన ప్రత్యేక అవ్యక్త వ్యక్తీకరణలు ఉంటాయి. అవి అలా బయట పడాలని కోరుకుంటాయి. అలా అవి బయటకు రావడమే శద్ధ కళ" అంటాడు కాండిన్స్కీ.

'కళ' అన్న పదానికి అనాదిగా అనేకమంది అనేక రకాలుగా అర్థాలు చెబుతూ వస్తున్నారు. వాటి నుంచి మరికొన్ని అర్థాలు పుడతూ, కొన్ని కాలగర్భంలో కలిసిపోతూ ఒక కళా స్రవంతి అన్నది కొనసాగుతూ వస్తోంది. ఈ కళా క్రమాన్ని ప్లాటో 'అనుకృతి' అని అంటాడు. మనుషుల భౌతిక, ఆధ్యాత్మిక ప్రపంచాలలో సహజంగా అస్తిత్వంలో ఉండేవాటికి కృత్రిమమైన ప్రతి సృషి చేయడమే 'కళ' అంటాడు.

"చిత్రం అన్నది రంగులతో కాదు, కాన్వాస్‌లపై కాదు, రంగులుకలుపు పాత్రలలో కాదు. మానవుని రసానుభూతిలో ఉంటుంది". దీనినే మన ప్రాచీన సంప్రదాయంలో చెబుతూ 'రాగన విద్యతే చిత్రం నచ భూమౌనభాజనే" వాక్యం ఉంది. 1735లో ప్రసిద్ధ కళా విమర్శకుడు అలెగ్జాండర్ గాడ్‌లీచ్ బాం గార్డెన్ సౌందర్యతత్వం గురించి 'ఈస్తటికా' గ్రంథంలో రచించాడు.

ప్రాచీన శిలాయుగపు సంస్కృతి కాలంలో గుహలలో చిత్రాలు గీచారు, రాళ్లను తమకు అవసరమైన పనిముట్లు చేసుకోవంతో కళకు అంకురార్పణ కలిగింది. మగవారి బొమ్మలను నగ్నంగాను ఆడవారిబొమ్మలకు జంతు చర్మాలు అడ్డు బట్టలు కట్టుకున్నట్లు చిత్రించారు. ఈ విషయాన్ని ఎడ్వర్ట్ సెయిన్ తెలిపాడు.

ఈ కాలపువారి కళాసాధన సహజంగా మొరటుగా కనిపించినా, వాళ్ల గణనీయమైన సాంస్కృతిక పురోభివృద్ధిని తెలుపుతాయి. మానవుడు సృజనాత్మక స్థాయిని చేరుకోగలిగాడు. ఈ కాలపు చిత్రాల్లో భావప్రకటన గమనించవచ్చు. ఇవి మానవాను భవితాలకు వ్యాఖ్యానంగా చెప్పుకోవచ్చు.

వానరనరుడు కళాసృష్టి చేస్తున్న సమయంలో కేవలం ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని మాత్రమే కళను సృష్టించుకుని ఉంటాడు. తరువాత అది అలంకరణగా రూపొందింది. జాన్‌డ్యూయి చెబుతూ "క్రియాశీలత నిరంతరం ఎప్పటికప్పుడు నూతనానందాన్ని కలిగించే వస్తువును ఉత్పత్తి చేసినప్పుడు విశిష్ట కళ అన్నది ఆవిర్భవిస్తుంది" అంటాడు. దీన్ని బైరన్ మరోలా చెబుతూ "ఆత్మ సంతృప్తికి అనుకూలంగా అనుభవాన్ని పునర్నిర్మించడమే కళ" అంటాడు.

సౌందర్యతత్వ వివేచనలో మూడు భాగాల సమ్మిశ్రణంగా చెప్పుకోవచ్చు. ఇందులో అనుకరణ, కల్పన, అభివృద్ధి అన్నవి. వీటిని చిత్రకళకు సంబంధించి వీటిని ఆలోచించినప్పుడు దేనినైనా అనుసరించడాన్ని "అనుకరణ" అన్నారు. అంటే అలాంటి వస్తువు పూర్వం ఉండి ఉండాలి. దానికి నకలుగా తయారు చేసినది మరి ఇందులో కూడా లోపముంది. ఫిలోస్ట్రేటస్ అన్న గ్రీకు తాత్వికుడు - "కళ అన్నది అనుకరణ అనుకుంటే దేవతలను ఎవరూ చూసి ఉండరు. అయినా వారిని చిత్రాల్లో, శిల్పాలలో ఎలా మలచగలుగుతున్నారని" మనసు ప్రశ్నిస్తాడు.

తరువాత అనుకరణ వాదం కనుమరుగై కల్పన అనే వాదం వచ్చింది. "కళ అన్నది సృష్టి కార్యంకానీ అనుకరణ కాదు. ఊహించి కూడా చేయవచ్చునన్న కల్పన వాదం" వచ్చింది. కల్పన అన్నది స్వప్న విశేషం. వాస్తవానికి చెందింది కాదు. కల్పన వాదం తెరమరుగై "అభివ్యక్తి' వాదం వచ్చింది. వ్యక్తిగత ఆత్మ సంవేదన, వస్తుగత వ్యావహారికం కలగలసి

"అభివ్యక్తి" ఏర్పడుతుంది. 'అభివ్యక్తి' అంటే 'వెల్లడించుట' అని అర్థం. అంటే దాగి ఉన్నదానిని వెలికితీయడమనే అర్థం. శిలలో దాగిన రూపాన్ని, రంగులోని ఆకారాన్ని, వాక్కు నుంచి కవిత్వాన్ని, శబ్దం నుంచి సంగీతాన్ని, ఆనందం నుంచి నృత్యాన్ని వెలికితీయడాన్ని అభివ్యక్తి అని అంటారు.

కళలన్నవి అభివ్యక్తి ద్వారా మాత్రమే రూపుదిద్దుకుంటాయన్న వాదం బలపడింది. ఈ అభివ్యక్తి వెలుపలికి వస్తుంది. చిత్రకారుని హృదయ సంవేదనల నుంచి మానసిక ప్రసవ వేదనలు పడిన అంశం అభివ్యక్తి అనే విధానం ద్వారా భౌతిక రూపాన్ని పొందుతుంది.

మనం చూసే దృశ్యం దానికి సంబంధించిన భావన అన్నది చూస్తున్న వాని హృదయ పరిపక్వతను బట్టి ఆధారపడి ఉంటుంది. ఆకాశంలో చూసే 'ఇంద్రధనస్సు'ని చూసి కళాకారుని హృదయం వికసిస్తుంది. రాబోయే వర్ష సూచన

అంటూ రైతు సంతోషిస్తాడు. రంగుల అమరిక ఎలా ఉంటుందని భౌతిక శాస్త్రవేత్త పరిశీలిస్తాడు. అదే వేదాంతి దీన్ని చూస్తూ "జీవితం కూడా ఇలానే క్షణాన కనిపించి అలా మాయమవుతుంది" అంటూ చెబుతాడు. చిత్రకారునికి ఆ దృశ్యం ఆనందాన్ని కలుగచేసి హృదయోల్లాసాన్ని కలిగిస్తుంది. దాన్ని అందమైన చిత్రంగా రూపుకడతాడు.

నేను నిస్సహాయుడైపోయాను

సుకుమారమైన ఆ గులాబీ రేకును
క్రూరంగా చిదిమివేసిన
ఆ రాక్షసుడెవ్వడు?
ఇంతకీ మనిషి అనే పదం
వాడికి సరిపోతుందా?
ఈ దారుణ రాక్షస కాండతో
ఈ దేశంలో మనిషి మానత్వం అనే పదాలకు అర్థాలు
మారిపోయాయి
పురుషాహంకారం ఎన్నో రూపాల్లో
వికృతంగా చూడటానికి
నేను అలవాటుపడిపోయాను
కానీ ఈ సన్నివేశాన్ని ఏమని పిలవాలో
తోచక నా మైండ్ బ్లాంక్ అయిపోయింది
నా చుట్టూ మతాలు, కులాలు, భావాల పేరిట
ఎన్నో రకాల ద్వేషాలు, అహంకారాలు, అవమానాలు చూస్తూ
నేను వాటికి రాజీ పడిపోయాను
కానీ ఈ దారుణ రాక్షసకాండను ఏమనాలో
తెలియని కోమాలో ఉన్నాను
అధికారం చేతిలో ఉంటే అవినీతి మాత్రమే ఆచరణలో ఉంటుంది

రాజ్యాధికారం చేతిలో ఉంటే ఏమవుతుందో
ఇంతకన్నా చెప్పాల్సిన పనేమీ లేదు.
ఓ నా ప్రియ భారతదేశమా!
నేను పూర్తిగా నిస్సహాయుడైపోయాను
తల్లీ నిన్ను నీవే కాపాడుకోవాల్సి ఉంటుంది
మరింకేంచేయను చెప్పుమరి!

డా॥ పి. రమేష్ నారాయణ
విశ్రాంత ప్రధానాచార్యులు
తెలుగు భాషా పురస్కార గ్రహీత

ఆచార్య కొలకలూరి ఇనాక్ 'అనంత జీవనం' నవల పాత్ర చిత్రీకరణ

మోహన్ బనోత్, పరిశోధక విద్యార్థి
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

ఆచార్య కొలకలూరి ఇనాక్ గత ఐదారు దశాబ్దాలుగా కవిత్వం, కథ, నవల, నాటకం, విమర్శ, పరిశో ధన వంటి అన్ని ప్రక్రియల్లో విరామం లేకుండా సాహిత్య సృజన చేస్తున్నారు. ఇనాక్ రచనలలో ప్రధానంగా అణగారిన వర్గాల జీవితాలను చిత్రీకరించారు. "అనంత జీవనం" నవలకు తొలిసారిగా 'మూర్తిదేవి' అవార్డు వరించింది. దీంతో తెలుగు సాహిత్యానికి అరుదైన గౌరవం దక్కింది. ఈ నవల హిందీ, ఇంగ్లీషులోకి అనువాదం అయ్యింది.

నవల నేపథ్యం : అనంతపురంలో 1996 నుంచి 19న 36 గంటల భారీ వర్షం కురుస్తుంది. ఆ భారీ వర్షానికి ఆ ప్రాంత పేదలు అణగారిన వర్గాల త్యాగాలు, సాహసాలు తెలియపరుస్తూనే, మరోవైపు ఫ్యూడల్ సమాజపు ఆధిపత్యం ఏ విధంగా కూలిపోతుందో తెలియజేస్తాడు. ఇదే ఈ నవల నేపథ్యం.

నవల ఇతివృత్తం : ఈ నవల రాయలసీమ ఇతివృత్తంగా రచించారు. అనంతపురంలో 1996 నవంబర్ 19న భారీ వర్షం కురిసింది. ఆ కుంభవృష్టి వర్షానికి అనంతమ్మ సాగరం చెరువు పూర్తిగా నిండిపోతుంది. ఆ చెరువు చుట్టుప క్కల కాలనీలలో వరద నీరు భారీగా చేరుతుంది. నీరుపోయే మార్గాలన్నీ బంద్ అయిపోతాయి. ఆ నీరు బయటికి పోయేందుకు పేదలు చాలా కష్టపడతారు. ఆ వర్షం దాటికి రాం.పి.రెడ్డి, ఎలిజబెత్ ఉండే బంగ్లా కూడా కూలిపోయి ఆ వృద్ధ దంపతులు చనిపోతారు. పేదలు, అణగారిన వర్గాల వారు తమ ప్రాణాలను, ఆస్తులను, ఇళ్లను పోగొట్టుకుంటా రు. ప్రాణాలు కాపాడుకోవడానికి జనం భయంతో గుట్టలెక్కుతారు, చెరువు గట్టుకెక్కుతారు. చివరకు వాన తగ్గుతుంది. ఎవరి ఇంట్లో వారు వెళ్లిపోతారు. మరోవైపు ఫ్యూడల్ వ్యవస్థకు చెందిన గోవిందరెడ్డి, వేంకటేశ్వరరెడ్డి, రాం.పి.రెడ్డి వాళ్ల అవశేష ఆధిపత్యాలు ఏ విధంగా కూలిపోతాయో తెలుస్తుంది.

పాత్ర చిత్రణ : ఈ నవలలో గోవిందరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామ పరంధామ రెడ్డి (రాం.పి.రెడ్డి), ఎలిజబెత్, అంకాలప్ప, సుబ్బరాయుడు, ఉత్తప్ప, సాలమ్మ, బజారన్న, ఉలిగప్ప, నాగన్న మొదలైన పాత్రలున్నాయి.

రామ పరంధామరెడ్డి : రచయిత రాం.పి.రెడ్డి పాత్రని చాలా చక్క గా చిత్రీకరించారు. రెడ్డి వయస్సులో ఉన్నప్పుడు విలాసవం తమైన జీవితాన్ని గడిపినట్టు, వృద్ధ వయస్సు వచ్చే నాటికి ఏమిలేని సాధారణ మనిషిగా జీవించినట్టు చూపించారు.

రెడ్డి తండ్రి పేరు రంగారెడ్డి, రాం.పి.రెడ్డికి ఇద్దరు అన్నలు గోవిందరెడ్డి, వేంకటేశ్వరరెడ్డి క్రిమినల్ లాయర్‌గా పేరు సంపాదించుకుంటాడు. రెడ్డి సాధారణంగా కేసు గెలుస్తాడు. ఒకవేళ ఓడిపోతే ఓటమికి కారణమైన వాడు చనిపోతాడు. అతను సామాన్యంగా కోర్టుకు పోడు. జూనియర్లను పంపుతా డు. రెడ్డి వకాల్తా పుచ్చుకున్నాడంటే కేసు గెలిచినట్లేనని ప్రజలు నమ్ముతారు. క్రిమినల్ లాయర్‌గా రెండు చేతులా సంపాదిస్తాడు. నాలుగు చేతులా ఖర్చు చేస్తాడు. సంపా దించిన సొమ్ముతో పాటు, జమీందారు సొమ్ము కూడా దుబా రా చేస్తాడు. చిన్నా పెద్ద రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు ప్రతిరోజు సాయంకాలం రెడ్డి ఆతిథ్యం స్వీకరించి, బహుమతులు పొందిపోతారు.

అనంతపురంలో 36 గంటల కుంభవృష్టి వర్షానికి వాగులు, వంకలు, ఏకమై పారుతుంటాయి. చెరువులు పొర్లు తుంటాయి. అనంతమ్మ సాగరం చెరువు పూర్తిగా నిండుతుం ది. ఆ భారీ వర్షానికి రాం.పి.రెడ్డి బంగ్లాలో కూడా నీరు చేరు తుంది. వర్షం కారణంగా ఉత్తప్ప, సాలమ్మ ఇద్దరు పనివాళ్లు వెళ్లిపోయేసరికి రెడ్డికి చాలా కష్టం అవుతుంది. బ్లాక్ కాఫీ కోసం వంట గదిలోకి వెళతాడు. కానీ ఆ గదిలో ఏమి ఎక్క డున్నాయో ఏనాడు కూడా చూసి ఉండడు. కాఫీ కోసం అన్ని ప్రయత్నాలు చేస్తాడు. భార్యను తలుచుకొంటూ బాధపడ తాడు.

గోవిందరెడ్డి : రచయిత గోవిందరెడ్డి పాత్రను సృష్టించిన తీరు అద్భుతం. ఫ్యూడల్ వర్గానికి చెందిన గోవిందరెడ్డి ఆధిపత్యం, సామ్రాజ్యం ఏ విధంగా కూలిపోతుందో చాలా చక్కగా చిత్రిం చారు. గోవిందరెడ్డి రంగారెడ్డి పెద్ద కొడుకు. అతనంటే అనంత జనానికి ఉచ్చ. భయపడి చస్తారు. అతనికి ఎదురు ఎవరు

రాకూడదు. రైలును ఆపమంటే తను వచ్చిందాకా రైలు ఆపాలి. అతని మాటకు ఎవరూ ఎదురు తిరగకూడదు. తిరిగితే మరణమే. శత్రువు నామరూపాలు లేకుండా చేయడంలో ఆరితేరిన సమర్థుడు. నేలగల్లు కోట నేలమాళిగలో వందలాది శవాల అస్తిపంజరాలుంటాయి. అవి శత్రువులవి, పోలీసులవి, రెవిన్యూ వాళ్లవి. గోవిందరెడ్డి భార్య చనిపోతుంది. అతని కొడుకులు తండ్రిని వదిలి అమెరికాలో చదువుకొని అక్కడే ఉద్యోగంలో చేరి అక్కడి పౌరసత్వం ఉన్న అమ్మాయిలను పెళ్లి చేసుకుని అక్కడే నివసిస్తుంటారు. ఎప్పుడో ఒకసారి వచ్చి తండ్రిని కలిసి వెళ్లిపోతారు.

రచయిత పీడించే వాళ్లు, ఆధిపత్యాలు చెలాయించేవాళ్లు ఎప్పటికైనా దేశాభివృద్ధికి ఆటంకమని భావించారు. వాళ్ల సామ్రాజ్యాన్ని కూల్చడానికి ఏఎస్పీ బజారన్న వంటి పాత్రను ఎన్నుకొన్నాడు.

వేంకటేశ్వరరెడ్డి : రచయిత వేంకటేశ్వరరెడ్డి పాత్రను మద్యానికి, స్త్రీలకు బానిసైన పాత్రగా తీర్చిదిద్దాడు.

గంగారెడ్డి రెండో కొడుకు వేంకటేశ్వరరెడ్డి. ఆయనది మహారాజు కళ, చేయెత్తు మనిషి. ఇతను చదువుకోడు. దేశ దిమ్మరి. పెళ్లి చేసుకోడు. కానీ పక్కలో పడుకోవడానికి మాత్రం ఆడమనిషి కావాలి. మందైనా తాగుతాడు. బెంగళూరులో స్థిర నివాసం ఏర్పరచుకొంటాడు. వేంకటేశ్వరరెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా పోటీచేసి వరుసగా ఆరుసార్లు గెలుస్తాడు. నెహ్రూ మంత్రి పదవి ఇస్తానన్నా వద్దంటాడు. ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ కారణంగా దేశంలో కాంగ్రెస్ అభ్యర్థులందరూ ఓడిపోతారు. కానీ వేంకటేశ్వరరెడ్డి మాత్రం గెలుస్తాడు. ఎమర్జెన్సీ కాలంలో ఆ ఎంపీ రాజకీయ జీవితం పరిసమాప్తి అవుతుంది. ఏ పని అడిగినా చేసి పెడ్తాడు. సంజీవరెడ్డి రాష్ట్రపతి అయిన తర్వాత పూర్తిగా పార్లమెంటు భవనాన్ని బాయికాట్ చేస్తాడు. అలా తాను తాగి బెంగళూరులో చనిపోతాడు. మనిషి మద్యానికి, స్త్రీలకు బానిసైతే ఏనాటికి కూడా కోలుకోరని రచయిత రెడ్డి పాత్ర ద్వారా చూపించారు. నేటి సమాజంలో ఎంతో మంది ప్రజలు మద్యానికి, స్త్రీలకు బానిసలవుతున్నారు. మనిషి వాటికి దూరంగా ఉండాలని రచయిత పరోక్షంగా చెప్పారు.

సుబ్బరాయుడు : రచయిత సుబ్బరాయుడుని గొర్రెల మంద యజమాని పాత్రగా చిత్రించారు.

సుబ్బరాయుడు ఐదు గొర్ల మందల యజమాని. గొర్రెలు అతని ఆస్తిపాసులు. రాయుడు గొర్లు మేపడు. కొండకు తోలుకుపోడు. వారానికి కనీసం పది పొట్టేళ్లు అమ్ముతుంటాడు. అలా పొట్టేళ్లు అమ్మి నెలకు లక్ష రూపాయలు సంపాదిస్తాడు. వర్షం వల్ల పేదలు, అణగారిన వర్గాల వారు తమ ప్రాణాలను, ఆస్తులను, ఇళ్లను, సంపాదనను పోగొట్టుకుంటారు. ఈ దృశ్యాలను రచయిత చాలా చక్కగా చిత్రించారు. రాయుడి, అంకాలప్ప పాత్రల ద్వారా ఈ నాటికి కూడా పట్టణాల్లో వర్షం వస్తే అనేక ఇబ్బందులు పడుతూనే ఉంటారు. ఈ సమస్యలు లేకుండా చూడాలని రచయిత కోరిక.

ఉత్తప్ప : ఉత్తప్పని రచయిత నమ్మకస్తుడైనా, మర్యాదస్తుడైన పాత్రగా చిత్రీకరించారు. ఉత్తప్ప రాం.పి.రెడ్డి వాళ్ల పనిమనిషే కాదు, కారు డ్రైవరు కూడా, చాలా నమ్మకస్తుడు. మర్యాదస్తుడు. మంచివా డు. పనిమానడు. పొద్దుపొడవకముందే వస్తాడు. మొదట్లో రాం.పి.రెడ్డి బంగ్లాలోనే ఉంటాడు. ఆ తర్వాత పెళ్లి చేసుకొని కొట్టంలో భార్యతో ఉంటాడు. అతనికి ఇద్దరు కొడుకులు. వాళ్లకి పెళ్లిళ్లు చేయిస్తాడు. ఉత్తప్పకి ఇప్పుడు అరవై ఏళ్లు ఉంటాయి. వర్షం కారణంగా ఉత్తప్ప భార్యకి పై పెంకు పడి తల పగులుతుంది. అతను భార్యని వదిలి బయటికి రాలేకపోతాడు. తాను వెళ్లకపోతే రెడ్డికి పొద్దు పొడవదు. ఏం చేయాలి? అని ఆరాటపడుతుంటాడు.

ఈరోజు సాలమ్మ వెళుతుందని అనుకొని తాను పని మానుకొంటాడు. కానీ ఆరోజు సాలమ్మ కూడా వెళ్లదు. మరుసటి రోజు ఉత్తప్పరెడ్డి ఇంటికి వెళతాడు. అప్పటి వరకు భయంతో ఉన్న ఆ వృద్ధ దంపతులు ఉత్తప్పని చూసిపోయిన ప్రాణం తిరిగి వస్తుంది. ఎంతో ఆనందంతో పొంగిపోతారు. రెడ్డి అతన్ని హత్తుకొని ఏడుస్తాడు. ఉత్తప్ప ఆ బంగ్లాను చూసి భయపడి బంగ్లాపై కప్పు కూలిపోయే ప్రమాదం ఉన్నది మనం మిత్రుల ఇంటికి వెళ్లిపోదాం, ఇక్కడ ఉండడం చాలా ప్రమాదం అని వాళ్లకు చెబుతాడు. వాళ్లను అక్కడి నుంచి తీసుకుపోవడానికి చాలా ప్రయత్నాలు చేస్తాడు. వాళ్లు ఒప్పుకోరు. వాళ్లకు గంజి కాసి ఇచ్చి తాగి విశ్రాంతి తీసుకోండని చెప్పి రాత్రి పది గంటలకు అక్కడి నుంచి వచ్చేస్తాడు. ఆ బంగ్లా కుప్పకూలిపోతుంది. వాళ్లు చనిపోతారు. ఉత్తప్ప మళ్లీ ఉదయాన్నే వచ్చి చూస్తాడు. వాళ్లు బతికివున్నారో, లేదోనని తన మనస్సులోనే అనుకుంటాడు. అలా ఎంత వర్షం పడినా, ఆపద వచ్చినా తన వృత్తిని మాత్రం మానకుండా రెడ్డి వాళ్ల ఇంటికి వెళ్లి వాళ్ల మంచి చెడులను చూస్తాడు.

ఏఎస్పీ బజారన్న : రచయిత ఏఎస్పీ బజారన్న పాత్రను ఎంతో ధైర్యవంతుడి పాత్రగా తీర్చిదిద్దారు.

రచయిత త్రేతానాగు వంటి గోవిందరెడ్డిని అరెస్టు చేసి స్టేషన్‌లో చితకబాది, గుండు గీయించి ఊరంతా ఊరేగించాడంటే ఎంతో ధైర్యం, సాహసం కావాలి. ఇలాంటి నిజాయితీపరులైనా ఏఎస్పీలు నేటి సమాజానికి ఎంతో అవసరం. ఈ విధంగా రచయిత అనంతపురంలో భారీ వర్షం కారణంగా పేదలు, తమ ప్రాణాలను, ఆస్తులను, ఇళ్లను ఏ విధంగా కోల్పోతారో వివిధ పాత్రల ద్వారా చాలా చక్కగా చిత్రించారు. అలాగే ఫ్యూడల్ వర్గానికి చెందిన రెడ్డి సోదరుల సామ్రాజ్యం ఏ విధంగా నేలమట్టం అయ్యిందో కూడా మన కళ్లకు కట్టినట్టు చూపించారు. అందుకే ఈ నవల 'మూర్తిదేవి' అవార్డును సొంతం చేసుకుంది.

ఉపయుక్త గ్రంథాలు : 1. ఆచార్య కొలకలూరి ఇనాక్, అనంత జీవనం, 2007, జ్యోతి గ్రంథమాల.

ఒంటిమిట్ట జాంబవ క్షేత్రమేనా?

పవన్‌కుమార్ పంతుల
సీనియర్ జర్నలిస్టు, కడప
రాష్ట్ర పర్యాటక ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత

వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయం నాలుగేళ్లుగా తరచూ వార్తల్లో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం దీనికి అధికార హోదా గుర్తింపునివ్వడంతో ఈ ఆలయాన్నీ నిర్వహణను తిరుమల తిరుపతి దేవస్థానాలు స్వీకరించాయి. ప్రభుత్వం ఈ ఆలయానికి అధికారిక గుర్తింపునిచ్చేందుకు అవసరమైన ఆధారాలు అవసరమని భావించింది. దీంతో ఈ హోదా కోసం పోటీపడ్డ రాష్ట్రంలోని కొన్ని ఇతర ఆలయాల ప్రతినిధులు తమ ఆలయాల పురాతనత్వాన్ని, చరిత్రనూ ప్రభుత్వానికి సమర్పించారు. వైఎస్ఆర్ జిల్లాకు చెందిన చరిత్రకారులు విద్వాన్ కట్టా నరసింహులు ఒంటిమిట్టలోని కోదండరాముడిని జాంబవంతుడు ప్రతిష్ఠించినట్లు పురాణాల్లో నుంచి కొన్ని ఆధారాలు చూపారు. ఈ ఆలయంలో హనుమంతుడు లేకపోవడం కూడా ఓ కారణంగా స్పష్టం చేశారు. చరిత్రకారులు ఇది జాంబవ ప్రతిష్ఠ అంటూ చూపిన ఆధారాలను విశ్వసించడంతో ఒంటిమిట్ట ఆలయానికే ప్రభుత్వ గుర్తింపు లభించింది. దీంతో ఈ క్షేత్రం జాంబవ ప్రతిష్ఠగా, ఈ క్షేత్ర పాలకుడు జాంబవంతునిగా గల చరిత్ర మరోమారు వెలుగుచూసింది.

అంబవరం గ్రామంలోని నడివీధిలో ఉన్న జాంబవంతుని విగ్రహం

పురాణ ఆధారాలు సరే... ఇది జాంబవంతుడు ప్రతిష్ఠించిన విగ్రహాలు గల క్షేత్రమని ఇంకే ఆధారాలూ లేవా? అని సందేహించిన వారికి సంతృప్తి కరమైన సమాధానం లభించలేదు. 'ఇంకేదైనా ఆధారం లేకుంటే ఎలా విశ్వసించాలి. ఈ క్షేత్ర ప్రాచీనతను ఎలా విశ్వసించాలి?' అంటూ దీర్ఘాలు తీస్తున్నవారికి తృప్తికరమైన సమాధానం లభించలేదు.

రాయలసీమ పర్యాటక పితామహులు సిద్దవటం సీతారామయ్య వైఎస్ఆర్ జిల్లాలోని తూర్పు పర్యాటక ప్రాంతాల ఫొటో బ్రోచర్‌ను రూపొందించే బాధ్యతను తన శిష్యులకు అప్పగించారు. కొండూరు పిచ్చమ్మ, వెంకటరాజు స్మారక సంస్థ ఆధ్వర్యంలో, కొండూరు జనార్ధన రాజు ఈ ప్రాజెక్టుకు పర్యవేక్షకులుగా తొలుత జిల్లాకు చెందిన సిద్దవటం వద్దనున్న 'జ్యోతి' క్షేత్రానికి వెళ్లాం. ఫొటో గ్రఫీతో నిపుణులు ఎల్లేశ్వరరావు, జ్యోతి జార్జి, జిల్లా పర్యాటకాభివృద్ధి సంస్థ అధ్యక్షులు, యోగివేమన విశ్వవిద్యాలయం చరిత్ర విభాగాధిపతి సాంబశివారెడ్డి, సంస్థ కార్యదర్శి చరిత్ర అధ్యాపకులు డాక్టర్ రామాంజుల రెడ్డి వైవీయూ లలితకళలు, చిత్రకళ విభాగాధిపతులు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి, కోట మృత్యుంజయరావు, ఎలమర్తి మధుసూదన్ జ్యోతి క్షేత్రంలోని శిల్పాలు, ఆలయాలు, వందలాది శివలింగాలు, పానిమట్టాలు, రాజగోపురం, శాసనాలు తదితరాల ఫొటోలు తీసుకున్నారు. వివరాలు రికార్డు చేసుకున్నారు. 11వ శతాబ్దానికి చెందిన 'జ్యోతి' క్షేత్రం ఒకప్పుడు గొప్ప వైభవంతో వెలిగింది. పెన్నా నది వరదలకు ఇసుకలో పూడుకుపోయింది. ఇటీవల తవ్వకాలలో జ్యోతీశ్వరస్వామి ఆలయంతో పాటు మరికొన్ని ఆలయాలు, ప్రహరీ, ఇంకెన్నో శిథిలాలు బయటపడ్డాయి. ఉత్సాహంగా తిరుగుముఖం పట్టారు.

జ్యోతి గ్రామంలో : జ్యోతి క్షేత్రం నుంచి జ్యోతి గ్రామం వంద మీటర్ల దూరంలో ఉంటుంది. ఫొటో గ్రాఫర్ ఎల్లేశ్వరరావు మరో ముగ్గురితో ముందు వెళ్తుండగా మిగతా అందరం వెనకాల వస్తున్నాం. ముందు వెళ్తున్నవారు గ్రామంలో ఆగి ఉండడం గమనించి మేమూ ఆగాం. రోడ్డు వారగా ఓ చిన్న అరుగు. దానిపై బండ నిలబెట్టి ఉంది. వాటి నిండా పసుపు కుంకుమ బొట్లు. దగ్గరగా వెళ్లి చూస్తే అది శాసనం. మధ్యలో ఆంజనేయస్వామిలాంటి రూపం చెక్కి ఉంది. పైన ఏదో యంత్రం లాంటి గీతలు, అర్థంకాని భాషలో అక్షరాలు..అది జాంబవంతుని రూపమని గ్రామవాసులు చెప్పగా అందరం ఆశ్చర్యపోయాం. నమ్మకం కలగలేదు. అది ఆంజనేయుని రూపమేనని భావించాము. అదేం కాదు. ఇది జాంబవంతుని రూపమేననీ, గ్రామంలో ఇంకోచోట హనుమంతుని రూపం

గల బండ ఉందని చెప్పగా వెళ్లి చూశాం. వారు చెప్పింది నిజమే. జాంబవంతుని బండగల దాన్ని కిందకు తవ్వు తుండగా భూమిలో 10 అడుగులలోతులో ఈ బండ కనప డడంతో బయటకు తీసి, ఆ రూపం, అక్షరాలు గమనించి ఇక్కడే ఉంచి పూజలు చేస్తున్నామని ఒంటిమిట్ట రాముడు జాంబవంతుని ప్రతిష్టయేనని పెద్దలు చెబుతున్నారనీ, ఆ జాంబవసాములోరే మా పల్లెలో కొలువైనాడని భావించి పూజలు చేస్తున్నామని గ్రామ ప్రజలు చెప్పారు. శ్రీరామ నవమికి ఒంటిమిట్టలోని మూల మూర్తులను జాంబవంతుడే ప్రతిష్టించే ఉండొచ్చు గాని, గ్రామాల్లో ఇతర దేవతల్లా జాంబ వంతుణ్ణి కూడా పూజిస్తుండటం విశేషంగా అనిపించింది. జాంబవంతుని విషయం పత్రికల్లో వచ్చింది. ఆ మర్నాడే 'మా ఊళ్లో కూడా జాంబవంతుడున్నాడు. మేం కూడా అయన్ని పూ జిస్తున్నాం' అంటూ ఆ గ్రామాలకు చెందిన వారు సమాచారం ఇచ్చారు. బృందంతో వెంటనే బయల్దేరి వెళ్లాం.

జ్యోతి గ్రామంలో బండపై గీసి ఉన్న జాంబవంతుని రూపం

<u>దగ్గర్లోనే</u> : కడప నగారానికి 18 కి.మీ దూరంలో ఉంది 'అంబవరం' గ్రామం. గ్రామం మధ్యలో కట్టివున్న చిన్న దిమ్మెపై జాంబవంతుని రెండు అడుగుల విగ్రహం ఉంది. విగ్రహం చేయి తిరిగిన చిత్రకారుడు గీసిన చిత్రంలా ఎంతో బావుంది. 'జాంబవంతుడంటే ఇలాగే ఉంటాడు' అనిపిం చింది. గ్రామ వాసులు వివరాలు అందించారు. ప్రస్తుతం జాం బవంతుని విగ్రహం ఉన్న స్థలంలో అనాదిగా గ్రామంలోని వారు, చుట్టుపక్కల గ్రామాల వారూ ఆ రాతినే జాంబ వంతునిగా పూజిస్తుండే వాళ్లమని తేల్చారు. రోడ్డు వారగా ఉండడంతో అటుగా వెళ్తున్న ఓ ట్రాక్టర్ తగిలి ఆ రాయి భూ మినుంచి బయటికొచ్చిందనీ, కొద్దిగా పగిలి ముక్క ఊ డడంతో ఆ రాతిని రోడ్డుకు మరింత వారగా ప్రతిష్టించి, దాని స్థానంలో ఈ జాంబవంతుని విగ్రహాన్ని చేయించి పెట్టామని చెప్పారు. ఆ స్వామి అంటే తమకెంతో విశ్వాసమన్నారు ఆ గ్రామవాసులు. వరుసగా రెండో సంవత్సరం కూడా వర్షాలు రాకుంటే నెలరోజులపాటు ఇంటికో కడవ (బిందె) నీళ్లు తెచ్చి జాంబవంతుని విగ్రహాన్ని అభిషేకరిస్తామనీ, ఆ సంవత్సరం ఆ గ్రామంలోగాని, పరిసరాల్లో గానీ, మంచి వర్షం కురుస్తుందనీ ఆ గ్రామవాసులు పలువురు పెద్దలు విశ్వాసంగా చెప్పారు. జాంబవంతుడు ఉండిన గ్రామం గనుక దీన్ని 'జాంబ వపురం'గా పిలిచేవారనీ, కాలక్రమంలో అది 'అంబవరం'గా మారిందని కూడా చెప్పారు. (ఆ ప్రాంతాన్ని కాకతీయులు సామంతుడు అంబదేవుడు పాలించాడుగనుక ఆ గ్రామానికి అంబవరంగా పేరొచ్చిందని కైఫియత్‌లో ఉంది).

<u>తాడిగొట్లలో</u> : తాడిగొట్ల గ్రామం కడప నగరానికి ఎనిమిది కి.మీ దూరంలో (యోగివేమన విశ్వవిద్యాల యానికి 3 కి.మీ దూ రంలో) ఉంది. ఊరి మధ్యలో విశాలమైన అరుగుపై ఆ గ్రా మ ప్రజలు జాంబవంతుని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పశువులు జొరబడకుండా అరుగు చుట్టూ ఇనుప కటాంజనం ఏర్పాటు చేశారు. అది ఆరేళ్ల క్రితం ప్రతిష్టించిన విగ్రహమే. అంతుముందు ఆ స్థానంలో ఓ బండపై జాంబవంతుని రేఖా చిత్రం ఉండేదనీ, పలు తరాలుగా గ్రామవాసులు దాన్ని పూ జించేవారనీ ఆ గ్రామ ప్రజలు తెలిపారు. అది పగిలిపోవడంతో కొత్తగా విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించుకున్నారు. ఈ విగ్రహానికి గ్రామవాసులు నిత్యం పూజలు చేస్తున్నారు. శ్రీ రామనవమిని గ్రామంలో ఘనంగా నిర్వహిస్తామనీ, ఒం టిమిట్ట బ్రహ్మోత్సవాలకు గ్రామవాసులంతా లారీల్లో వెళతామనీ చెప్పారు. ఈ గ్రామంలో కూడా జాంబవంతుని అభిషేకం చేస్తే తప్పక వర్షాలు కురుస్తాయన్న విశ్వాసం ఉం ది. మరీ ముఖ్యంగా గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా, తొలి పూజలు జాంబవంతునికే చేస్తామని తెలుపుతున్నారు. ఈ గ్రామంలోనేగాక ఇంకా, కడప నగరానికి 10 కి.మీ దూరంలో ఉన్న కొప్పర్తి గ్రామం, పెద్దపుత్త గ్రామాల శివార్లలో కూడా జాంబవంతుని విగ్రహాలున్నాయన్న సమాచారం ఉంది. ఏది ఏమైనా వైఎస్ఆర్ జిల్లాలోని చాలా గ్రామాల్లో జాంబవంతుని విగ్రహాలు పూజలందుకుంటు న్నాయి. ఇది ఒంటిమిట్ట జాంబవపాలక క్షేత్రమనడానికి ఓ రకంగా ఊతమిస్తోంది. చరిత్రకు ఆధారం, పురాణేతిహాసాలకు విశ్వాసమే కదా ఆధారం.

జాంబవంతునిగా పూజలందుకున్న శిల

ఎదారి బతుకులు

పుస్తక పరిచయం - డాక్టర్ జిలుకర శ్రీనివాస్

నిన్న ఎటూ కదలకుండా ఒక పుస్తకం చదివిన. ఎండపల్లి భారతి రాసిన కథల సంపుటి 'ఎడారి బతుకులు'. ఒక్కొక్క కథ చదువుతుంటే సంబురం, ఆశ్చర్యం, అంతులేని దుఃఖప్రవాహం నన్ను ముంచెత్తాయి. నా జీవన సహచరి అరుణ కవలల్ని కడుపులో మోస్తుంది. మా పిల్లలకు ఆ కథలు వినిపించాలని ఇద్దరమూ కలిసి చదివాము. వాళ్ళు కడుపులో హాయిగా కదులుతూ విన్నారు.

చిత్తూరు జిల్లా మదనపల్లికి కొద్ది దూరంలో ఉండే ఒక మాదిగ పల్లె బిడ్డ. కేవలం ఐదో తరగతి వరకే చదివింది భారతి. కానీ జీవితాన్ని లోతుగా చదివింది. అనుభవాన్ని సృజనాత్మకంగా వ్యక్తీకరించడానికి చదువేమీ అక్కర్లేదు. పెద్ద చదువులు చదివిన కథకులు చాలా మంది రాయని, రాయలేని అద్భుతమైన కథలామె రాసింది. చిత్తూరు జిల్లా జీవ భాష తొణికిసలాడుతూ ఉంది ఆమె చేతిలో. గడ్డుతునకలు, గంగవ్వ పోసె మజ్జిగ, పూలపెట్ట గుడ్లు, ఒకటా రెండా ఎన్నో కథలు. పూలపెట్ట కథ చదివి కడుపారా నవ్వుకున్న. ముగింపు చదివి కన్నీరు కార్చా. అలాగే, కోడలికి తిండి సరిగా పెట్టని అత్త కథ చదివి కదిలిపోయా.

హైదరాబాద్‌లో కూచోని అడ్డమైన కథలు రాసి, పత్రికలో అచ్చేసుకోవడానికి ఆరాటపడే కథకులు చాలామంది ఉన్నారు. వాళ్లంతా ఈ కథలు చదివి రాత మార్చుకోవాలి. ముఖ్యంగా దళిత కథకులు రొటీన్ కథలు రాసి, జబ్బలు చరిచేవాళ్లు తయారయ్యారీ మధ్య. వాళ్లు ఈ కథలు చదివి ఎలా కథలు రాయాలో నేర్చుకోవాలె. అందులో ఓ కథను ప్రచురిస్తున్నాం.

ఎండపల్లి భారతి

ఈ ఏడాది కాసినట్ల ఎండలు ఎబ్బుడూ కాయలేదు. ఆ ఎండలకి దిగులుపడి, దినమ్మా కూలికి పొయ్యేవాళ్లం గూడా, మూడుపూటలకు ఒక కూడు చాల్లే అనుకోని, దినం మార్చి దినం పోతా ఉంటాము. మంగళారం అయితే, ఆడోళ్లం ఇండ్లకాడనే పన్లూ పాట్లూ చేసుకుంటూ ఉండిపోతే, మొగోళ్లు సంతకి పొయి వస్తా ఉంటారు.

ఆపొద్దు మంగళారం. పొద్దన సంగటిపొద్దుకే బండలు పగిలే ఎండ కాస్తా ఉండాది. బిరబిర పొయ్యికాడ పనులు ముగించుకుని, టీవీ ముందర కుచ్చుంటిని. 'ఆ నలుగురు' సినిమా వస్తా ఉండాది. మనిసికి బతికుండేట బ్బుడైనా చచ్చినాకైనా నలుగురు తోడుండాలంట. నిజమే కదా అనుకుంటూ ఉసురూపసురూ తియ్యకుండా చూస్తా ఉండాను. టప్పని కరంటు పొయింది. ఉసూరుమంటా ఇం టిగోడలకల్లా నాలుగంచులూ పారచూస్తిని. మూలమూలల్లో బూజు తుట్టుకట్టి వేలాడతా ఉండాది. బూజులు దులిపి చానా దినాలైంది. 'పనికి పొయొచ్చినాక టీవీ ముందర కుచ్చునేదే పని, ఇంక ఇల్లు ఇట్లుండక ఎట్లుంటాది' అనుకుంటా ఇంట్లో ఉమ్మరంగా ఉంటే బయిటికి పోతిని.

పేరుకు నూరిండ్లు ఉండే ఊరు మాది. అయినా వీదిలో పిట్టగూడా లేదు. ఈ పొద్దే కాదు, ఈ టీవీలు వచ్చినబ్బుటి నింటి ఇంతే. పగులుగానీ రెయ్యిగానీ ఇండ్లకివతల తలకాయే కనబడేది లేదు. ఇందరుండే ఊర్లో అందరమూ ఒంటిగాళ్లము అయిపోతిమి.

మావీదికి కడాన ఒక కానగమాను ఉండాది. దానికింద పదిమంది కుచ్చునేంత బండ ఉండాది. నేను పొయి మానుకింద కుచ్చుంటిని. కానగమాను కన్నతల్లి అంటారు. ఆ నీడ అంత చల్లంగా ఉంటాది. చల్లగాలికి నాకు నిలువుతూగు వస్తా ఉండాది.

(మిగతా 30వ పేజీలో)

డా॥ ప్రభాకర్ చౌటి,
పరిశోధక విద్యార్థి, ఫ్రీలాన్స్ జర్నలిస్టు

అంబేద్కర్ భారతమిదేనా?

సాంఘిక విప్లవమూర్తి, నవభారత నిర్మాత, భారతదేశ మార్గదర్శి, మహోన్నత వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనం, సమోన్నత విలువలకు సాక్షాత్తూ రూపం భారతరత్న... కాదు కాదు “విశ్వరత్న” డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి. అవినీతి, అరాచకం, అన్యాయం, అప్రజాస్వామ్యం రాజ్యమేలుతున్న ఈ తరుణంలో అంబేద్కర్ ఆశయాలు, ఆదర్శాలు, విలువలు ఈ సమాజాన్ని మార్చడానికి ఎంతో ఉపయోగపడతాయి. అంబేద్కరిజాన్ని ఈ సమాజంలో ఆవిష్కరింపచేయడానికి ఒక కరపత్రం, ఒక ఉపన్యాసం, ఒక బహిరంగసభ, ఒక వ్యాసం ఇలా... ఏదైనా ఎంతో కొంత మేలు చేసేదే. అదే క్రమంలో ఒక శాశ్వత పరిష్కారంలో భాగంగా అంబేద్కర్ వాదాన్ని మరింత పక్కా ప్రణాళికతో ఈ సమాజానికి అందించాలి. అంటరాని కుటుంబంలో జన్మించినా, అన్ని రకాల అసమానత, బానిస, వివక్ష సంకెళ్లను తెంచుకుని అతడు ఎదిగిన క్రమం ఏ తరానికైనా నిత్యస్ఫూర్తే. తన ఆశయ సాధనలో, ఏ రోజు తను నమ్మిన విలువలకు తిలోదకాలు ఇవ్వలేదు. ఆత్మగౌరవానికే ప్రాధాన్యత ఇచ్చి... కేవలం పదవి కోసమే... కుట్రలు పన్నే పనికిరాని కుయుక్తులకు అతడు ఎంతో దూరంగా ఉన్నాడు. ఇలాంటి మహనీయుని జీవిత మార్గం కూడా రేపటి “ఆధునిక భారత నిర్మాణానికి “ఎంతో అవశ్యకం. రేపు నిర్మించబోయే ‘ఉన్నత వ్యక్తిత్వ’ ఆధారిత సమాజానికి ఎంతో మేలు చేస్తుంది.

ఆయన వాదం అంబేద్కర్ వాదం, ఆయన వాదం విశ్వజనీనం, ఆయన వాదం ఆదర్శవాదం మానవవాదం, నిరంతర వాదం, అది అనుసరణీయం, ఆదరణాత్మకం. ఇవి గొప్ప లక్షణాలున్న అంబేద్కర్ వాదం, నేడు... కేవలం అంబేద్కర్ జయంతి వర్ధంతి రోజు మాత్రమే చర్చించడం, కేవలం ఆరోజు మాత్రమే విశ్లేషించడం, ఆ రోజు మాత్రమే అది పాటించటం నిజంగా విచారకరం. అంబేద్కర్ వల్ల ఇండియాకి పేరొచ్చింది తప్ప ఈ భారతం వల్ల అంబేద్కర్ కి ఇంకా సరైన న్యాయం జరగలేదు. అంబేద్కర్ వాదమే సరైనదని, ఆయన ప్రతిపాదించిన ప్రజాస్వామ్యమే ఆచరణీయమని ప్రపంచమంతా చాటిచెప్తూ, దాని ఆచరణకై అన్ని రకాల మార్గాలను శోధిస్తున్న ఈ సమయంలో.... తాము నిజంగా అంబేద్కర్ వాదులమని చెప్పుకునే ‘అంబేద్కర్ వాదులు’ అనుసరిస్తున్న మార్గాలు, గమ్యాలు మాత్రం అగమ్యగోచరంగా తయారయ్యాయి. ఒకవేళ అంబేద్కర్‌కు ఈ దేశంలో ఏం జరుగుందో తెలుసుకునే అవకాశముంటే. అంబేద్కర్ నిజంగా దుఖిస్తాడు. అంబేద్కర్ నిజంగా మదనపడతాడు. ఎందుకంటే ఇలాంటి విపరీత ధోరణి, ఇలాంటి విపరీత మనస్తత్వం ఉన్న మనుషులు ఉంటారని, ఇలాంటి వారి వల్ల ఈ దేశ నిర్మాణానికి ఎలాంటి ఉపయోగం లేదని ఆనాడే అంబేద్కర్ ఎంతో ఆవేదనతో ఆగ్ర ఉపన్యాసంలో ఉటంకించారు.

ఆయనేం చెప్పారంటే... ఆయన మాటల్లోనే.... “చదువుకున్న వాళ్లంతా నన్ను మోసం చేశారు”. విద్యావంతుల్లో కొంత అభివృద్ధి ఉంది. విద్య వల్ల కొందరు ఉన్నత స్థానాలకు ఎదిగారు. కాని ఈ విద్యావంతులే నన్ను మోసం చేశారు. వీరు ఉన్నత విద్యావంతులైన తరువాత ఈ సమాజానికి సేవ చేస్తారని అనుకున్నాను. కానీ చిన్నా, పెద్ద అంత పోగయి వారి వారి కుటుంబాల బాగోగులు మాత్రమే చూసుకుంటున్నారు”. మార్చి 18, 1956న తన చారిత్రక “ఆగ్రా ఉపన్యాం”లో బాబా సాహెబ్ అంబేద్కర్ ఆవేదన ఇది. ఈ ఉపన్యాసం అంతా... రిజర్వేషన్ను ఉపయోగించుకుని ఎదిగిన ప్రభుత్వ ఉద్యోగుల స్వార్థపూరిత విధానాలను, వారు అణగారిన వర్గాలకు ఏమాత్రం ఉపయోగపడకుండా ఉన్న ఒక సంకుచిత దృక్పథాన్ని స్పష్టంగా వివరించింది. ఇదే ఉపన్యాసంలో అంబేద్కర్ వివి

తెలంగాణ ప్రభుత్వాన్ని అదే ప్రభుత్వంలో ఉంటూ అంబేద్కర్ వాదులమని చెప్పుకునే వారు... ఎందుకు ప్రశ్నించరు? ఏ పార్టీలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా... అంబేద్కర్ వాదం ఒకలాగ ఉంటుంది తప్ప... పార్టీ పార్టీకి అంబేద్కర్ వాదం మారదు. ఉంటే అంబేద్కర్ వాదిగానన్నా ఉండాలి లేదా... ఆయా రాజకీయ నాయకుల చేతుల భావనియంత్రణలోనైనా ఉండాలి తప్ప ఇలా... డోలాయమానంలో ఉండి, అంబేద్కర్ ఆశయసిద్ధి కోసం పనిచేస్తున్న వారికి ఆటంకాలు సృష్టిం చవద్దు. ఇలా అవుతుందని ముందే ఊహించిన అంబేద్కర్ గాంధీగారి వర్ణ సామరస్య సిద్ధాంతం నుంచి, కమ్యునిస్టుల వర్గపోరాటాల సిద్ధాంతంలోంచి అంబేద్కర్ దళిత సమస్యను దూరం చేశాడు. 'దళిత చైతన్య ఉద్యమం' స్వతంత్ర్యంగా రూపొందించాలని, దళితుల కోసం దళితులే పోరాడాలని నిర్ణయించారు.

ఇక గత సంవత్సవం మహనీయుల వర్ధంతి, జయం తి ఉత్సవాలకు కేవలం ఒక కులం వాళ్లు మాత్రమే హాజర వడం, అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో ఒక కులం వారే ఆధిపత్యం చెలాయించడం, పూలే జయంతిని బీసీల జయంతిగా మాత్రమే చూడటం... ఆధునిక వివక్షకు పరాకాష్ట. తెలంగాణలో 20%గా ఉన్న దళితులు ఒకవేళ ఒక నిర్మాణాత్మక దీర్ఘకాలిక ప్రణాళికలతో ఒక ఉన్నతమైన ఆశయంతో కనుక ముందుకెళితే అసలు అంబేద్కర్ ఆశించిన రాజ్యాధికారం ఎంతో సులభం. కానీ ఇది సాధ్యమా ఈ తెలంగాణలో అధి కారం, పదవికి (అందరూ రాజకీయ నాయకులు కాదు) తేడా తేలీకుండా అగ్రవర్ణ నాయకులు వేసే పదవులకు ఆశపడి అంబేద్కర్ ఆశించిన అసలైన ఆదర్శాన్ని పక్కనపెట్టి కేవలం ఆయా పార్టీల అగ్ర నాయకత్వ చెప్పుచేతల్లో నడుస్తూ... కేవలం తమ స్వార్థ ప్రయోజనాలు తప్ప జాతిప్రయోజనాలు పట్టని ఇంకా అంబేద్కర్ వాదులమంటూ మేమే అంబేద్కర్ జయంతులను నిర్వహిస్తామంటే అంబేద్కర్ ఆశించిన నైతికత ఉందా లేదా అని ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. వీరా అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేవారు? వీరా అంబేద్కర్ వాదులు? వీరా అంబేద్కర్ గురించి మాట్లాడేవారు? ఇ లాంటి వారి వల్ల అంబేద్కర్ ఆశయానికి నష్టమే తప్ప ఎలాం టి ప్రయోజనం లేదు. చరిత్ర అసాంతం మనుధర్మశాస్త్రం వల్ల తీవ్ర భావనియంత్రణలో ఉన్న మనం నేడు అదే మనుధర్మ శాస్త్ర పరిరక్షకులు రాజకీయ పార్టీల సిద్ధాంతాల పేరుతో దళిత నాయకులు అని చెప్పుకునే వారిని మరింత అతితీవ్ర భావనియంత్రణలోకి నెట్టి వారి వారి ఆశయాలను నెరవేర్చుకుంటున్నారు.

ఇక ఇప్పుడు దళితుల్లో నయా దళితవాదులు బయలుదేరారు. ఇదివరకే ఉన్న సంప్రదాయ అంబేద్కర్ వాదులను ఏమాత్రం లెక్కచేయకుండా ఏదో కొంత ఆర్థిక స్థిరత్వం, ఆధునిక వస్త్రధారణ సాధించినంత మాత్రాన మిగతా అంబేద్కర్ వాదులను మరింత అంటరానివారిగా చూస్తూ వీళ్లు ఎప్పుడు ఇంతే ఇక వీరు మారరా? ఎప్పుడు కులం జాతి అనుకుంటూ తిరుగుతారు అని మాట్లాడుతూ అగ్రవర్ణాల మెప్పు పొందడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇలాంటి వారి వల్ల నష్టమే తప్ప ఎలాంటి లాభం లేదు. ఇంకా ఇదే దేశంలో వారి వారి అధికారిక ఆఫీసులో అంబేద్కర్ ఫోటోను పెట్టుకోవడానికి జంకుతున్నారు. మిగతా అగ్రవర్ణాలు తనను అంబేద్కర్ వాదిని అని అనుకుంటారేమోనని, నన్ను దళితుడు అని గుర్తుపట్టి అంటారనివారిగా చూస్తారేమో అని, భయపడుతున్నారు. ఇంత అనాగరికంగా ఆలోచిస్తే ఇక స్వేచ్ఛ ఎక్కడున్నట్టు? స్వతంత్రం ఎలా వచ్చినట్టు? ఇంకా అంటరానితనం ఎలా రూపుమాపబడినట్టు? అంబేద్కర్ ఫోటో పెట్టుకోవడమంటే నువ్వు దళితుడిగా రిప్రెసెంట్ చేసుకోవడం కాదు అంబేద్కర్ వాదాన్ని ముందుకు తీసుకెళ్లే ఒక సైనికుడిగా చెప్పుకునే ఒక గొప్ప అవకాశాన్ని పొందడం లాంటిది. అంబేద్కర్ వాదమంటే కేవలం ఏదో ఒక కులానికి, మతానికి, జాతికి, ఏదో ఈ భారతదేశానికి సంబంధించిన వాదం కాదు. అంబేద్కర్ వాదాన్ని ముందుకు తీసుకెళ్లే ఒక సైనికుడిగా చెప్పుకునే ఒక గొప్ప అవకాశాన్ని పొందడం లాంటిది. అంబేద్కర్ వాదమంటే కేవలం ఏదో ఒక కులానికి, మతానికి, జాతికి ఏదో ఈ భారతదేశానికి సంబంధించిన వాదం కాదు. అంబేద్కర్ వాదం మానవవాదం, అంబేద్కర్ వాదం విశ్వజనీనం, అంబేద్కర్ వాదం కాలానికి అతీతమైన నిరంతరవాదం. నేడు దేశంలో కాంగ్రెస్, బీజేపీ అంబేద్కర్‌ను తమవాడిగా చెప్పు కోవాలని తెగ ఉబలాటపడుతున్నాయి. ప్రపంచమంతా అంబేద్కర్ వాదం ఎలా ఉపయోగపడుతుందో అని, ఈ ప్రపంచ మంతా అంబేద్కర్ మయం చేయాలనీ, మాకు ఒక అంబే ద్కర్ ఉంటే బాగుండును అని వివిధ దేశాలు ఆలోచిస్తుంటే మేము మాత్రమే అంబేద్కర్ వాదులమని చెప్పుకునే ఇలాంటి నకిలీ అంబేద్కర్ వాదులకు ఇలాంటి సంకుచిత స్వార్థ ప్రయోజనాల కోసం అంబేద్కర్‌ను వాడుకోవడం తగునా? అంబేద్కర్ ఆశించిన భారతం ఇదేనా? ఇలా చేసేవారంత వారి వారి అంతర్మనస్సుతో అవలోకనం చేసుకోవాలి. అంబేద్కర్ వాదులంటే ఇలాగే ఉంటారా? అనే ఒక కుహన అభిప్రాయా న్ని ఈ సమాజం ఏర్పరచుకునే లోపు వారు మారితే భారతం ఇదేనా? ఇలా చేసేవారంత వారి వారి అంతర్మనస్సుతో అవలో కనం చేసుకోవాలి. అంబేద్కర్ వాదులంటే ఇలాగే ఉంటారా అనే ఒక కుహన అభిప్రాయాన్ని ఈ సమాజం ఏర్పరచుకునే లోపు వారు మారితే అంబేద్కర్ వాదం కొంతైనా ముందుకెళుతుంది. అమాయక ప్రజలను, అజ్ఞానంలోకి నడిపించేందుకు తెలివైన వాళ్లు, అగ్రవర్ణాలు పన్నిన అనైతిక తిరోగమన ప్రణాళిక లాంటిదే ఇది. ముఖ్యంగా భారతదేశ సామాజిక, తాత్విక, సాంస్కృతిక, చారిత్రక విషయాల్లో వాస్తవంగా జరుగుతున్నదిదే. సరిగ్గా అదే అజ్ఞానవాదం అంబేద్కర్‌ను ఆయన స్థాయి

ధ వర్గాలకు వివిధ ఉద్దేశాలను కర్తవ్యాలను తీవ్ర ఆవేదనతో నిర్దేశించారు. ముఖ్యంగా సామాన్య ప్రజానికానికి... విద్యా, ఆర్థిక, సామాజిక అసమానతల విముక్తి కోసం "ఎన్ని త్యాగాలైనా" చేయాలని అవసరమైతే తమ జీవితాలను కూడా త్యాగం చేయాలనీ కోరారు. ఇక రాజకీయ నాయకులకు... నిన్ను నీవు అమ్ముకుంటే అంతకంటే మోసం మరోకటున్నదా అనీ, నాకు ఎవరివల్ల లేని భయం మీవల్లనే ఉందని ఆవేదన చెందారు. ఇక ఉద్యోగులు... ఖచ్చితంగా కనీసం 20% సంపాదనను ఈ సమాజ బాగుకోసం వెచ్చించాలని, మీరు రిజర్వేషన్‌ను ఉపయోగించుకుని పొందిన ఉద్యోగం... అదే జాతి ప్రయోజనాలను కాపాడుటకు, పేద ప్రజలకు, ప్రభుత్వానికి సంధానకర్తగా ఉంటూ, అణగారిన వర్గాల ప్రతినిధిగా బాధ్యత వహించాలి తప్ప, రిజర్వేషన్ ఫలానాను నీరుగారుస్తూ అగ్రవర్ణ ఆదిపత్య నాయకుల చెప్పుచేతుల్లోకి వెళ్ళి, అవినీతి అధికారులుగా, జాతికి వెన్నుపోటు పొడవద్దని జ్ఞప్తి చేశారు. ఇక విద్యార్థులు,యువకులకు ఒక గుమస్తాగా ఉద్యోగాల లాంటివి చేయకుండా, వారి వారి స్థానిక గ్రామాల్లో నిస్వార్థ సేవ చేయాలనీ సూచించారు. ఉన్నత ఉద్యోగాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ క్రమంలో భాగంగానే అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా మాన్యశ్రీ కాన్షీరాం స్థాపించిన బీఏఎంసీఈఎఫ్ (ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీ ఉద్యోగుల సమాఖ్య) కూడా ఉద్యోగుల చేత, ఉద్యోగుల కొరకే పనిచేసింది తప్ప (కన్షీరాం ఉన్నంతవరకు బాగానే పనిచేసినా) సమాజం కోసం పనిచేయలేదు. ఇక డిసెంబర్ 6, ఏప్రిల్ 14 ఒక సంప్రదాయ దినాలుగా, ఏప్రిల్ మాసమంతా ఒక పవిత్ర మాసంగా పరిగణించడానికి... కేవలం పూలమాలలు వేసి, పెద్ద పెద్ద గాలి మాటలు మాట్లాడి... చేతులు దులుపుకునే రోజులుగా తయారయ్యాయి.

నిజమైన అంబేద్కర్ వాదాన్ని అవలంభిస్తే ఈ దేశంలో బతకలేమని, నిజమైన అంబేద్కర్ వాదం ఇలాంటి రాజకీయ పరిస్థితుల్లో సాధ్యంకాదని, అయినా సుదీర్ఘ కాలం అంబేద్కర్ వాదులమని చెప్పుకునే వారు ఎం సాధించారని? అంబేద్కర్ వాదాన్ని తప్పుదోవ పట్టించి, తమకు అనువైన రీతిలో అంబేద్కర్ వాదాన్ని మలచుకుని, నకిలీ అంబేద్కర్ వాదులుగా తయారై, అంబేద్కర్ ముసుగులో, అంబేద్కర్‌కు అత్యంత ప్రమాదకరంగా తయారైన ఇలాంటి అంబేద్కర్ వాదులంతా అంబేద్కర్‌ను సరిగ్గా చదవకుండా, ఎవరో చెప్పిన మాటలు విని, అదే అంబేద్కర్ వాదమని నమ్మే వారు తప్ప... ఇలాంటి ముసుగులో ఉన్న వారు ఎప్పటికి అంబేద్కర్ వాదులు కాలేరు. అసలు అంబేద్కర్ చేసిన ఆందోళన వల్ల, నిజమైన అంబేద్కర్ వాదులవల్ల జరిగిన సమాజ మార్పులను చూస్తే తెలుస్తుందని అంబేద్కర్ వాదమంటే ఏమిటో, అంబేద్కర్ ఆందోళన వల్ల ఆత్మగౌరవం అంటే తెలిసొచ్చింది. స్వాలంబన ఆచరణాత్మకమైంది. మానవత్వ భారతం చర్చకి వచ్చింది. నిస్సందేహంగా నీ అభిప్రాయాలను వెల్లబుచ్చుకునే 'స్వేచ్ఛ' వచ్చింది. భారతీయులుగా జీవించు అన్న నిశ్చయం. భారతీయుల కాబట్టి అన్ని రంగాల్లో హక్కులు పొందాలన్న పట్టుదల, తమ మార్గాన్ని తాము అన్వేషించుకోవాలన్న నిర్ణయం... త్యాగం, సంఘర్షణ లేకుండా ఎప్పుడు సాఫల్యం లభించదనే ఒక అవగతం, రెండు మూడు లక్షల జనాభా ఉన్న దేశాలే కలిసి మెలిసి ఉండలేక, తమకు ఏ రాజ్యాంగం కావాలో నిర్ణయించుకోలేక (నేపాల్), తమలో తామే కొట్టుకుంటూ, దేశ ఐకమత్యం మిధ్యగా తయారవుతున్న ఈ కాలంలో కూడా... ఇన్ని జాతులు, ఇన్ని కులాలు, ఇన్ని వివక్షలు ఉన్న ఈ దేశంలో ఇంకా ప్రజాస్వామ్యం అవలంభించబడుతుందని అంటే, ఇంకా ఈ దేశం ముక్కలు కాకుండా ఉంది అంటే... ఇంకా... మనుధర్మ శాస్త్రాన్ని తప్ప ఇంకో శాస్త్రాన్ని అంగీకరించని దేశ ప్రధానమంత్రి కూడా "బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగమే" అత్యున్నత గ్రంథమని, దానివల్లనే ఈ దేశం శోభిల్లుతుందని కితాబిచ్చాడంటే అది కేవలం అంబేద్కర్ పోరాటాల వల్ల, అంబేద్కర్ వాదం వల్ల మాత్రమే ఈ దేశంలో సాధ్యమాయ్యాయి. 2000 ఏళ్లు మనుధర్మ శాస్త్ర భావనియంత్రణలో ఉన్న భారతదేశంలో ఇంతకంటే ఎక్కువ ఏం కావాలి? ఇంతకంటే ఎక్కువ కూడా సాధించాలంటే... అది కేవలం అంబేద్కర్ వాదం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. మరే ఇతర మార్గం, మరే ఇతర వాదం, అంబేద్కర్ వాదానికి సాటి అయినది, దృష్టాంతంగా చెప్పుకోవడానికి లేదు. అంబేద్కర్ వాదం అద్వితీయమైనదని చెప్పక తప్పదు ఆయన వాదం ఎంత సంఘర్షణలతో కూడుకున్నతో అంత ఆకర్షణీయమైనది.

అంబేద్కర్‌కు ఎప్పుడు ఏ పదవి పైన వ్యామోహం లేదు. సంపద అన్నా లాభం లేదు. దేశంలోని ఉన్నతోన్నతమైన పదవులు ఆయనకి ఇవ్వబడ్డాయి. హైకోర్టు న్యాయమూర్తి పదవి ఆయనకి రాబోయింది. రాష్ట్రపతిగా కూడా ఆయన పేరు చర్చకి వచ్చింది. కానీ ఆయన ఎప్పుడు ఏ పదవుల కోసం ఆకంక్షించలేదు. అయినా కూడా భారతదేశ అత్యుత్తమ గౌరవ శిఖరాన్ని చేరాడు. ఆయన కూడా ఈ దేశ ప్రజానికానికి కావలసినదాని కంటే ఎక్కువే చేశాడు. కాని నేడు ఏ చిన్న పదవి ఇస్తామన్న ఆ నాయకుని వంత పాడటం, అసలైన ఆశయం మరిచిపోవటం, వ్యక్తి పూజ తప్ప, వ్యవస్థ నిర్మాణం లేకపోవడం, ఒకింత చిన్న పదవి వచ్చినా... వచ్చిన వెంబడి ఆయా సామాజిక కులాలను మర్చిపోవడం ఒకింత భాదాకరమే. అంబేద్కర్ చిన్న రాష్ట్రాల స్ఫూర్తికి అనుకూలమని, అంబేద్కర్ చిన్న రాష్ట్రాలను కోరుకున్నాడని... అంబేద్కర్‌ను తెలంగాణ ఉద్యమ సమయంలో విపరీతంగా వాడుకున్న తెలంగాణ వాదులు... నేడు అదే అంబేద్కర్ ఆశయాలను మంటగలిపే విధంగా అంటే రాజ్యాంగం ప్రకారం కాకుండా ఆగమశాస్త్రం ప్రకారం పాలన సాగించడం, మహిళలకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వకపోవడం, పోలీసు వ్యవస్థను ప్రోత్సహిస్తూ ఎన్‌కౌంటర్లు చేయించడం ఇంకా చెప్పుకుంటూపోతే ఎన్నో ఇలా అప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తున్న

ని, ఆయన జీవన గమనాన్ని కూడా అసహజంగా, అనామకంగా, అందవిహీనంగా చూపించి, ఈ దేశాన్ని మరింత వెనక్కి నెట్టారు ఆధునిక భారత నిర్మాణమే మన ప్రజాస్వామ్య లక్షణం, లక్ష్యం కూడా. నిజంగా ఆ దిశగానే మనం ఉన్నామా? ఆ దిశగానే మనం ప్రయాణిస్తున్నామా? ఆ దిశగానే ఆలోచిస్తున్నామా? ఆ దిశగానే మన దృక్పథాలు ఉన్నాయా అనేది ఒక్కసారి పునర్విమర్శించుకోవాలి. మనం ఎలాంటి సమాజాన్ని నిర్మిస్తున్నామో నిర్మించబోతున్నామో మనకు అవగతమవుతుంది. ఇదే క్రమంలో నేడు భారతదేశంలో సంస్కృతి పేరుతో జరుగుతున్న వికృత చేష్టలను గమనిస్తే అంబేద్కర్ ఆశించిన ప్రజాస్వామ్యానికి, మానవత్వ భారత్‌కి మరింత దూరంగా జరుగుతున్నామని అర్థమవుతుంది. స్త్రీలు వంటగదికే పరిమితమవ్వాలనడం ఒకప్పటి నియమం. అది మన సంస్కృతి అంటా ఇలాంటి నిర్జీవ సంస్కృతి ఇంకా స్త్రీలపై ఎన్నో రకాలుగా వివక్షను కొనసాగిస్తూనే ఉంది. సంస్కృతి అనే పేరుతో కొందరు కాదు కాదు ఎందరో అప్రజాస్వామిక వాదులు చేస్తున్న వికృత క్రీడలు మనం ఇంకా చూస్తున్నాం. సంస్కృతి ప్రజాస్వామ్యబద్ధ సంఘ నిర్మాణానికి అతీతమైనదా? అది ముమ్మాటికి కానే కాదు. సంస్కృతి సాంఘిక వ్యవస్థకు అతీతం కాదు. అది ప్రజాస్వామ్య నిర్మాణాన్ని సుశోభింపచేయాలి. అంబేద్కర్ ఆశించిన నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ వేదం కాల వ్యవస్థకు భిన్నమైనదని గుర్తించాలి. అంబేద్కర్ వాదం పురాణాల కాలానికి విరుద్ధమైనది. అదే విధంగా మను, నారద, పరాశరాది ధర్మశాస్త్రాలలో నిర్దేశించిన దానికి వ్యతిరేకమైనది. పూజలకు అంబేద్కర్ మాలధారణకు వ్యతిరేకమైనది. సంస్కృతిక కృత్రిమ విభేదాలకు అతీమై సమానత్వం, సమానావకాశాలు ప్రాతిపదికలుగా రాజ్యాంగబద్ధంగా ఉండేదే అంబేద్కర్ ఆశించిన భారతం. కుల పునాదులపై నిర్మితమైన బ్రాహ్మణ వాద మతాన్ని, ఆధారాలు, నిరసించిన అంబేద్కర్ , ఇతర మతాలలో కనడే నైతిక, మానవీయ విలువలను అభిమానించారు. అంబేద్కర్ ఏర్పరిచిన ప్రకాశంతమైన ఉద్యమ అస్తిత్వాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. ఇవాళ మన జాతికి ఎంతో ఆలస్యంగా అయినప్పటికీ భారతదేశ ప్రత్యామ్నాయ చరిత్రను గుర్తించి సానుకూల దృక్పథం అందుబాటులోకి వచ్చింది. కాని అంబేద్కర్ లాంటి మహనీయులను మాత్రం ఇప్పటి ప్రజాస్రవంతి జాతీయ జీవనానికి దూరంగా ఉండడం నిజంగా విచారకరం. దీనిని అదిగమించేటట్టు ప్రతి పౌరుడు కృషి చేస్తే అదే ఆయనికిచ్చే నిజమైన నివాళి, దేశానికి అవసరమైన అత్యవసర సిద్ధాంతం, విద్యావ్యాప్తికి ఆయన బోధించు అనే నినాదంతో చేసిన కృషి, సవాళ్లను ఎదిరించి నిలిచిన ఆయన సాహసాన్ని, వేలాది మంది స్త్రీలను, శూద్రులను, అతి శూద్రులను బానిసత్వం నుంచి విముక్తి చేసిన ఆయన ఉద్యమంలోని సుగుణాలను చిరకాలం నిలిచి ఉండేవిధంగా మనం కృషి చేయాలి.

బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశపు రాజకీయ జీవనంలోనూ, సాంఘిక జీవనంలోనూ తన ప్రతాపంతో దేదిప్యమానంగా వెలిగే జ్ఞాన సంపన్నుడు. ఆయన జ్ఞానం హద్దుల్లేనిది. ఆయనో గొప్ప రాజకీయవేత్త కూడా. మోజెస్‌లోని కార్యదీక్షత, అబ్రహంలింకన్‌లోని సామర్థ్యం, వాషింగ్టన్‌లోని యోగ్యత ఆయన సొంతం.

స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వం కలగలసిన బాబా సాహెబ్ కలగన్న ఆదర్శవంతమైన ఆధునిక సమాజ నిర్మాణం అనేది కేవలం కొందరి వ్యక్తులు అధ్యయనం చేయటం వల్ల, బోధించడం వల్ల, సిద్ధాంత నిబద్ధతను సంతరించుకోవడం వల్ల సాధ్యం కాదు. అది సమాజ హితాన్ని కోరే ప్రతి వ్యక్తి వారు ఆచరించే హేతుబద్ధమైన, శాస్త్రీయమైన జీవన విధానం వల్ల, వారు అవలంభించే రోజువారి పద్ధతుల వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. అది రాబోయే తరాలకు ఆదర్శంతమైన జీవన విధానమార్గ సూచికలా పనిచేస్తుంది. బాబాసాహెబ్ భా

రతమంటే శాస్త్రియతా దృక్పథంతో సానుకూల ఆలోచనలతో, ఆధునిక మనస్తత్వంతో, హేతుబద్ధ సిద్ధాంతంతో ఒక గొప్ప జీవన విధానాన్ని అవలంభిస్తూ నవసమాజాన్ని ఆవిష్కరింప చేయడమే సమాజంలో అడగుడుగునా నమ్మకద్రోహం గోచరించినా, తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో కూడా, సత్యమార్గాన్ని వీడకుండా, నైతికత, ఉన్నత వ్యక్తిత్వం ఆధారంగా కలిగిన అంబేద్కరిజాన్ని ఈ సమాజంలో వికసింపచేయాల్సిన అవసరం, బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. మనం ఈ రోజు కలలు గంటున్న ఆదర్శంతమైన, అవినీతిరహిత, విలువలతో శోభిల్లే నవ భారత నిర్మాణానికి అంబేద్కర్ రచనలను విస్తృతంగా ఈ సమాజంలోకి చొప్పించాలి. అవి భవిష్యత్తులో జరిగే వివక్షను ఒక హెచ్చరికలా ఉంటాయి.

ప్రభుత్వ ఉద్యోగులు, విద్యావంతులు, వెనుకబడిన తరగతులలో ఎంతో కొంత ఎదిగి కేవలం తమ స్వార్థ ప్రయోజనాలకే పనిచేస్తున్న వారు ఇప్పటికైనా బాబాసాహెబ్ ఆలోచనలను, ఆవేదనను, ఆశయాలను అర్థం చేసుకుని మళ్లీ ఈ సమాజానికి తిరిగి ఇవ్వండి (పే బ్యాక్ టు సొసైటీ) అదే నినాదంతో, కులవివక్షను పారదోలి, ఆత్మగౌరవం, సామాజిక న్యాయాన్ని స్థాపించాలి. అదే బాబాసాహెబ్ భారతం.

అహింసా పాఠాలు నేర్పిన నేల... రాయలసీమ

కె. నాగేశ్వరాచారి, టీచర్
మానవ హక్కుల ఉద్యమకారుడు

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఇక్కడ క్రీస్తుపూర్వం నుంచే జైనమతం ప్రబలంగా ఉంది. అనునిత్యం సాగుతున్న మారణహోమంలో హాహా కారాల్లో ఈ ఘోషలు వినిపించడం లేదు. వీరి ప్రభావం ఇక్కడ ఏమాత్రం లేకపోవడానికి మేధావులు కారణాలు అన్వేషించాలి. జైనమతం ముఖ్యంగా సత్యం, అహింస, అస్తేయం, అవరి గ్రహం వంటి సూత్రాల్ని చెబుతుంది ఈ విలువలేవి?

ఇది కక్షల కార్పణ్యాలతో రగులుతున్న రాయలసీమ. గ్రామీణ జీవితం బాంబుల మోతతో, పట్టణాలు గుట్టు చప్పుడు కాకుండానే మానవ జీవితాన్ని కాలరాస్తున్నాయి. పరస్పర హననోద్యోగం ఎటువంటి అవాంతరాలు లేకుండా సాగుతూనే ఉంది. చిగిర్చే జీవితం కరువులో మాడిపోతూ ఉంది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఇక్కడ క్రీస్తుపూర్వం నుంచి జైనమతం ప్రబలంగా ఉంది. వేమన, బ్రహ్మంగారు మంత్రాలయం రాఘవేంద్రస్వామి తదితర వారి ఘోషలు వినిపిస్తున్నాయి. సంహరణోద్యోగపు హాహాకారాల్లో ఈ ఘోషలు వినిపించడం లేదు. వీరి ప్రభావం ఇక్కడ ఏమాత్రం లేకపోవడానికి మేధావులు కారణాలు అన్వేషించాలి. జైనమతం ముఖ్యంగా సత్యం, అహింస, అస్తేయం, అవరిగ్రహం వంటి సూత్రాల్ని చెబుతుంది. ఈ విలువలేవీ? జైనం అనంతపురం జిల్లాలో ప్రబలంగా ఉందనడానికి అనేక సాక్ష్యాలు నేటికీ సజీవంగా ఉన్నాయి. చారిత్రక అవశేషాలైన గుడులు, ఆధారాలైన శిలాశాసనాలు చాలా ఉన్నాయి. జిల్లా తూర్పు ప్రాంతాలకంటే పశ్చిమ ప్రాంతాల్లోనే జైన దేవాలయాలు శిలా శాసనాలు లభిస్తున్నాయి. మానవ నాగరికత పాతరాతి యుగంనుంచి ఈ ప్రాంతంలో పరఢవిల్లినట్లు అనేక అవశేషాల ద్వారా తెలుస్తోంది. కేవలం ఆలయాలకే జైనులు పరిమితం కాలేదు. విద్యాలయాల ద్వారా జైన సూత్రాల్ని ప్రచారం చేశారు.

విద్యాలయాలు: తాడిపత్రి, కొనకొండ్ల, పెనుకొండ, తొగరకుంట, అమరాపురం, రాయదుర్గం. మత ప్రచారం కోసం సుశిక్షితుల్ని ఈ విద్యాలయాలు తయారు చేసేవి. కేవలం నేటి లాగా పుస్తకాలు కరపత్రాలు వేసుకుంటే సరిపోయేది కాదు. పండిత పరిషత్తుల్లో వాగ్వాదంలో పండితుల్ని గెలవాలి. అందుకోసం పండితప్రకాండులే యోగ్యులు. ఈ విద్యాలయాల్లో ప్రకాండులకు శిక్షణ ఇచ్చేవారు. జైనమత చరిత్రలో పెనుకొండకు సముచిత స్థానం లభించింది. దికకంచి కొల్హాపూర్, ఢిల్లీ తరువాత పెనుకొండ దేశంలో ప్రధాన విద్యాలయాలని ఇక్కడ దొరికిన శాసనాల వల్ల తెలుస్తుంది. పెనుకొండలోని జైన సమాధి వద్ద లభించిన శాసనంలో ఇక్కడి విద్యాలయంలో జైన భూషణ భట్టాచార్యులు ప్రధానాచార్యులు. వీరిని సమయాచార్యులు అని పిలిచేవారు. పెనుకొండలో జైనులకు బ్రాహ్మణులకు మత ఘర్షణలు జరిగినట్లు శ్రావణ బెళగోళలో లభించిన శాసనాన్ని బట్టి తెలుస్తోంది. ఇక్కడ జైనమతాన్ని వ్యాప్తింపచేయడానికి విద్యాలయం ఏర్పాటైంది. మత ఘర్షణలు బుక్కరాయలు నివారించినట్లుపై శాసనంలో ఉంది. ప్రాంతీయస్థాయిలో పేరున్న మరో జైన విద్యాలయం రాయదుర్గంలో ఉండేది. ఈ విద్యాలయంలో జైనమత సంబంధ బోధనలు జరిగేవి కావు. కేవలం శిల్ప శాస్త్ర బోధనలే జరిగేవి. దీన్ని బట్టి ఆనాడు పత్రికలకు బదులుగా శిల్పాలను ప్రచార సాధనాలుగా వాడుకొనేవారని ఊహించవచ్చు. రససిద్ధుల గుట్టపై చెక్కిన శిల్పాలు తరగతి గదికి చక్కని ఉదాహరణలు, వ్యాసపీఠం ముందు పెట్టుకుని ఉన్న గురువులు, చేతులు కట్టుకుని పాఠం వింటున్న శిష్యులుఈ శిల్పాలపై దర్శనమిస్తారు. ఈ విద్యాలయంలో ప్రధాన శిల్పాచార్యులు చంద్రోభూపతి, బాదయ్య, తమ్మన్న, చంద్రేంద్రుడు ఉండేవారు. తాడిపత్రిలో క్రీస్తుశకం 1198 నాటి శాసనం దొరికింది. చోళ ఉదయాదిత్యుడు జైనమతాన్ని ఆదరించి మేఘచంద్రుడును జైనమతాన్ని ప్రోత్సహించినట్లు ఆశాసనాన్ని బట్టి తెలుస్తోంది.

పశ్చిమ చాళుక్య రాజైన రెండో తైలపుడు అమరాపురంలో జైన విద్యాలయాన్ని ప్రోత్సహించారు. ఇందులో చారుకీర్తి భట్టారక, చంద్రవంకభట్టారక, అను ఇద్దరు ఆచార్యులున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక నుంచి చాలా మంది జైనులు ఈ విద్యాలయాన్ని సందర్శించారు. 1226 క్రీస్తుశకంలో ఇరుంగొల భార్య ఆలుపదేవి జైనమతాన్ని బాగా ప్రోత్సహించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. చాళుక్య

తైలపదేవుడు తొగరకుంట దగ్గర ఒక విద్యాలయాన్ని నెలకొల్పారు. అక్కడి ప్రజల వ్యవహారంలో ఉన్న భగవంతుల గుట్ట వద్ద ఉన్న శాసనం వల్ల ఈ సమాచారం లభించింది. పద్మనంది సిద్ధాంత దేవుడు ఈ విద్యాలయాధిపతి. ఈ విద్యాలయ నిర్వహణకు కొంత భూమిని దానం చేశారు. శ్రావణబెళగోలలో దొరికిన శాసనాల వల్ల కొనకొండ్ల మరొక జైన విద్యా కేంద్రమని తెలుస్తూ ఉంది. జైనమతాచార్యులచే చెక్కిన జంబూద్వీపం పత్రికల్లో ఇటీవల గొప్పగా ప్రచారమైంది. దేశంలోని చాలా మంది జైన మేధావులు ఈ జంబూద్వీప పటాన్ని విశ్లేషించుకుంటున్నారు. ఈ కేంద్రంలో ప్రధానాచార్యులు కుందకుండాచార్యులు. ఈయన పేరుతోనే ఈ గ్రామం పేరు వచ్చింది. ప్రభుత్వ సారం, ప్రవచనసారం అనే రెండు గ్రంథాల్ని కుందకుండాచార్యులు రచించారు.

ఇక్కడ ప్రత్యేకించి చెప్పుకోవలిసంది జంబూద్వీపం గురించి చాలా ఉంది. జర్మనీ న్యూనోరబోన్ విశ్వవిద్యాలయంలో పనిచేసే ఆచార్య కలెట్టి కెలెట్ తన జైన్ కాస్మోలజీ అన్న పుస్తకంలో వివరించారు. దీన్ని గురించిన విశ్లేషణ అంతర్జాతీయ స్థాయిలో కొనసాగుతూ ఉండటం గమనార్హం. బొంబాయిలోని జైన కేంద్రంగా రూపొందించాలని ఉత్సాహంలో ఉంది.

<u>బోధానంశాలు :</u> జిల్లాలో దొరికిన అన్ని శాసనాల ఆధారంగా విశ్లేషించి చూస్తే జైనులు, ప్రాకృత భాషను ఆదరించినట్లు తెలుస్తూ ఉంది. విద్యాలయాల్లో సాహిత్యం, వ్యాకరణం, జ్యోతిషం, గణితం, వేదాంతం తదితరవాటిని బోధించేవారు. ఇంచుమించు ఇవన్నీ నేటి ఆశ్రమ పాఠశాలల వంటివి. జైన తాత్విక దృక్పథానికి పై శాస్త్రాలు ఏవిధంగా అనుషంగికమైనోమరి. పాఠశాలలు నిర్వహించే స్థాయి జైన మతం ఎదిగిందంటే సమాజంలో దానికి గొప్ప ఆదరణ లభించివుంటుంది.

జిల్లాలో క్రీస్తుశకం ఒకటో శతాబ్ది నుంచి 14 శతాబ్దం వరకు పాలించిన చాళుక్యులు, రాష్ట్ర కూటములు, నోలంబులు, విజయనగర రాజులు జైనమతాన్ని ఆదరించారు. ఆలయ నిర్మాణం జరిగింది. కంబదూరులో మూడు జైన ఆలయాలున్నాయి. తాడిపత్రిలో రెండు పెనుకొండలో రెండు, అమరాపురంలోనూ ఉన్నాయి. శిథిలాలు కొనకొండ్ల పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి. 3వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు మహోజ్వలంగా వెలిగిన జైనమతం వీరశైవం విజృంభనతో మటుమాయమైంది. బిజ్జలమహరాజా బసవేశ్వరుని మత దురంహాకారానికి బలైపోయాడు. జైన దేవాలయాలు శైవ వైష్ణవ దేవాలయాలుగా రూపొందాయి. వ్యాప్తిని కోరుకునే ప్రతి మతానికి చరిత్రలో ఇటు వంటి పరిణామమే ఎదురైంది. తరువాత కాలంలో శైవ ప్రాధాన్యం కూడా తగ్గిపోయింది.

గమనించాల్సిన విషయమేమిటంటే ఎంతో చరిత్ర కలిగిన ప్రాంతం గతాన్ని నెమరువేసుకుంటూ అంతకంటే ఉన్నత విలువలు రూపొందించుకోకుండా ఎందుకిలా సమాజం పతనమైపోతూ ఉంది? ఇంత మంచి పెన్న ఎందుకెండిపోయెనో?

లేపాక్షి కళలు చూసేందుకు రెండు కళ్లూ చాలవు

రాయలసీమ జాగృతి న్యూస్, అనంతపురం

లేపాక్షి కళలు చూసేందుకు రెండు కళ్లూ చాలవని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. లేపాక్షి ఉత్సవాల రెండో రోజులో స్థానిక బీసీ బాలుర గురుకుల పాఠశాలలో రెండో వేదికపై నిర్వహించి సంప్రదాయ నృత్య సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే తిలకించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏపీడీ కేఎస్ రామారావు, డీఈఓ జనార్ధనాచార్యులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు జిల్లాలోని నలు మూలల నుంచి పలు కళా బృందాలు లేపాక్షికి తరలివచ్చారు. కూచిపూడి, భరతనాట్యం, సంగీతం, నాటకప్రదర్శన, కోలాటం, చక్కభవ జన, బంజారా నృత్యం, ఏకపాత్రాభినయం తదితర కళారూపాలు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి పర్యాటకులను రంజింపచేశారు. అనంతపురానికి చెందిన రామకృష్ణ రూపకల్పనలో తరంగల కూచిపూడి నిర్వహించారు. పెద్దవడుగూరుకు చెందిన హర్యాన రాష్ట్రానికి చెందిన కేజీబీవీ విద్యార్థులు భగ్రా నృత్యం చేశారు. సిరివరం ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు చెక్కభజన కార్యక్రమం నిర్వహించారు. వినాయక నృత్యం ప్రదర్శించారు. బుద్ధిమాంద్యం కలిగిన విద్యార్థులచే గురవయ్యల నృత్యం ప్రదర్శించారు. భగ్రా నృత్యం చేసిన విద్యార్థులకు స్థానిక పండుగలా లేపాక్షి ఉత్సవాలను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. లేపాక్షికి కొత్త రూపురేఖలు తీసుకురావడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు.

మాదిగ అస్తిత్వ చైతన్యం... ఆది ఆంధ్రుడు పద్య కావ్యం

ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి
అధ్యక్షులు, తెలుగు శాఖ,
బెంగళూరు విశ్వవిద్యాలయం

1. 21వ శతాబ్దపు సాహిత్యావసరం :

సాహిత్యం సమాజోద్భవం. సమాజం సాహిత్య ప్రేరకం. రెండో ఒకదానికొకటి పోషకాలు, బింబ ప్రతిబింబ భావం నిరంతరంగా సాగవల్సిన ప్రక్రియ. ఆధునిక కాలం వరకూ, శాతాబ్దాలుగా సాహిత్యం ఏకపక్షంగానే సాగింది. సమాజంలో ఒక కోణాన్నే పరిచయం చేశారు. 21వ శతాబ్దంలో సాహిత్య పునర్మూల్యాంకనానికి పోయిన చరిత్రల ఆవశ్యకత ప్రాముఖ్యతను సంతరించుకుంది. అందులో భాగమే అస్తిత్వ చైతన్య సాహిత్య అవగాహనం. యుగాలుగా విభజించిన సాహిత్యంలో జగానికి తెలియని అంశాలు శిథిలమైనంత పోగా అందుబాటులోకి తీసుకురాగలిగినంత సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావాలనే ప్రయత్నం ఆశాజనకమైన అంశం. ఆశావహ పరిణామం. కాలగర్భంలో కలిసిపోయి, మరుగున పడుతున్న చరిత్రను బుద్ధిపూర్వకంగా పట్టించుకోకపోవడం సామాజిక నేరమని గ్రహించే పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయి. ప్రాంతీయ సాహిత్యం పరిఢవిల్లడం అవసరంగా మారగా, అస్తిత్వ చైతన్య నిరూపణం నేటి సాహిత్యావసరమైంది. ఒక జాతి అస్తిత్వం లేదా ఒక జాతికి సంబంధించిన వ్యక్తి గౌరవం - గుర్తింపు, సాటిలేనిదిగా ఉన్నప్పటికీ కారణాంతరాల వల్ల చరిత్రలో మరుగునపడిపోతే - ఆధిపత్యవర్గ సాహిత్యకర్తలు పట్టించుకోకపోతే వెలికితీయడానికి చేస్తున్న ప్రయత్నం ఈ శతాబ్దం ప్రదర్శించే చైతన్య లక్షణం. దళితులకు, బహుజనులకు సమర్థనీయ స్థానం లేని కాలంలో ఎంతో సాహిత్యం మరుగునపడి ఉంటుందన్నది అర్థమవుతున్న విషయం. ప్రస్తుతం అస్తిత్వ సాహిత్యం అత్యవసరమైన అంశంగా సమాజంలో వేళ్లూనుకుంటోంది. దళిత, బహుజన వర్గాలు తమ, తమ మూలాలను వెతుక్కునే కోణంలో చైతన్యంతో కూడుకున్న సాహిత్యం ఉద్భవిస్తోంది. చైతన్యవంతమైన సాహిత్యం సామాజిక శ్రేయస్సును అభిలషిస్తుంది. మరుగున ఉన్న సాహిత్యం వెలికితీయడం వల్ల సాహిత్యంలో ఏర్పడ్డ ఖాళీలు పూరించే అవకాశం ఉంటుంది. దళిత, బహుజన వర్గాల చైతన్యం కొంత మేరకు ఈ ప్రయత్నం చేస్తోంది. ఈ కోణంలో విరివిగా సాహిత్యం ఉద్భవించవల్సిన అవసరం, సమాజం చైతన్యవంతమవల్సిన అవసరం తప్పనిసరిగా ఉంది. తరతరాలుగా మూసలో సాగుతున్న సాహిత్య అధ్యయన క్రమానికి కొంత విశ్రాంతినిచ్చే అవసరాన్ని ఏర్పరుస్తాయి ఈ ప్రయత్నాలు. చరిత్ర నుంచి తవ్వి వెలికితీయబడుతున్న అస్తిత్వ చైతన్యాలు సాహిత్యాన్ని పరిపుష్టం చేయడమే కాకుండా భవిష్యత్తు ప్రయత్నాలకు దోహదపడతాయి. వర్గ అస్తిత్వ సాహిత్యాల వెలికితీత వల్ల గాటికి కట్టినట్టు సాగుతున్న సాహిత్య అధ్యయనం ఖచ్చితంగా మార్పుకు లోనవుతుంది. అటువంటి పునర్మూల్యాంకన పనిని 'ఆది ఆంధ్రుడు' పద్య కావ్యం చేసింది.

2. రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు - భుజంగరాయుడు

'ఆది ఆంధ్రుడు' దళిత పద్య కావ్యం. దళితుడు రాసిన పద్య కావ్యమా లేక దళితుడు ప్రధాన పాత్రగా సాగిన కావ్యమా అని ప్రశ్నించుకుంటే రెండూ సరైనవే అని అనాలి. దళితుడు రాసి, దళితుణ్ణి ప్రధాన పాత్రగా చేసిన పద్యకావ్యం ఆది ఆంధ్రుడు. జానపద కథలుగా, పుక్కిటి పురాణంగా ఆ నోటా - ఈనోటా సాగిన కథ, చరిత్రగా కొంత మేరకు మాత్రమే ఆధారాలు లభిస్తున్న కథ 'ఆది ఆంధ్రుడు' ఇతివృత్తం. కథానాయకుడు భుజంగరాయుడు. ఈ రచనకు జానపద కథలతో పాటు కొడాలి లక్ష్మీనారాయణ రాసిన 'శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు' గ్రంథం కొంత ఆధారం. మాదిగ భుజంగరాయుడు చింతపల్లి సంస్థానంలో సేనాని! సంస్థానాధీశుడు వెనుకబడిన వర్గ ప్రతినిధి రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు. ఈ ఇద్దరూ స్నేహితులుగా కలిసి సాగించిన స్నేహ గీతం ఆది ఆంధ్రుడు పద్య కావ్యం. సంస్థానాధీశునికి - సేనానికి మధ్య ఉన్న స్నేహ బంధం ఆది ఆంధ్రుడులో ప్రతిఫలిస్తుంది. ఆ స్నేహంలో ప్రతిఫలించిన కష్టనష్టాలు, సుఖదుఃఖాలు తెలిపే పద్యకావ్యం ఆది ఆంధ్రుడు.

సేనానిగా మాదిగ భుజంగరాయుడు, సంస్థానాధీశునిగా రాజావాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు ఇద్దరూ కలిసి సా

గించిన స్నేహం చెప్పుకోదగ్గది. శూద్ర, దళిత కులాల వ్యక్తుల మధ్య స్నేహం ఇప్పుడు ప్రత్యేకమైందిగా అనిపించకపోవచ్చు కానీ, 18వ శతాబ్దం నాటికి ఆ స్నేహం చారిత్రాత్మకమైనది. రాజ్యావసరాలకు మాదిగ భుజంగరాయుడు తోడ్పాటును రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు అంగీకరించడం, అందుకు ఆహ్వానించడం ప్రత్యేకమైన విషయాలు. మరాఠా వీరులతో పాటు తెలుగువాళ్ళు రాజ్యరక్షణలో భాగంగా నాటి సంస్థానంలో ఉన్నారు.

పల్లుట్ల గోత్రీకుడైన రాజావాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు తాత, తండ్రుల నుంచి సంక్రమించిన చింతపల్లి సంస్థానాన్ని కుదురుగా పరిపాలించాడు. ఇద్దరు భార్యలు. రాజ్యం కోసం కుటిల ప్రయత్నాలు చేశాడు. నందిగామ దాకా సంస్థానాన్ని విస్తరించాడు. 1761లో జన్మించి 1816లో మరణించాడు. దోపిడీ దొంగలను పిండారీలను హతమార్చాడు. అయితే మాదిగల పట్ల మాత్రం మమకారం ఉండేది నాయుడికి. దానికి బ్రహ్మనాయుడి చాపకూడు ఆదర్శం. 'సుధర్మ'లో కవులను, కళాకారులను పోషించాడు. చిందు కళాకారుల్ని, తప్పెట వాయించే మాదిగల్ని ప్రోత్సహించాడు. క్రూరుడుగా, కఠినుడుగా పిలిపించుకున్న రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడికి భుజంగరాయుడితో ఆత్మీయత, స్నేహం పెనవేసుకున్నాయి.

రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఆస్థానంలో భుజంగరాయుడు సాధించిన విజయాలు, సంస్థానానికి చేసిన సేవ అమూల్యమైనవి. రాజా కిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆదుకున్న రాయుడు సంస్థానంలో తిరుగులేని స్థానం సంపాదించుకున్నాడు. నాయుడు అమరావతిలో ఉంటూ చింతపల్లి బాధ్యత అప్పజెప్పిన సందర్భంలో సుమారు 108 చెరువులు, 108 గుళ్ళు, అమరావతి కోటా కట్టించాడని ప్రతీతి. రాజు అభిమానానికి పాత్రుడయ్యాడు. కవిగా ప్రసిద్ధుడు. రచనలు లభించకపోయినా కవిగా జానపదుల నోళ్లల్లో కీర్తింపబడ్డాడు. ఆత్మాభిమానం, ఆత్మగౌరవం రాయుడిబలమైన ఆయుధాలు. సాటిలేని పరాక్రమం రాయుడి శక్తి. స్వామిభక్తి, సేవాపరాయణత్వం కలబోసిన అకుంఠిత దీక్షాదక్షుడు. స్వయంగా కవి. సంస్కృత సంప్రదాయాంధ్ర సాహిత్యాలలో పండితుడు. అంటరానితనం రద్దు అనీ, ప్రజలందరూ సమానమన్న భుజంగరాయుని మాట విని నాయుడు శాసనం వేయించాడనే మాట ప్రచారంలో ఉందంటే అది రాయుడి మాటపై నాయుడికి ఉన్న గురి. మానవత్వం పట్ల ఉన్న మమకారం. ఎంత చండ్రప్రచండుడైనా మాదిగల పట్ల చూపిన ఆత్మీయత వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడి గుర్తింపునకు ప్రత్యేకమైన కారణం.

<u>3. భుజంగరాయుడు - వ్యక్తిత్వం :</u>

భుజంగరాయుని తండ్రి నాగన్న, కొడుకును చూసి ముచ్చట పడుతుంటాడు

'కుట్టిన చెప్పుల పైబడి
తట్టిన నిద్రను వరించి తనయుడు వెలుగన్
ముట్టిన ఎండకు పడగను
పట్టిన పాము గని తండ్రి పరవశుడయ్యెన్'

భుజంగరాయుడి పుట్టుక తండ్రికి కలిగించిన ఆనందం అది. పిల్లవాడు పెరుగుతుండగా

'కత్తియ ఘంటమ యేదని
బిత్తర పడి బంధు గణం భీతిల్లంగా
కత్తిన ఘంటము సమముగ
చిత్తము చిగురింప తిప్పి చింతలు దీర్చెన్'

ఒక దళితుని కుమారుడు కత్తిని, ఘంటాన్ని సమంగా తిప్పడం ఎవరికైనా మహాశ్చర్యమే! అలాగే భుజంగరాయుడి విద్యా నైపుణ్యాలు పరిశీలిస్తే

'తప్పెటను కొట్టినా గుండె దద్దరిల్లు
గజ్జెకట్టినా భూమాత కాళ్లనొత్తు
ఘంటమెత్తైనా బ్రహ్మంఘ్రి కడియమిచ్చు
కత్తి తిప్పినా పగతుర నెత్తి పగులు'

మాదిగ తప్పెట రాయుడి కొడితే గుండెలు దద్దరిల్లుతాయి. నాట్యం చేసే భూదేవి కాళ్లు వత్తాలి, ఘంటం తీస్తే బ్రహ్మ కడియం తొడగాలి. కత్తి తిప్పితే శత్రువుల తలలు పగలాలి. ఇదీ భుజంగరాయుని వైనం. కన్నతల్లి కొడుకును ప్రేమగా చూస్తూ ఇలా అడుగుతంది.

'ముత్తాత రాయల చిత్తాన నివసించి
సేనానిగా కొల్వు చేసినాడు
పెదతాత కొండవీడ్ పేరెన్నికనుగన్న
మంత్రీశ్వరుండుగా మసలినాడు
చినతాత కందవోల్ జెండాలు మిన్నంటి
మించు కీర్తులు ప్రతిష్టించినాడు
పినతాత ఘంటమ్ము ననలెత్త కావ్య ప్ర
సూనాల పరిమళాల్ నానినాడు'

అని పూర్వీకుల గొప్పతనాలు చెప్పి, నువ్వేం కావాలనుకుం టున్నాని అడుగుతుంది. అందుకు భుజంగరాయుడి స్థితి ఇలా వర్ణింపబడుతుంది.

'పుడమికి బిడ్డ పుట్టి విను
భూమికి చేతులు చాచినట్లు, కా
రడవికి రెక్కలేచి మిను
రాణికి రంగుల నద్దినట్లు, సేల్
పడతికి చూపు మొల్చి సిగ
పాపిట నింగికి పాకినట్లు, తా
నడిగెడు ప్రేమ కోర్కెలకు
నాతని చిత్తము మిన్ను తాకెడిన్'

ఒక సందర్భంలో పిల్లలు వేదాధ్యయనం చేస్తున్నారని బ్రాహ్మణ యువకులు కోపంతో రాళ్లతో కొడుతుంటే భుజంగరాయుడు అడ్డు తగిలాడు. అప్పుడు యువకులు

'మాదిగ వాడా! నీకా
వాదము మాతో తొలంగి పరుగున పోపో!
కాదని యెదురాడిన నీ
వేదము చదివెడి గళమును బ్రేలుం జుమీ'

అంటూ బెదిరిస్తారు. వారిని ఎదిరించి కట్టిపడేస్తాడు రాయుడు. భుజంగరాయుని సామర్థ్యం తెలుసుకున్న రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు రాయుణ్ణి పిలుచుకుని రమ్మని సైనికులను పంపుతాడు. నాయుడు రాయుడి పరాక్రమం గురించి విని కలవాలనుకుంటాడు. చూడాలనుకుంటాడు. చివరకు ఎంతో ప్రయత్నంతో, ఎంతో ప్రయాసతో నాయుడు రాయుణ్ణి పిలిపించుకోగలుగుతాడు.

'రాజుతో నాకు పని యేమి? రాత యేమి? రానుపొమ్మని' ధిక్కరిస్తాడు రాయుడు. కానీ తండ్రి వారించి తనయుడు నాయుణ్ణి కలిసేందుకు అంగీకరింపచేస్తాడు. నాయుడు భుజంగరాయుణ్ణి సేనానిగా నియమిస్తాడు. తల్లిదండ్రులతో సేనానిగానూ, కవిగానూ ప్రజల దాస్య శృంఖలాలను తెంచాలనుకుంటున్నాను అంటాడు.

'కవనమగుదు సైన్య కదనమ్ము గననౌదు
నంటరాని జాతి నంట జేతు
కత్తి శాంతి కురియు ఘంటమ్ము దయ పంచు
జగము ధరణి కోట నెగసి చూడ' అంటాడు.

రాయుడు స్ఫురద్రూపి. అందగాడు. సంస్థానంలో తన పంచె కట్టుతో అందరినీ ఆకట్టుకున్నాడు.

'అతని పంచె కట్టు నతనికే సొంతమ్ము
ననుకరింప సాధ్యమసలు కాదు'
'రాయుడు పంచెను కట్టిన
మాయదు సాగదు నలగదు మడతలు పడగన్'

ఇలా ప్రసిద్ధి చెందాడు భుజంగరాయుడు. ఇటువంటి రాయుణ్ణి నాయుడు అమితంగా ప్రేమించాడు. ఆత్మీయునిగా భావించాడు. ఇరువురి మధ్య స్నేహం చిగురించింది. ఆ స్నేహం శాశ్వతంగా మిగిలిపోయింది.

'ఒక్క కంచము మంచము నొక్కమాట
యొక్క చేష్ట యాలోచన మొక్కరీతి
కవలలన్నట్టు వారలు కనగనయిరి
రాజు సుతులట్లు వారు సరాగులైరి'

ఇద్దరి మధ్య అనుబంధం పెరగడానికి ఎన్నో కారణాలున్నాయి. అందులో ఇద్దరూ ఒకసారి అడవికి వెళ్లినప్పుడు అక్కడ దొంగలు నాయుణ్ణి బంధించినప్పుడు రాయుడు రక్షిస్తాడు. దొంగలను ఎదుర్కొంటున్న రాయుని రూపమెలా ఉందో ఈ పద్యంలో కనబడుతుంది.

'రాజు హృదయార్తి పోగొట్ట రాయుడంత
నడవి గుడిలోకి శివలింగ మరిగినట్లు
పుడమి బడిలోకి వేదాంతి పెడలినట్లు
కాననరుకు గొడ్డలి వోలె కానబడియె'

ఎంతో కృతజ్ఞతతో నాయుడు రాయుణ్ణి కౌగిలించుకుంటాడు. రాయుడి ఎదుగుదల సంస్థానంలో ఇతరులకు కంటగింపైంది. వివిధ రకాలుగా అడ్డుకోవాలని ప్రయత్నించారు. రాయుడి వ్యతిరేకలకు రెండు ప్రధాన విషయాలపై కన్ను పడింది. ఒకటి చెప్పులతో ఆస్థానంలోకి రావడం. రెండు కాలిగోరు కనబడకుండా పంచె కట్టడం. ఎలాగైనా ఈ రెండు విషయాల్లో రాయుణ్ణి అవమానించాలనుకున్నారు. మంత్రి పాపయారాధ్యుడు ఇందుకు సూత్రధారి. చెప్పుల విషయమై రాజు ఎదురుగా రాయుణ్ణి అడిగేలా చెప్తాడు మంత్రి. అప్పుడు రాయుడు పాపయారాధ్యుల మధ్య సంభాషణ సాగుతుంది.

'కలదు జందెమ్ము మతనిష్ఠ కాపుదలగ'
'కలవు చెప్పులున్ కుల వృత్తి గర్వ మహిమ'
'నిలుపు జందెముల్ పరామర్ధ నియత దీప్తి'
'తెలుపు చెప్పులు శ్రమశక్తి వెలుగు విలువ'

అంటూ చెప్పుల విలువను, గౌరవాన్ని తెలుపుతాడు రాయుడు.

కాలి గోరు కనబడకుండా పంచె కట్టడంతో రాయుడు దిట్ట. ఆ సొగసును చూసి ఓర్వలేక పాపయ మంత్రి చెప్పుకోరని రోగమొచ్చిందని అవామనకరంగా మాటలాడి పంచె విప్పి చూపమనడం, అందుకు రాజు కూడా వత్తిడి చేయడం, నిండు సభలో రాయుడు చూపడం, ఏ రోగమూ లేదని నిర్ధారణకు రావడం, జరిగిన దానికి క్షమించమని అడగడం జరుగుతుంది.

పాపయ మంత్రి రాయుడి కావ్య రచనాశక్తిని కించపరుస్తాడు. చేతనైతే కావ్యం రాసి సభలో చదివి వినిపించమంటాడు. 'కాల ప్రయాణం' రచనను నిండు సభలో చదివి వినిపించగానే నిశ్శబ్దం తాండవమాడుతుంది. వెంటనే రాజు

'అచట నిశ్శబ్దమునకు నిప్పంటబెట్టి
కాంతి ముఖుడైన వికాస వాక్కు
వినిచె 'కాల ప్రయాణమ్ము' విశ్వ వీథి
రాయ! తాండవ నృత్యమ్ము చేసె కవిత'

అంటూ ప్రశంసించాడు.

రాయుడు కోరిక మేరకు నాయుడు మాదిగలకు గుడి ప్రవేశానికి శాసనం వేయిస్తాడు.

రాయుడు రాజును వేడుకున్నాడు.

'అది యొక కోర్కె యున్నది మ
హాశయా! మాదిగ శక్తి యుక్తులో
నిది యగు కార్య రంగ పరి
ణీతపు చేతలు గుళ్లు గోపురాలు
కదలు కొలంకులున్ మదిని
క్రమ్మును పాయవు, నానిలోనికిన్
సదయులు మీరు పంచముల
చాలన మిచ్చిన న్యాయముండెడిన్'

అని అడగగానే నాయుడు ఎంతో సంతోషంతో రాయుడి మాటకు అంగీకారాన్ని తెలిపి కోటను కట్టి, గూళ్లు కట్టి, ఆ

గుళ్లలోకి ప్రవేశం మాదిగలకు లేకపోవడం సరికాదని శాసనం వేయించడం చారిత్రాత్మకమైన విషయం.

వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడి పరిపాలనలో వెన్నెముకగా నిలబడి, 93 ఏళ్ల పాటు నిండైన జీవితం గడిపి, ఒక కవిగా, సేనానిగా, ఆర్తత్రాణపరాయణుడిగా, మాదిగలకు చరిత్రలో ప్రత్యేక స్థానం కల్పించిన వ్యక్తిగా, స్నేహశీలిగా ఉన్న వ్యక్తి జానపదుల నోళ్లలో మాత్రమే మిగిలి చిరాయువుగా ఉన్న వైనం భుజంగరాయని చరిత్ర. భవిష్యత్తరాలకు తెలియవలసిన చరిత్ర.

4. కవి దృష్టి :

పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ పద్య కావ్యం 'ఆది ఆంధ్రుడు'. సమకాలీన కవులకు దిక్సూచి - దళిత, బహుజనులకు మార్గదర్శి. ఈ శతాబ్ది కవి, రచయిత, నాటక కర్త, నవలాకారుడు ఆచార్య కొలకలూరి. మాదిగ అస్తిత్వ చైతన్యం ప్రతిఫలించే పద్య కావ్యం 'ఆది ఆంధ్రుడు'. కవి తాను బాల్యంలో విన్న జానపద కథలు, తల్లి దగ్గర విన్న భుజంగరాయని శౌర్యం చిన్నతనంలోనే బలమైన ముద్రను వేశాయి. రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు ఆస్థానంలో భుజంగరాయుడు ఉన్నాడని, ఆ సంస్థానానికి సేనానిగా పనిచేశాడని కొన్ని రచనల ద్వారా, కొంత చారిత్రక ఆధారాల ద్వారా సేకరించి, 'ఆది ఆంధ్రుడు'గా పద్య కావ్య రూపమిచ్చారు.

ఇక్కడ కవి దృష్టి ప్రధానం. ఈ రచన ఉద్దేశ్యం చదివితే అర్థమవుతుంది. అవగాహన పెరుగుతుంది. ఇతివృత్తం ఎన్నిక ఈ విషయాన్ని చెప్పక చెబుతుంది. ఒక మాదిగ వ్యక్తి భుజంరాయుడు పేరుతో 17, 18 శతాబ్దాలలో తన జాతి కోసం చేసిన పోరాటం అద్వితీయమైనది. ఒక శూద్ర రాజుతో తిరుగులేని స్నేహం చేసి ఆ స్నేహ బంధాన్ని నిలుపుకోవడం కవి దృష్టిని దాటిపోలేదు. అలాగే కవిని బలంగా పట్టిన అంశాలలో భుజంరాయుడు స్వయంగా కవి కావడం. మాదిగ వ్యక్తికి సంస్కృతాంధ్రాలలో అభినివేశముండడం, అది ఒక రాజును ఆకర్షించడం ఒక ప్రత్యేకత. అది స్నేహంగా పరిణమించడం విశేషం. ఆ స్నేహ బాంధవ్యంతో మాదిగల అభివృద్ధిని ఆకాంక్షించడం ప్రధాన ఆకర్షణ.

భుజంగరాయుడి ఔన్నత్యాన్ని చెబుతూ కవి రెండు ప్రధానాంశాలను చర్చలోకి తెచ్చారు. ఒకటి - మాదిగల దేవాలయ ప్రవేశం. రెండు - అమరావతి స్తూపానికి పూర్ణ కుంభం ప్రదానం చేసిన చర్మకారుని గురించి అంశం.

1. మాదిగల దేవాలయ ప్రవేశ ప్రయత్నం 18వ శతాబ్దం ఉత్తరార్థంలో ఒక దళితుడు ఆలోచించడం, అందుకు ప్రయత్నించడం. కృతకృత్యుడు కావడం ఎంతో ఉత్తేజపరిచే అంశం.

2.1 'అమరావతీ స్తూపమునకు చర్మకారుడొనర్చిన దానము' వ్యాసం (డాక్టర్ జ్ఞానానందకవి - షెడ్యూలు కులాలు అంటరానివా), 'మాదిగల చరిత్ర - సంస్కృతి' (డా. సి.శ్రీనివాసరావు) ఆధారంగా, పూర్ణకుంభ స్తూపం చర్మకారుడి దానంగా స్థిరీకరించారు. 'జైన బౌద్ధ మతాలను రూపుమాపి, వైదిక మత ప్రాభవం నిలపడం కోసం క్రీ.శ. 10వ శతాబ్దిలో అమరేశ్వరాలయం నిర్మింపబడి ఉండవచ్చని చరిత్రకారుల ఊహ' (ఆది ఆంధ్రుడు, పుట: 43)గా తెలిపి, ఈ చరిత్ర 'ఆది ఆంధ్రుడు' పేరుతో తవ్వడానికి గల కారణాన్ని కవి ఇలా తెలుపుతారు.

'ఈ అమరేశ్వరాలయం దగ్గర రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు కోట నిర్మానం చేయించాడు. నగరం ఏర్పడింది. అప్పటి నుంచి ప్రజావాసం అమరావతిగా పిల వబడింది. అమరావతి పేరు అమరేశ్వరాలయం ఉండడంతో పాటు, తాను దేవేంద్రుడని, తన రాజ్యం అమరావతి అని, తన కొలువు 'సుధర్మ' అని నాయుడు భావించటం వల్ల కూడా స్థిరపడింది. నాయుడి కాలంలో స్తూపం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది... మెకంజీ, ఫెర్గుసన్ వంటి ప్రసిద్ధులైన చారిత్రక దృష్టి గలవాల్లు ఈ స్తూపాన్ని అమరావతీ స్తూపమన్నారు' (ఆది ఆంధ్రుడు, పుట : 43) అంటూ అమరావతి చరిత్రను మరొక్క సారి పరిశీలనకు పెట్టారు. అలాగే కవి మరో మాట అంటారు.

'ప్రపంచం సరిగ్గా మేలుకోని రోజుల్లో మేల్కొన్న నేల తెలుగు గడ్డ - అప్పుడంతా ద్రావిడులే. తరువాతి ద్రావిడ దేశంలోని దేవాలయ శిల్పాలకు మూలరూపాలు అమరావతీ స్థూపం నుంచి, అమరావతీ రీతి నుంచి భిన్న శాఖా భేదాలతో అవతరించాయని చెబుతున్నారు' అని.

'అలాగే చర్మకారులు, పశువుల కాపరులు (వృత్తి పేర్లే, కులం పేర్లు కావు) అమరావతి స్థూపానికి శిల్పశిలా దానం చేయగలిగారంటే వాళ్ల సంపదను గురించి గౌరవం కలుగుతుంది. దానం చేయనిచ్చారంటే నాటి సమాజ జీవన సౌభాగ్యం అర్థమవుతుంది. నాటి ఆంధ్రులు నేడు అనాధాంధ్రులయ్యారు. ఈ దౌర్భాగ్యానికి చరిత్ర సాక్ష్యం పలుకుతుంది. ఈ నేల మీద ఆదిమవాసులు దారిద్ర్యంతో పతనం కావటం చరిత్ర చేసిన పరాభవం. ఈ పరాభవం ఇల్లగ్గ ఎల్లకాలం ఉండకూడదు.' (ఆది ఆంధ్రుడు, పుట : 46) అని ఆశపడతాడు.

కవి ఆకాంక్ష స్పష్టంగా అర్థమవుతుంది. ఆవేదన అక్షరాలుగా మిగిలిపోకూడదు. దళిత చైతన్యం విస్తృతమవ్వాలి. చరిత్రలో మరుగున పడిపోయిన దళిత, బహుజనుల అక్షర చైతన్యం వెలికి రావాలి. ఆ దిశగా సాహిత్య పునర్మూల్యాంకనం సాగాలి. చైతన్యవంతం కావాలి. సాహిత్యంపై కొత్త కాంతులను వెదజల్లే 'ఆది ఆంధ్రుడు' వంటి రచనలు రావాలి. సాహిత్యం సుభిక్షం కావాలి.

మహిళా హక్కులకై అహరహం శ్రమించిన మహోన్నతుడు అంబేద్కర్

ఎస్.ఎం. బాషా
మానవ హక్కుల వేదిక

"ఏ సమాజపు పురోగతినైనా అంచనా వేయడానికి ఆ సమజంలోని మహిళల స్థితిగతులను పరిశీలిస్తే చాలు"

"నాకు మహిళల శక్తిసామర్థ్యాల మీద సంపూర్ణ విశ్వాసముంది. వారు తలుచుకుంటే సమాజం ఎదుర్కొంటు న్న సమస్యలను సులభంగా పరిష్కరించగలరు. నేను స్వానుభవంగా తెలుసుకున్నదేమంటే, సమాజంలోని అణగారిన వర్గాల వారితో కలిసి పనిచేస్తున్నప్పుడు సాంఘిక దురాచారాల్ని రూపుమాపడానికి వారందించిన తోడ్పాటు అద్వితీయం" అందుకే పురుషులతో సమానంగా మహిళలు కూడా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడానికి కోరుతుండేవాడిని". ఇవి మహిళలపట్ల బాబాసాహెబ్ అంబేద్కర్‌కున్న శ్రద్ధ. అవగాహనను తెలియజేస్తాయి.

మన సంస్కృతి విలువల ఆధారంగా ఏర్పడిన హిందూ సమాజంలో మహిళలకు ఆస్తిహక్కులేవు. స్వతంత్ర నిర్ణయాలు లేవు. భర్త వంశాన్ని ముందుకు తీసుకుపోవడానికి పిల్లల్ని కనే యంత్రంగానే పరిగణించారు' ఆధునిక యుగంలో కూడా ప్రపంచం నలుమూలల నుంచి మహిళలు, పితృస్వామిక ఆధిపత్యాన్ని ఎదుర్కొంటూనే ఉన్నారు. దేశం, మతం ఏదైనా పరిస్థితి మాత్రం ఒకటే అందుకే కేవలం విజ్ఞాపనల ద్వారా హక్కులు సమకూరవు. వాటిని పోరాడి సాధించుకోవాల్సి ఉంటుందని అంబేద్కర్ మనకు ఉద్బోధించారు. ఒక తరంను మరొక తరం ఏర్పడటానికి ప్రకృతిపరంగా మహిళలు విద్యార్థించే చారిత్రక కర్తవ్యాన్ని అంబేద్కర్ గొప్పగా గౌరవించారు. అందుకు ఒకమాటంటారు. "మహిళలు గర్భస్థ కాలంలోనూ, ప్రసవ సమయం పడే బాధలు, వేదనలు పురుషుల అనుభవంలోనికి గనుకవస్తే, జీవితంలో మరోసారి పిల్లల్ని కనాలని అనుకోరు" అంటూ వారి వేదనలో భాగం పంచుకున్నాడు.

మహిళలు - కులం

అమానవీయ కులం, సామాజిక కట్టుబాట్ల కారణం

గా ఎక్కువగా బాధలకు గురవుతున్నది మహిళలే. ఒకతరం నుంచి మరో తరానికి సామాజిక అణచివేత ఆచార వ్యవహారాలు, కులం, మతం, కట్టుబాట్లను క్రీస్తు శిలువను మోసినట్లు మోస్తున్నది మహిళలే. ఉగ్గుపాలనుంచే ఆడపిల్లలకు ఆంక్షలను నూరిపోయడం జరుగుతున్నది. కులం పేరుతోనూ, కుటుంబ గౌరవం, వంశగౌరవం పేర్లతో వారిపై రుద్దబడిన అశాస్త్రీయ భావనలు మహిళలు మరణించేవరకు కొనసాగించే విధంగా సమాజం జాగ్రత్త వహిస్తోంది. అంబేద్కర్ మహిళల రక్షణకు సంబంధించిన ఎన్నో చట్టాలను రూపొందించారు.

1. మహిళా కార్మిక సంక్షేమనిధి

2. మహిళా కార్మిక రక్షణ చట్టం

3. మహిళా కార్మికుల ప్రసూతి బిల్లు

4. తాత్కాలిక ఉద్యోగులకు (మహిళలు) వేతనంతో కూడిన సెలవులు.

5. ఉద్యోగులకు వేతన సవరణలు.

6. లోతైన గనుల్లో మహిళలు పనిచేయకుండా నిరోధించడం.

7. చట్టబద్ధంగా విడాకులు తీసుకున్న మహిళలకు భర్తల నుంచి మనోవర్తి.

8. ఒకేపనికి పురుషులతో సమాన వేతనం.

9. మహిళలకు ఓటింగ్ హక్కు

10. హిందూ కోడ్ బిల్లు.

పితృస్వామ్య సమాజంలో మహిళలకు వివక్షలతో పాటు కులం కారణంగా దళిత మహిళలు హింసను ఎదుర్కొంటున్నారు. నిచ్చెనమెట్ల సమాజంలో వెలివేయబడిన అసహాయులు వీరు. భారత మహిళా జనాభాలో 16 శాతం ఉన్న వీరిలో 90 శాతం మంది శ్రామికులే. అయినప్పటికీ సామాజిక ఉత్పత్తిలో వీరికి దక్కుతున్న ప్రతిఫలం అతిస్వల్పం. దళిత మహిళ తన జీవన పర్యంతమూ లేమితోనే బతకాల్సి వస్తోంది. దళిత మహిళ సామాజికంగా అగ్రవర్ణ పురుషులనుంచే కాకుండా దళిత పురుషుల నుంచి కూడా హింసను ఎదుర్కొంటున్నది.

<u>అంబేద్కర్</u> <u>హిందూ</u> <u>కోడ్</u> <u>బిల్లు</u> :

స్వతంత్ర భారతదేశపు మొదటి న్యాయ శాఖ మంత్రిగా అంబేద్కర్ హిందూ మహిళలకు వారసత్వ హక్కు ఆస్తిహక్కు, వంశపారపర్యంగా ఆస్తిని వాటాగా పొందే హక్కు, భరణం, వివాహం, విడాకులు, దత్తత, సంరక్షకత్వం తదితర ఎన్నో అంశాలలో మహిళలకు హక్కులను కల్పిస్తూ, బిల్లును తయారు చేశారు. ఇతర కులాలకు చెందిన పిల్లలను దత్తత తీసుకోవడం, ఇతర కులాల వారిని వివాహం చేసుకోవడంలో కూడా హక్కుల్ని కల్పించారు. ఇవన్నీ విప్లవాత్మక భావాలు. ఇదే బిల్లు గనుక పార్లమెంటులో చట్టరూపం పొందివుంటే భారత సమాజంలో స్త్రీ పురుషులు ఇరువురికీ ప్రజాస్వామిక జీవన విధానం ఏర్పడి ఉండేది. దురదృష్టవశాత్తూ, హిందూ కోడ్ బిల్లు చట్టరూపం తీసుకోకపోవడంతో మధ్య యుగాలనాటి సామాజిక భావనలు రాజ్యమేలుతున్నాయి.

అప్పటి మొదటి పార్లమెంటు సభ ఎక్కువ భాగం ఛాందస వాదులతో నిండి ఉండేది. అంబేద్కర్ హిందూకోడ్ బిల్లును ప్రత్యేక పెట్టడంతో హిందూసభ్యులు కోపంతో ఊగిపోయారు. మహిళల మీద తమకున్న అధికారం బీటలు వారుతున్నట్లుగా ఆందోళన చెందారు. స్త్రీలకు స్వేచ్ఛను, ఆస్తి హక్కును, మహిళలకు సాధికారతను ఇవ్వడానికి ఇష్టపడని కాంగ్రెస్ నాయకులు సైతం బిల్లును వ్యతిరేకించారు. సర్దార్ పటేల్, బాబూ రాజేంద్రప్రసాద్, సరోజినీ నాయుడు లాంటి వారు సైతం బిల్లును వ్యతిరేకించిన విషయాన్ని గమనించాలి. ఆర్ఎస్ఎస్ లాంటి హిందూ అతివాద సంస్థలు ఊరు వాడలా సభలు నిర్వహించి నెహ్రూ, అంబేద్కర్ బొమ్మలను తగులబెట్టాయి. ఇది సంస్కృతి మీద జరుగుతున్న దాడిగా చిత్రీకరించాయి. నెహ్రూ హిందూకోడ్ బిల్లుతో ప్రభుత్వం

ఉంటుందని ప్రకటించినప్పటికీ వ్యతిరేకత చల్లారలేదు. మొదటిసారి బిల్లును ఉపసంహరించుకున్న అంబేద్కర్ రెండోసారి కూడా పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టారు. రెండోసారి కూడా తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతో బిల్లు మురిగిపోయింది. దీనికి నిరసనగా 9 సెప్టెంబరు 1951లో అంబేద్కర్ రాజీనామా చేశారు.

బాబాసాహెబ్ అంబేద్కర్ భారత సామాజిక వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించి మార్పుల కోసం అనేక చట్టాలు ప్రవేశపెట్టారు. చాలా పుస్తకాలు రాశారు. మెజార్టీ ప్రజలైన అణగారిన కులాలకు చెందిన ప్రజలు తమ మధ్య ఉన్న వైరుధ్యాలను పరిష్కరించుకుని ఐకమత్యంతో ముందుకు కదిలినప్పుడు, సామాజిక వ్యవస్థ ప్రజాస్వామీకరణ వైపు అడుగులు వేస్తుంది. అణగారిన కులాల సమీకరణల ద్వారా ఉద్యమాల ద్వారా పెరిగిన చైతన్యం, సామాజిక సాధికారతను సాధిస్తాయి. అర్థింపుల ద్వారా హక్కులు ఏర్పడవని వాటిని పోరాడి సాధించుకోవడంతోనే దాఖలుపడతాయని అంబేద్కర్ మనకు ఉద్బోధించారు. అంబేద్కర్ ప్రతిపాదించిన సామాజిక విలువల సాధనకోసం, ప్రజాస్వామిక విలువల కోసం పోరాడడమే ఆయనకు మనమిచ్చే నివాళి.

ఎడారి బతుకులు

(17వ పేజీ తరువాయి)

అంచేపుకి మా వీదిలో ఉండే ఆడోళ్ళు, పుట్టలో పాములు ఉడుక్కి బయటకొచ్చినట్ల, ఒకొకరే ఇండ్ల బయటికి వచ్చిరి. ఇండ్లముందర నిలబడి దిక్కులు చూసి, మానుకిందుండే నా దగ్గరకి వచ్చిరి. ఒక పదిమంది దాకా ఉడ్డ చేరితిమి.

మా ఆడబిడ్డ వస్తా వస్తా "మంచి నాటిక వస్తా ఉండె. నడిమద్దెన పుటక్కన పొయిందమ్మా పాడు కరంటు. నాకు గొంతులో వెలక్కాయ పడినట్లు అయిపోయె" అంటూ వచ్చి కుచ్చునింది. అందరమూ ఒకరి మొకాలకల్ల ఒకరు చూసుకుంటా, చుట్టాల్ని పలకరించినట్లు పలకరించుకుంటిమి.

అందరమూ ఒకూరి వాళ్లమే. ఒక వీది వాళ్లమే. ఎదురుబదురు, ఇక్కనపక్కన ఇండ్లలో ఉండి గూడా, మాట్లాడుకునేది లేకుండా పొయిందంటే, టీవీలు మావూరిని ఎంత చెప్పుచేతల్లో పెట్టుకున్నాయో తెలిసిపోతుండాది. టీవిల్లోని బొమ్మలు ఎట్ల ఆడిస్తే అట్ల ఆడతా ఉండాము మేము. అవి నగితే నగతా, ఏడిస్తే ఏడస్తా ఉండాము కానీ, మనుసులతో మాట్లాడేది మరిచిపోతిమి. కరంటు పొయింది గూడా మంచిదే అయింది. అమ్మలక్కలమంతా కూరేమి చారేమి అని మంచిచెడ్డలు మాట్లాడుకుంటూ ఉండాము.

"వారం నింటి ఆయమ్మకి జెరమంట" అని ఎవరో చెప్పిరి. "అవునేమే అమ్మ, జెరమా, నాకు తెలీనే తెలీదే" అంటిని. ఆ మాటతో ఆయమ్మ ఏడుపు మొకం పెట్టి "నేను చచ్చినంక అడిగింటే ఏమి, ఇబ్బుడు అడగతా ఉండావు. వారంనింటీ పడకలో పడిందాన్ని పైకి లెయ్యనే లేదు" అనింది. నాకు గబీమనింది. ఏమీ మాట్లాడలేదు నేను. జయ చినమ్మే మల్లా నోరిప్పింది.

"ఊర్లో ఇంతమంది ఉండారు. బతికితివా సస్తివా అని అడిగినవాళ్లే లేరు. జెరం కాసిన మూడుదినాలు మంచినీళ్లు తప్ప కడుపులో ఏమీ పడలేదు. ఏడవేసి పణుకొన్న పడకతో ఆడనే ఉండిపోతి. పైకి లేసే దానికి గూడా సత్తవ లేదు. చూసేదానికి ఇంట్లో ఎవరూ లేరు. ఇరుగుపొరుగోళ్లు ఎవరన్నా వచ్చి గుక్కలో అన్ని నీళ్ల పోస్తారనుకుంటే అదీ లేదు. రెయ్యా పగలూ తెరిచిన తలుపు తెరిచినట్లే ఉండింది. వచ్చి పలకరించిన దిక్కులేదు.

లోపల్నే ఉంటే ఎవరికీ తెలీదని, మూడోదినం దేక్కుంటా వచ్చి ఇంటిముందర పణుకుంటి. దోవంటి పొయ్యేవాళ్లంతా 'పాతా పాతా నాపేరు పగ్గాపూరి' అన్నెట్లు మూతులమింద బట్టేసుకోని పొయ్యేది. ఎవరన్నా ఒకమ్మ పలకరించినా 'ఏలమ్మా అట్ల ముసుగేసుకోని పణుకోనుండావు, జెరమా, దాని తంటకు ఏలపోతివి, ఆసుపత్రికి పోగుడదా' అనేసి పొయ్యేదే కానీ, దగ్గిరకొచ్చి మంచేమి చెడ్డేమి అని అడిగినోళ్లే లేరు. పొయిలో అగ్గేసి మూడుదినాలైనా పట్టెనడ్డమో చేరడు గంజో తెచ్చిచ్చినోళ్లు లేరు.

నేను సచ్చింటే గుడకా, ఇంట్లోనింటి వాసనొచ్చే వరకూ చూసిండేవాళ్లు కాదుగదా, చేసుకునేకి సత్తవ లేకపోయినా సచ్చిపోతానేమోనని పాణం బీకారన లేసి, పొయ్యిలో అగ్గేసి అలిబలిగ అంత గంజి కాసుకోని తాగి, సుమారుగ తెపుర్లుకుంటి. నాకు పెండ్లయిన కొత్తల్లో మాయత్త నన్ను కంట చూసేది కాదు. నా మొగుడు పట్టించుకునేవాడు కాదు. మాయత్త నాకు ఒకపూట కూడేసి, ఇంకొకపూట పస్తుపెట్టేది. పనిమటుకు నిలుకు లేకుండ చెయల్ల. ఆ కస్టానికి ఆ ఒంటిపూట సంగటి చాలేది కాదు. అట్లా కాలాన ఊరోళ్లే కదా నన్ను సాగింది. నేను వారగా పోయేవరకూ అంటే సుమారు పదేండ్లు, నాతోపాటు నా బిడ్డల్ని గూడా సాకిరి. ఊర్లో పతి ఒక్కరూ నన్ను కన్నబిడ్డ మాదిరిగా చూసుకునిరి.

అబ్బుట్లో మసూరు నలపై ఇండ్ల గడప. ఊర్లోని పతి పొయ్యీ నాకు తెలుసు. ఏయాళకాడైనా ఎబ్బుడు నాకు ఆకలి అనిపించినా, నేరుగా ఎవరో ఒకరింట్లోకి పొయి, సట్టిలోని అన్నాన్ని గిన్నెలో వేసుకోని తినేసి, మూతి తుడుచుకోని పొయ్యే దాన్ని. అత్త అన్ని ఆరళ్లు పెట్టినా, పుట్నింటికి గూడా పోలేదు నేను. ఊరునే పుట్నిల్లు అనుకుంటివి. అంత బాగుండేది ఊరు. ఇబ్బుడు ఉన్నెట్ల అబ్బుడు ఉండింటె, నేను బతికిండేదాన్నే కాదు, ఎబ్బుడో మొంటిమరుగు అయిపోయిండేదాన్ని. ఒక కాకికి పదిమెతుకులు కనబడితే, ఆ మెతుకుల కాడికి పొయి మూతిపెట్టదు. నోరంతా తెరిసి, తినేదానికి ఇంకొక పదికాకుల్ని పిలస్తాది. మన ఊరు గూడా అట్లుండె. ఆ కాలం పొయింది. కుక్కబతుకు బతకతా ఉండాము. పెద్దోళ్లు అంటారే, 'కొరకలేని ఎమకను ముందరేసుకొన్న కుక్క, అది కొరకలేదు. వేరే కుకక్కఉ ఇయ్యదు' అని, అట్లయిపోయె మన బతుకులు' అని జయచినమ్మ కడుపులోని బాదనంతా యెల్లగక్కింది. నాకు అత్త వరసయ్యే శామలమ్మ అందుకునింది. "జయమ్మా నీగోడు అయింది కదా, నా గోడు విను. మొన్న ఆదివారం నాడు మావిటాళ నా మొగుడు పేటకి పొయి తునకలు తెచ్చినాడు. వస్తా వస్తా రవంచ మందు వేసుకోని వచ్చినాడు. నేను పనికిపొయ్యేసి వచ్చి,అదరాబదరా తునకలకూర వండి, సంగటి చేసి పెడితిని. అందరమూ తింటిమి. మా ఇంట్లో టీవీ లేదు కదా. ఇంక పణుకుందాములే అని పడకలు వేస్తా ఉండాను. ఉడుకు సంగటి తినేటబ్బుటికి నా మొగునికి ఉడుకెక్కి నట్లుండాది. సర్తు తుడుచుకుంటా వీదిలోకి పొయినాడు.

పొయినోడు గమ్మునుండకుండా, దోవంటి పోతా ఉండిన, వాని మేనమామ కొండడిని, కూడు తిందువురా అని పిలిచినాడంట. మా ఇంట్లో కవుసు చేసిండాములా అని గూడా చెప్పినాడంట. ఆయప్ప సరైనోడైతే నిలబడి బదులు చెప్పల్ల.

తింటే తింటాననల్ల, లేదంటే లేదనల్ల. ఏమీ మాట్లాడకుండా పోతా ఉండాడడంట. నా మొగుడు పొయి, పిలస్తా ఉంటే నీకు లెక్కాజమా లేదా అంటా ఆయప్ప చెయ్యి పట్టుకున్నెంట. ఆ నాబట్ట ఏమి చేసినాడో తెలుసా, నా మొగున్ని చెవుగూబల మింద ఒక్కటేసినాడు. వాడేమో ఎనుంపోతు ఉన్నెట్లుంటాడు. నా మొగుడేమో ఉత్తతీతవ కదా. ఆ దెబ్బకు దమ్మని కింద పడిపొయినాడు.

ఏందబ్బా సెబద్దము అనుకుంటా, నేను ఇంట్లోనింటి బయిటికి వస్తిని. పరిగెత్తి పొయి నామొగున్ని పైకి లేపితిని. వాడు మల్లా కొట్టేదానికి వస్తా ఉండాడు. బాగా తాగిండాడు. నాకు తిక్కరేగి వాని రొమ్ముగుడ్డను పట్టుకోని తోస్తిని. నా బిడ్డలు బయటికొచ్చి పెద్దంగా ఏడస్తా ఉండారు.

'ఆ నాకొడుకుని ఏమంటిని నేను, అన్నం తినమ నింది తప్పా' అంటా పక్కనుండే కట్టెనెత్తుకోని వానిమిందకు పోతా ఉండాడు నా మొగుడు. 'నువ్వేంది వాయ్ నాకు అన్నంట పెట్టేది. నేనేమన్నా అడక్కతినే వాడినేమి. నువ్వేందిరా పుట్టగోసిగా నాకు పెట్టేది' అని వాడు కలబడతా ఉండాడు. ఇద్దురూ రగతాలు కారేటట్లు కొట్టుకుం టా ఉండారు. నేను నా సత్తవారా ఇడపెరికితే ఇడగరు. అమ్మోగోడు, అబ్బోగోడు అని నా బిడ్డలు అరస్తా ఉండారు. నడమంతరాన నాకు గూడా నాలుగేట్లు తగిలినాయి. నాకాళ్లు తొక్కేసిరి. నేను లెయ్యలేక కూలబడి అరస్తా ఉండాను. కొట్టుకోని ఏడ సస్తారో అని బెదురు పుట్టేసింది. వీదిలో ఇంత రంపు జరగతా ఉంటే, ఒక్క పిల్లికూనన్నా ఇవతలికి వచ్చింటే ఒట్టు. అబ్బుటికి పొద్దు గూడా చానా కాలేదు. ఎనిమిది గంటలు అయింటాది. ఇక్కనపక్కనోళ్లు గుడకా రాలేదు. టీవీలు పెద్దంగా పెట్టుకోని వాటికల్ల ఎగచూసుకోని ఉండిపొయిరి.

ఏమంట్రా నాబట్ట గుంపా, ఊర్లో మనుసులే లేరేమిరా, అందరూ సచ్చినారా, వచ్చి వాళ్లనట్ల ఇడపెరకండ్రా అని అరస్తా ఉండాను. దేవుడే తోసుకొచ్చినట్ల, నా తమ్ముడూ వాని పెండ్లామూ, మడికాడికి నీళ్లు కట్టేకి పోతా, గలాట చూసి ఆదరాబదరా వచ్చిరి. ఇద్దర్నీ ఇడపెరికి, తిట్టి, దెబ్బలకి కట్టుకట్టి పోయిరి. ఇంత గలాట జరిగినా తొంగిగుడకా చూడలేదు ఎవరూ. ఆపొద్దునింటి ఈ ఊర్లో ఉండేది దేనికి అని నాకు తొలస్తానే ఉండాది" అంటూ నిలిపింది శామలత్త.

వాళ్ల అంగలారుపుల్ని అరసొద్దకపొయి వింటా ఉండాము. "మా, కరంటొచ్చింది రామ్మా" అని ఒకింటి నింటి పిలుపు వినబడింది. అందరూ బిలబిలా లేసి ఇండ్లల్లోకి పొయి టీవీల ముందు కూలబడిరి.

"రా చినమ్మా, రెన్నాళ్లు మా ఇంట్లో ఉండేసి వద్దువు" అంటూ మా జయ చినమ్మను రెక్కపట్టి లేపి పిలుచుకోని పొయి, మా ఇంట్లో టీవీ ముందు కుదేస్తిని.

ఇంటర్ మినిస్టీరియల్ టీం అనంత పర్యటన దృశ్యమాలిక

అభివృద్ధి అంతా అమరావతికే పరిమితమవుతున్న నేపథ్యంలో రాయలసీమ నీటి ప్రాజెక్టులు, విద్యాలయాల స్థాపన కోసం, హైకోర్టు కోసం, పరిశ్రమల కోసం రాయలసీమ ఉద్యమకారులు ప్రజా సంఘాలు కడప ఇంజనీరింగ్ హాల్‌లో సమావేశమై ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదన యధావిధిగా రాయలసీమ జాగృతి పాఠకుల కోసం...

రాయలసీమ మౌలిక సమస్యలు పరిష్కరించకుండా సీమ ప్రజల్లో వెలుగులు నింపడం సాధ్యంకాదని రాయలసీమ ప్రజా సంఘాలు నమ్ముతున్నాయి.

ఒక దేశం అయినా, రాష్ట్రం అయినా ఒకే అభివృద్ధి నమూనాతో సమగ్రంగా అభివృద్ధి సాధించలేవు. చివరకు అది ఒక కుటుంబం అయినా కూడా. బలవంతంగా పాలకులు అమలు చేస్తే అది కొన్ని ప్రాంతాలకు మాత్రమే లాభం చేకూరుస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేడు విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ పాలకులు అనుసరించిన అభివృద్ధి నమూనాతో రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రలు తీవ్ర నష్టానికి గురయ్యాయి.

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాష్ట్ర రాజధాని నిర్ణయించడానికి కేంద్ర ప్రభుత్వం శివరామకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. కానీ కమిటీ నివేదికకు వ్యతిరేకంగా రాజధానికి అనువుకాని ప్రదేశంలో, నదీ గర్భంలో రాజధాని నిర్మానానికి తెలుగుదేశం ప్రభుత్వం పూనుకుంది. కమిటీ నివేదికకు వ్యతిరేకంగా రాజధానికి నిర్మాణం అనువుగానిచోట అత్యంత వ్యయప్రయాసలతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నా ఎలాంటి అభ్యంతరాలు తెలపక కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసింది. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమలో రాజధాని నిర్మించాల్సి ఉన్నప్పటికీ ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ ఆర్ పార్టీ ఆ ప్రస్తావనే చేయకుండా విజయవాడ ప్రాంతంలో రాజధానికి సమ్మతి తెలిపి రాయలసీమకు తీరని ద్రోహం చేసింది.

ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను పది సంవత్సరాలుగా వాడుకోవటానికి రాష్ట్ర విభజన చట్టం అవకాశం కల్పించినప్పటికీ, ఆర్థిక ప్రాధాన్యత క్రమాన్ని విస్మరించి పాలకుల రాజకీయ లక్ష్యంతో రాజధానిని ఆఘమేఘాల మీద

రాయలసీమ ఉద్యమకారుల ప్రజా సంఘాల కడప డిక్లరేషన్

విజయవాడకు మార్చారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించాల్సిన పోలవరం జాతీయ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం తమ ఆధ్వర్యంలో నిర్మించే బాధ్యతను నెత్తిన ఎత్తుకొని రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను ఒడిదుడుకులకు గురిచేశారు. ఇలాంటి అసంబద్ధ పాలకపక్ష నిర్ణయాల వల్ల రాష్ట్ర విభజన చట్టంలో పూర్తిచేస్తామన్న గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలిగొండ ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడిన ప్రశ్నించక జాతీయ కాంగ్రెస్ పార్టీ రాయలసీమకు తీవ్ర ద్రోహం చేస్తోంది. ఇక రాయలసీమ ఆర్థిక, సామాజిక అంశాలే పట్టని మేధావులతో, కళాకారులతో చెట్టాపట్టాలేసుకుని రాజకీయ లబ్ధి ఊహాలో కంలో వివరిస్తున్న వామపక్షాలు కూడా రాయలసీమకు ద్రోహం చేస్తున్నాయి.

విడిపయిన తర్వాత అభివృద్ధి వికేంద్రీకరణ అని మాటలు చెప్పిన పాలకులు మాట తప్పారు. అందుకు ఉదా హరణ... మన ముఖ్యమంత్రి తనకు రెండు కళ్లు అమరావతి, పోలవరం అని ప్రకటించడమే. దురదృష్టవశాత్తు ప్రతిపక్షాలు కూడా అభివృద్ధిని వికేంద్రీకరించాలని ఒక వైపు మాట్లాడు తూనే ఉన్న నిధుల్లో ప్రాధాన్యతలు వారిగా మొదట రాయల సీమకు కేటాయించమని అడగడంమాని వెనుకబడిన ప్రాం తాల అభివృద్ధికే కాకుండా, సుస్థిర రాష్ట్ర ఏర్పాటుకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. రాష్ట్ర విభజనలో సమయంలో విభజన చట్టంలో దుమ్మగూడెం టేల్‌పాండ్‌ను చేర్చకపోవడంలో, రాష్ట్ర విభజన చట్టంలోని రాయలసీమ అభివృద్ధికి సంబంధించిన అంశాల సాధనలో అధికార, విపక్ష పార్టీల నిర్లక్ష్య వైఖరిని సమావేశం ఖండిస్తున్నది.

15.4.2018 కడపలో జరిగిన రాయలసీమ రపజా సంస్థల ఉమ్మడి సమావేశం ఏకగ్రీవంగా ఈ కింది తీర్మానాలను ఆమోదించింది.

1. రాష్ట్ర విభజన చట్టంలో పూర్తి చేస్తామన్న గాలేరు నగరి, హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి, ఈ ప్రాజెక్టులకు చట్టబద్ధత నీటి కేటాయింపులకై విబజన చట్టంలో సవరణలను చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమలో సంవత్సరానికి 7000 కోట్ల రూపాయలు వ్యవసాయ ఉత్పాదన జరుగుతుంది.
2. మిగులు జలాల మీద నిర్మిస్తున్న ప్రాజెక్టులకు నీటి లభ్య తకు అత్యంత కీలకమైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న దుమ్ముగూడెం - నాగార్జున సాగర్ టైల్‌పాండు ప్రాజెక్టును రాష్ట్ర విబజన చట్టంలో చేర్చాలి.
3. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని సకాలంలో, సక్రమంగా అందించడానికి, శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణకు అత్యంత కీలకమైన సిద్దేశ్వరం అలుగు నిర్మాణం తక్షణమే చేపట్టాలి.
4. రాయలసీమకు చట్టబద్ధ హక్కుగా ఉన్న కృష్ణా జలాల వినియోగానికి ఒక సమగ్ర విధానంతో గుండ్రేవుల రిజర్వా యర్, ఎగువ సమాంతర కాలువ, వేదవతి ఎత్తిపోతల, తుంగభద్ర వరద కాలువ, హంద్రీ-నీవా కాలువ సామర్థ్యం 8000 క్యూసెక్కులకు పెంచే నిర్మాణాలను అత్యంత ప్రాధాన్యం రపాజెక్టులాగా చేపట్టాలి.
5. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జలాలు పునపంపిణీ చేసి రాయ లసీమప్రాజెక్టులకు చట్టబద్ధంగా ఆ నీటిని కేటాయించాలి. తక్కువ కాలువ వ్యవధి వరి సాగును చేపట్టడం ద్వారా కృష్ణా డెల్టాలో ఆదా అయ్యే నీటిని, పులిచింతల నిర్మానం ద్వారా కృష్ణా జలాల నిర్వహణ సామర్థ్యం పెరగడం ద్వారా ఆదా అయ్యే 54 టీఎంసీ నీటిని, చింతలపూడి ద్వారా ఆ దా అయ్యే 32 టీఎంసీల కృష్ణా జలాలను మార్చ్ 29, 2016న ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించిన పట్టిసీమ ద్వారా ఆదా అయిన 45 టీఎంసీలను రాయలసీమకు కేటటాయింపులను రాయలసీమకు చట్టబద్ధంగా ప్రక టించారు.
6. శ్రీశైలం రిజర్వాయర్ కనీస నీటి మట్టం 854 అడుగులకు పునరుద్ధరించాలి.
7. ప్రాజెక్టుల నిర్వహణ లోపంతో వినియోగించుకొనలేని రాయలసీమకు చట్టబద్ధ హక్కు ఉన్న తుంగభద్ర జలాలను శ్రీశైలం రిజర్వాయర్‌&లో నిలువ ఉంచి, రాయలసీమ ప్రాజెక్టులకు వినియోగించుకునే చట్టబ్ధత హక్కును కలుగచేయాలి.
8. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కర్నూలులో కృష్ణానది యాజమాన్య బోర్డును ఏర్పాటు చేయాలి.
9. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఒరిస్సాలోని కేబీకే (కోరాపుట్, బోలంగిర్, కలహండీ) స్పెషల్ ప్లాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్కండ్ స్పెషల్ ప్యాకేజీ తరహా ప్యాకేజీకి కేంద్ర జిల్లాకు 50 కోట్లు నిధులు విదల్చడం ఆమోదయోగ్యం కాదు. రాయలసీమలో పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలకు, రాయలసీమలో మైనర్ ఇరిగేషన్ అభివృద్ధికి ప్రత్యేక సాగునీటి కమిషన్ ఏర్పాటుకు కావాల్సిన నిధులు బుందేల్‌కండ్, ఒరిస్సాలో వెనుకబడిన ప్రాంతాలకు ఇస్తున్న విధంగానే ఇవ్వాలి.
10. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కును రాయలసీమ వాసులకు కూడా కలుగచేయాలి. రాయలసీమ ప్రజల తాగునీటికి, రాయలసీమలోని జంతువుల తాగునీటికి, ప్రజల దినసరి సహజ అవస రాలకు, ఆరుతడి పైరల& రక్షణకు ఒకటి, రెండు తడుల లైఫ్ సేవింగ్ ఇరిగేషన్‌కు నీటి వసతి కలుగచేయాలి. (రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏఐబీపీ నిధులు, ప్రధాన మంత్రి క్రిషి సించాయ్ యోజన నిధులు రాయలసీమకు ప్రాధాన్యం ఇవ్వకుండా అభివృద్ధి చెందిన ప్రాంతాలకే తరలించారు, తరలిస్తున్నారు)
11. రాష్ట్ర విభజన చట్టంప్రకారం రాజధాని ఎంపిక కేంద్రం

నియమించే కమిటీ సూచనల ప్రకారం చేపట్టాలి. దీనికై ఏర్పాటు చేసిన శివరామక్రిష్ణన్ కమిటీ రాజధాని నిర్మాణానికి అనువుకాదన్న ప్రదేశంలో రాజధాని నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాజధాని నిర్మాణానికి యోగ్యంకాని ప్రదేశంలో రాజధాని నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశ్నించలేదు. రాజధాని నిర్మాణంపై పునసమీక్షించి, శ్రీబాగ్ ఒప్పందం మేరకు రాయలసీమలో రాజధానిని ఏర్పాటు చేయాలి.

12. రాజధాని ప్రాంతంలోని ఉద్యోగాలను ఆ ప్రాంత జోన్‌లో ఉన్న వారికే కేటాయించారు. ఈ ఉద్యోగ నియామకాలను రద్దు చేసి, రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్‌గా ప్రకటించి ఉద్యోగ నియామకాలు చేపట్టాలి.

13. వెనుకబడిన ప్రాంత యువతకు ఉద్యోగావకాశాలు, ఈ ప్రాంత ఆర్థికంగా అభివబుద్ధి సాధించడానికి విభజన చట్టంలో పేర్కొన్న కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం వెంటనే చేపట్టాలి.

14. రైల్వే జోన్ ఏర్పాటుకు అవసరమైన అన్ని మౌలిక వసతులున్న గుంతకల్లులో రైల్వే జోన్ ఏర్పాటు చేయాలి.

15. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న కేంద్ర సంస్థలైన కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని అనంతపురంలో, వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కర్నూలు జిల్లాలో, ఎయిమ్స్‌ను అనంతపురంలో, కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను చిత్తూరులో, దుగిరాజపట్నం ఓడరేవు నిర్మాణం, హైదరాబాద్ కేంద్రంగా ఉన్నా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పడంలో రాయలసీమకు ప్రాధాన్యం ఇవ్వాలి.

16. అధికార వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, వ్యవసాయ కమిషనరేట్, ఉద్యాన పంటల కమిషనరేట్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ, దేవాదాయశాఖ కమిషనరేట్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ హెడ్‌క్వార్టర్స్, మార్కెటింగ్ కమిషనరేట్, సాగునీఇ శాఖ ఈఎన్‌సీ కార్యాలయం, ఏపీఎస్ఈబీ హెడ్ క్వార్టర్స్ సంస్థల కార్యాలయాలు రాయలసీమలో ఏర్పాటు చేయాలి.

17. రాయలసీమలో పారిశ్రామిక అభివృద్ధికి హైదరాబాద్-కర్నూలు-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై-తిరుపతి-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలి.

18. చిత్తూరు జిల్లాలోని మన్నవరంలో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులో నిర్మాణాలు ఆగిపోకుండా కొనసాగించాలి.

19. రాయలసీమ చరిత్ర, సంస్కృతి, సాహిత్య, కళలు, జానపద తదితర అంశాల అధ్యయానికి, వికాసానికి ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలి.

20. రాయలసీమ డిక్లరేషన్ చేసిన బీజేపీ తన నిజాయితీని నిరూపించుకోవాలి. రాయలసీమ సమస్యలపై కర్నూలు వేదికగా బీజేపీ సీమ డిక్లరేషన్‌ను ప్రకటించింది. వారి రాజకీయ విధానాల పట్ల భిన్నాభిప్రాయాలు ఉన్నా, సీమ ప్రజా సంఘాలు వారి డిక్లరేషన్‌ను సావగతిస్తుఅన్నయి. దీనిని తమ అధినాయకత్వంతో విధాన ప్రకటనను తక్షణమే చేయించి, వీటి అమలుకు కార్యాచరణ చేపట్టాలి.

21. రాష్ట్ర విబజన సందర్భంగా కేంద్రం విభజన చట్టాన్ని రూపొందించింది. హామీగా ప్రత్యేక హెూదాను ప్రకటించింది. విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పోలవరం నిర్మాణం, రాజధానికి నిధులు, రైల్వేజోన్, కోస్టల్ కారిడార్, 12 విద్యా సంస్థలు, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒరిస్సాలోని కేబీకే (కోరాపుట్, బోలంగీర్, కలహండీ) స్పెషల్ ప్లాన్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశలోని బుందేల్‌ఖండ్ స్పెషల్ ప్యాకేజీ తరహా ప్యాకేజీ కింద నిధులు, కడప ఉక్కు,

కడప సమావేశానికి హాజరైన వివిధ ప్రజా సంఘాల నాయకులు

మన్నవరం, ఉత్తరాంధ్ర, రాయలసీమ నీటి ప్రాజెక్టులకు నిధులు దుగిరాజ పట్నం ఓడరేవు. హైదరాబాద్‌లో ఉమ్మడి సంస్థల్లో వాటా లాంటివి 10 సంవత్సరాల్లో పూర్తి చేయాలి. దాదాపు వాటి విలువ 6 లక్షల కోట్లు పైమాటే. ఇంతటి విలువైన హక్కుగా ఉన్న అంశాల సాధణ రాయలసీమ భవిష్యత్తుకు అత్యంత కీలకం. రాయలసీమ ప్రాంత సాంఘిక, ఆర్థిక అభివృద్ధితో రాయలసీమ ప్రజల హెూదాను పెంచే విభజన చట్టం అమలు కోసం జరిగే ప్రయత్నంలో రాయలసీమ ప్రజలు భాగస్వాములు కావాలని రాయలసీమ డిక్లరేషన్ కోరుతోంది.

22. రాజకీయ పార్టీలు ఇప్పటికైనా తమ స్వార్థరాజకీయాలను వదిలి వెనుకబడిన ప్రాంతాల సమానాభివృద్ధితోనే రాష్ట్ర సుస్థిరత సాధిస్తామని గ్రహించి రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలపై పోరాడాలని డిమాండ్ చేస్తున్నాం.

23. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాల్సిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, వాటి సాధనకు ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచే కార్యక్రమాలను రాయలసీమలోని అనేక ప్రజా సంఘాలు చేపట్టడానికి రాయలసీమ ప్రజా సంఘాలు సమన్వయ వేదిక ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టడానికి తీర్మానించడమైనది.

ముఖ చిత్రం : ప్రకృతి రమణీయతలో మయూరం   ఫ్రంట్ ఇన్నర్ : బౌద్ధ సన్యాసి   బ్యాక్ పేజీ : ప్రకృతి ఒడిలో సేదతీరుతున్న హరిణం

అక్షర యజ్ఞంలో భాగస్వాములుకండి

రాయలసీమ జాగృతి మాసపత్రికకు సంవత్సర చందా రూ.240/- మాత్రమే జీవిత చందా రూ.5000/- మాత్రమే

మీ చందాను ఈ అకౌంట్‌కు కూడా జమ చేయవచ్చు

Account Name : RAYALASEEMA JAGRUTI, Current Acc. No. 400200301000142

VIJAYA BANK, Subash Road, Anantapuramu, IFSC Code : VIJB0004002

Postal Regn. No. ATP/60/2017-19



Printed & Published Owned by : S.SREEHARI MURTHY, & Printed at D.No.13/3-645, KHAJA NAGAR, ANANTAPURAMU - 515001, Anantapuramu (A.P.)
Published at M/S SIRI PUBLICATIONS, 13/3-645, KHAJA NAGAR, Anantapuramu Dist. (A.P), R.N.I. Regd No : APTEL/2016/69069. Cell : 9866216044